ఆదివారం
గత వారంలో కొత్త వార్తలు
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
తాడేపల్లిగూడెం
: fb.com/vaartha Digital
Published from Tadepalligudem, Kurnool, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Srikakulam
28-1-2026 బుధవారం సంపుటి: 31 సంచిక: 357 పేజీలు: 8+4 వెల: 6.50

**ఫుట్‌బాల్ మైదానంలో కాల్పులు, 11 మంది మృతి**
**ఇరాన్‌పై దాడికి అమెరికా యుద్ధనౌక సిద్ధం**
5లో


ఇయు-భారత్ వాణిజ్య ఒప్పందం సందర్భంగా మంగళవారం న్యూఢిల్లీలో యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా, యూరో పియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియోతో ప్రధాని మోడీ

## ఇయు-భారత్ మధ్య స్వేచ్ఛా వాణిజ్యం

- ఇండియా వాణిజ్య చరిత్రలోనే అతిపెద్ద డీల్
- 180 బిలియన్ యూరోల స్థాయికి వాణిజ్యం
- ఇయు దేశాల్లో 8 లక్షల భారతీయులు
- ఒప్పందం అనంతరం మీడియాతో ప్రధాని మోడీ, ఇయు నేతలు

**న్యూఢిల్లీ,జనవరి 27:** భారత్ - యూరోపియన్ యూనియన్ మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ఎఫ్‌టీఏ భారత వాణిజ్య చరిత్రలోనే అతి పెద్దదిగా ప్రధాని నరేంద్ర మోడీ పేర్కొన్నారు. ఇది కేవలం వాణిజ్య ఒప్పందం మాత్రమే కాకుండా, ఇరుదేశాల సంక్షేమానికి బ్లూప్రింట్‌గా నిలుస్తుందని వ్యాఖ్యానించారు. ఈ ఒప్పందంతో భారత వాణిజ్యంలో సరికొత్త శకం ప్రారంభమవుతుందని ఆశాభావంవ్యక్తంచేశారు. మంగళవారం దిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో >>2

**రెండు దశాబ్దాల కృషికి చిహ్నం: ప్రధాని మోడీ** 2లో

## సాగునీటి ప్రాజెక్టులు

### 10 జిల్లాల్లో 20 పైగా

- పూర్వోదయ నిధులతో సమగ్రాభివృద్ధి
- పెండింగ్ ప్రాజెక్టులు తొలుత పూర్తి చేద్దాం
- డిమాండ్‌కు అనుగుణంగా ఉద్యాన ఉత్పత్తులు
- రాయలసీమ, ప్రకాశం జిల్లాల్లో ఉద్యానవన అభివృద్ధిపై సమీక్షించిన సిఎం చంద్రబాబు


మంగళవారం అమరావతిలో ఉద్యానరంగ అభివృద్ధిపై సమీక్ష నిర్వహిస్తున్న సిఎం చంద్రబాబు

**విజయవాడ.జనవరి 27,ప్రభాతవార్తప్రతినిధి:** గ్లోబల్ మార్కెట్లో డిమాండ్‌కు అనుగుణంగా ఉద్యాన ఉత్పత్తులు పండించాలని సిఎం చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. దానికి అనుగుణంగా అభివృద్ధికి ప్రణాళికలు చేపట్టాలని ఆదేశించారు. రాయలసీమ, ప్రకాశం, మార్కాపురం జిల్లాల్లో 500 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పతులను పండించడమే లక్ష్యంగా కార్యాచరణ సిద్ధం చేయాలని సిఎం సూచించారు. 10 జిల్లాలను ఉద్యాన రంగానికి కేంద్ర బిందువుగా చేపట్టే సమీకృత అభివృద్ధి ప్రణాళికలపై మంగళవారం సిఎం క్యాంప్ కార్యాలయంలో వివిధ శాఖల మంత్రులు, ఉన్నతాధికారులతో ముఖ్య మంత్రి చంద్రబాబు సమీక్షించారు. పూర్వోదయ, సాస్కి, రాష్ట్ర ప్రభుత్వ నిధుల వినియోగంలో సమన్వయం చేసుకుంటూ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. ఇదే సమయంలో సీమ, ప్రకాశం, మార్కాపురం జిల్లాల్లోని ఇరిగేషన్ ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. గత ప్రభుత్వం ఇరిగేషన్ రంగాన్ని పూర్తిగా నిరక్ష్యంల్ల చేసిందని... చాలా వరకు ప్రాజెక్టులను పెండింగులో పెట్టేసిందని మంత్రులు నిమ్మల, పయ్యావుల కేశవ్ ప్రస్తావించారు. 10 జిల్లాల పరిధిలో ప్రాధాన్యతల వారీగా ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టాలని... అలాగే తక్కువ నిధులను కేటాయిస్తే త్వరగా పూర్తయ్యే ప్రాజెక్టులను తొలుత చేపట్టాలని సిఎం చంద్రబాబు ఆదేశించారు. వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణాన్ని ఈ ఏడాదిలో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అలాగే గత ప్రభుత్వం నిరక్ష్యంల్ల వల్ల కొట్టుకుపోయిన అన్నమయ్య ప్రాజెక్ట్ నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. గాలేరు నగరి ప్రాజెక్టు ద్వారా కృష్ణా జలాలను కడప వరకు తీసుకెళ్లే అంశంపై దృష్టి సారించాలని ముఖ్యమంత్రి చెప్పారు. ఈ దిశగా సుమారు 20కు పైగా ప్రాజెక్టులను అభివృద్ధి చేయాల్సి ఉంటుందని అధికారులు వివరించారు.

మొత్తంగా ఈ ప్రాజెక్టుల ద్వారా కొత్తగా 8.87 లక్షల ఎకరాల ఆయకట్టు, అలాగే 4.30 లక్షల ఎకరాల స్థిరీకరణకు నీళ్లు అందించవచ్చని అధికారులు సిఎంకు తెలిపారు. సీమ ప్రాజెక్టులతో పాటు... ఉత్తరాంధ్ర జిల్లాల్లో కూడా ప్రాజెక్టులను చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలవరం ఎడమ కాల్వ పనులు పూర్తి అయితే గోదావరి జలాలను ఉత్తరాంధ్ర వరకు తీసుకెళ్ల వచ్చన్నారు. అప్పుడు పోలవరంవంశధార నదుల అనుసంధానం ప్రాజెక్టు చేపట్టవచ్చని సూచించారు. ఈలోగాఉత్తరాంధ్ర ప్రాంతం >>2

## అమరావతికి చట్టబద్ధ బిల్లుపై కేంద్రాన్ని కోరాం



- అఖిలపక్ష సమావేశం వివరాలు తెలిపిన టిడిపి పార్లమెంటరీ నేత కృష్ణదేవరాయలు
- నేటినుంచి పార్లమెంటు

**విజయవాడ.జనవరి27,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపి రాజధాని అమరావతికి చట్టబద్దత కల్పించే బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని కేంద్రాన్ని కోరినట్లు టిడిపి పార్లమెంటరీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు.ఢిల్లీలో జరిగిన అఖిలపక్ష సమావేశంలో టిడిపి పార్లమెంటరీ నేత లావు శ్రీకృష్ణ దేవరాయలుపాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎపి ప్రయోజనాలతో పాటు దేశవ్యాప్త సమస్యలను లేవనెత్తినట్లు ఎంపీ తెలిపారు. సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. భేటీలో ప్రధానంగా 16 యేళ్లలోపు యువతకు సోషల్ మీడియా అందుబాటులో లేకుండా నిషేధించాలనే అంశంపై పార్లమెంట్‌లో చర్చజరగాలని కోరినట్లు తెలిపారు. పొగాకుపై సెస్‌స్థానంలో జీఎస్టీ ప్రవేశపెట్టడంవల్ల చాలా గందరగోళ పరిస్థితి ఏర్పడిందన్నారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొందని తెలిపారు. ఈ అంశంపై చర్చ జరిగి సమస్య పరిష్కారం జరగాలని కోరానన్నారు. ఛార్జ్‌షీట్ నమోదైనా చాలా మంది క్రియాశీలక రాజకీయాల్లో చురుగ్గా పాల్గొంటున్నారని, ఈ అంశంపైనా పార్లమెంటులో చర్చ అవసరమని లేవనెత్తినట్టు ఎంపీ చెప్పారు.ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించాలని కోరామన్నారు ఎంపీ. పూర్వోదయ పథకం కింద ఒడిశా, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలను చేర్చినట్లే ఆంధ్ర ప్రదేశ్‌కూ ఈ పథకం వర్తింపజేయాలని.. దీనిపై చర్చ జరగాలని కోరినట్లు తెలిపారు. గతంలో జల్ జీవన్ మిషన్ కింద ఎపికి 26 వేల కోట్లు మంజూరైనా.. రాష్ట్ర వాటా కింద నిధులు సమకూర్చాల్సి వస్తుందని, కేవలం రూ.2 వేల కోట్ల కేంద్ర నిధులు మాత్రమే వినియోగించుకున్నారని ఆయన విమర్శించారు. ప్రస్తుతం పెద్ద మొత్తంలో నిధులు సమకూర్చగలిగితే రాష్ట్రం వినియోగించుకునేందుకు సిద్ధంగా ఉందని, ఈ అంశంపై చర్చ జరగాలని ప్రతిపాదించామని లావు శ్రీకృష్ణదేరాయలు పేర్కొన్నారు.

## వ్యక్తిత్వ హక్కులపై ఢిల్లీ హైకోర్టుకు అకీరా నందన్

- ఎఐ సినిమా లవ్‌స్టోరీపై నిషేధం విధించిన కోర్టు
- యూట్యూబ్, ఫేస్‌బుక్‌కు నోటీసులు



**విజయవాడ.జనవరి 27.ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ కుమారుడు అకీరా నందన్ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించాడు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉపయోగించి రూపొందించిన ఓ సినిమాతో తన వ్యక్తిత్వం, గోప్యతా హక్కులను ఉల్లంఘించారని తన పిటిషన్‌లో ఆరోపించాడు. ఎఐ మార్ఫింగ్ డీప్ ఫేక్ టెక్నాలజీతో రూపొందించిన ఈ సినిమాలో తన ముఖ కవళికలు, స్వరం, వ్యక్తిత్వాన్ని ఉపయోగించారని పిటిషన్‌లో పేర్కొన్నాడు అకీరా. ఎఐ సినిమాతో పాటు, యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, ఎక్స్‌లలో పెద్ద సంఖ్యలో తన పేరుతో >>2

## ఇంజినీరింగ్ విద్యార్థి హాస్టల్ గదిలో ఆత్మహత్య

### నారాయణవనంలో విషాదం

**నారాయణవనం(తిరుపతి జిల్లా), జనవరి 27 ప్రభాతవార్త:** తిరుపతి జిల్లా పుత్తూరు సమీపం నారాయణవనం మండలం పరిధి సిద్దార్థ ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం (ఇఇఇ) బిటెక్ చదువుతున్న ప్రదీప్‌కుమార్(19) ఓ ప్రవేటు హాస్టల్ గదిలో ఉరేసుకొని ఆత్మ హత్య చేసుకున్న సంఘటన మంగళవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. విద్యార్థి ఆత్మ హత్యకు సంబందించి వివరాలుఇలా వున్నాయి. కర్నూలు జిల్లా పత్తికొండకు చెందిన కృష్ణమూర్తి కుమారుడు ప్రదీప్ >>2

**నరసరావుపేటలో మరో విద్యార్థి ఆత్మహత్య** 2లో

## కార్మిక హక్కుల భద్రతకే కొత్త లేబర్ కోడ్

### కేంద్ర కార్మిక శాఖమంత్రి శోభాకరండ్లజే

**విజయవాడ,జనవరి27,ప్రభాతవార్తప్రతినిధి:** కార్మికుల హక్కుల పరిరక్షణ, ఉపాధి అవకాశాల పెంపుతోపాటు పరిశ్రమలకు అనుకూల వాతావరణం కల్పించడమే కొత్త లేబర్ కోడ్‌ల ప్రధాన లక్ష్యమని కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ సహాయ మంత్రి శోభా కరండ్లజే తెలిపారు. స్థానిక నోవాటెల్ హోటల్‌లో మంగళవారం కొత్త కార్మిక సంస్కరణలపై ప్రాంతీయ సదస్సు జరిగింది. ఈ సదస్సేలో కేంద్ర కార్మిక శాఖ సహాయ మంత్రి శోభా కరండ్లజే మాట్లాడుతూ.. దేశంలో నవంబర్ 21న కొత్త లేబర్ కోడ్ (కార్మిక చట్టం) అమలులోకి వచ్చిందన్నారు. ఈ కొత్త చట్టం రాబోయే రోజుల్లో ఉద్యోగులు, యజమానుల జీవితాల్లో గొప్ప మార్పును తీసుకువస్తుందన్నారు. మన దేశంలో బ్రిటిష్ కాలం నాటి 29 పాత చట్టాలు అమలులో ఉండేవన్నారు. ఆ చట్టాలు మన కార్మికులకు అనుకూలంగా తీసుకురాలేదన్నారు. నవభారతంలో, కొత్తతరం కోసం కొత్త చట్టాలఅవసరం ఉందన్నారు. దీన్ని గుర్తించిన ప్రధాన మంత్రి నరేంద్ర


మంగళవారం విజయవాడలో జరిగిన సదస్సులో కేంద్ర మంత్రి శోభా కరండ్లజే, రాష్ట్ర మంత్రి వాసంసెట్టి సుభాష్

మోడీ నాయకత్వంలో కార్మిక మరియు ఉపాధి శాఖ ఈ కొత్త చట్టాలను తీసుకువచ్చిందన్నారు. కార్మిక రంగం అనేది రాష్ట్రాల పరిధిలోకి వచ్చే అంశమని, దీని అమలు బాధ్యత >>2

## ఇది 'డబులింజన్' బుల్లెట్ రైలు

### టిడిపి బలం, బలగం కార్యకర్తలే

- మంత్రులు వారానికోసారి పార్టీ కార్యాలయానికి రావాలి
- అభివృద్ధి, సంక్షేమానికి బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబు
- పార్లమెంటరీ కమిటీ వర్క్‌షాప్‌లో మంత్రి లోకేష్
- శిక్షణ తరగతులను ప్రారంభించిన మంత్రి


మంగళగిరి టిడిపి కేంద్ర కార్యాలయంలో జరిగిన పార్లమెంట్ కమిటీ వర్క్ షాప్‌లో మంత్రి లోకేష్

**విజయవాడ, జనవరి 27 ప్రభాతవార్త ప్రతినిధి:** "మారుతున్న కాలానికి అనుగుణంగా పార్టీలో మార్పులు రావాలి. తెలుగుదేశం పార్టీ బలం, బలగం కార్యకర్తలు. పార్టీ అంటే కమిట్‌మెంట్ ఉంది కాబట్టే పార్టీ కమిటీల్లో బాధ్యత కల్పించాం. దేశంలో అభివృద్ధి, సంక్షేమానికి బ్రాండ్ అంబాసిడర్ సిబిఎన్. అనేక పరిశ్రమలు ఎపికి వస్తున్నాయంటే కారణం చంద్రబాబు" అని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి, విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. మంగళగిరి టిడిపి కేంద్ర కార్యాలయంలో పార్లమెంట్ కమిటీ వర్క్ షాప్‌ను టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావుతో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ శిక్షణా తరగతులకు ఇటీవల నియమించిన 25 పార్లమెంట్ నియోజకవర్గాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో పాటు కమిటీ సభ్యులందరూ హాజరయ్యారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ "పార్లమెంట్ కమిటీల్లో మొదటిసారి ఎన్నికైన వారు 83శాతం మంది ఉన్నారు. సీనియర్లను, జూనియర్లను సమానంగా గౌరవిస్తా, పనిచేసే వారిని ప్రోత్సహిస్తాను. దానికి మీరో ఉదాహరణ" అని పేర్కొన్నారు.

దేశంలో ఏ పార్టీకి లేని కార్యకర్తలు ఒక్క తెలుగు దేశానికే సొంతం. మన బలం, బలగం మన కార్యకర్తలు అని అన్నారు. "దేశంలో అభివృద్ధి, సంక్షేమానికి బ్రాండ్ అంబాసిడర్ సిబిఎన్, ఆయన ఎప్పుడూ ఓ ట్రెండ్ సెట్టర్. 75 యేళ్ల వయసులో కూడా యువకుడిలా పనిచేస్తున్నారు. ఆయనలో ముగ్గురు 25 ఏళ్ల యువకులు ఉన్నారు. ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు సేవ చేయాలని నిత్యం ఆలోచించే వ్యక్తి >>2

## పార్టీకి పనిచేయకపోతే బాధ్యత నుంచి తప్పిస్తా

- పార్లమెంటరీ కమిటీల సమావేశంలో సిఎం చంద్రబాబు
- యువ నాయకత్వంపైనే పార్టీ భవిష్యత్తు

**విజయవాడ.జనవరి27,ప్రభాతవార్తప్రతినిధి:** భవిష్యత్తులో కూడా ఓటమి చవి చూడని పార్టీగా రాష్ట్రంలో టిడిపికి గట్టిపునాదులు వేయాలని ఆ పార్టీ జాతీయ నేత, సిఎం చంద్రబాబు అన్నారు.43 యేళ్ల మన పార్టీకి 48 యేళ్ల యువ నాయకత్వానికి బాధ్యత అవసరమన్నారు.ఇప్పుడు సగటున ఆ వయస్సు వారే మన పార్టీ కీలక నాయకులు ఉన్న విషయం గమనించాలన్నారు.పార్లమెంటరీ కమిటీలతో చంద్రబాబు సమావేశం ముగిసింది. పార్టీ కోసం పనిచేయని వారిని తప్పించేందుకు వెనుకాడనని తెలుగుదేశం పార్టీ అధినేత,ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఎవరికైనా పార్టీనే కీలకమని ఈ సందర్భంగా సిఎం గుర్తు చేశారు. రాబోయే ఎన్నికల్లో ప్రతీ బూత్‌లో 10 ఓట్లు పెరగాలే కానీ తగ్గకూడదని స్పష్టం చేశారు. ఆర్థిక ఇబ్బందులు ఎన్ని ఉన్నప్పటికీ చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు వివరించి చెప్పే బాధ్యత పార్లమెంట్ అధ్యక్షులు తీసుకోవాలని చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.

**హంద్రీనీవా నీరు తెస్తామని డ్రామాలు:** పవిత్రమైన తిరుమల వేంకటేశ్వర స్వామి ప్రసాదమైన లడ్డూలో కల్తీ నెయ్యి కలిపారని సిఎం చంద్రబాబు ధ్వజమెత్తారు. పాలు లేకుండానే నెయ్యి తెచ్చారనీ, దాన్ని కూడా సమర్థించుకుంటున్నారంటే ఏం చేయాలని ఆక్షేపించారు. కుప్పంలో హంద్రీనీవా నీరు తెస్తున్నామని డ్రామా ఆడారని దుయ్యబట్టారు. మరుసటి రోజు గేటు ఎత్తుకుపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెలిగొండను కూడా పూర్తి చేయకుండా జాతికి అంకితం చేశారని మండిపడ్డారు. మనం చేసే పనులు ఎంత ముఖ్యమో తప్పుడు ప్రచారాన్ని ఎక్కడిక్కడ తిప్పి కొట్టడం అంతే ముఖ్యమని చంద్రబాబు స్పష్టం చేశారు. సోషల్ మీడియా, మీడియాలోనే కాదు. మౌత్ టు మౌత్ కూడా చెప్పాలనీ, అప్పుడే అందరిలో అర్థమవుతుందని సిఎం చంద్రబాబు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. 4వ సారి ముఖ్యమంత్రి అయినా సామాన్య కార్యకర్తలానే సీఎం చంద్రబాబు పార్టీ శిక్షణ >>2


మంగళవారం మన్యం జిల్లా శంబర గ్రామంలో అత్యంత వైభవంగా జరిగిన సిరిమాను సంబరం

## అంబరాన్నంటిన సిరిమాను సంబరం

### అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి సంధ్యారాణి

**మక్కువ (పార్వతీపురం మన్యం జిల్లా), జనవరి 27 ప్రభాతవార్త:** ఉత్తరాంధ్ర గిరిజన ఆరాధ్య దేవత పోలమాంబ అమ్మవారి సిరిమాను సంబరం మంక్కువ మండలం శంబర గ్రామంలో వైభవంగా జరిగింది. సిరిమాను సంబరాన్ని తిలకించేం దుకు రాష్ట్రం నలుమూలల నుండి పక్క రాష్ట్రాల నుండి సుమారు రెండున్నర లక్షల పైగా భక్తులు దర్శించుకున్నారు. మంగళవారం ఉదయం రాష్ట్ర ప్రభుత్వం తరపున రాష్ట్ర గిరిజన సంక్షేమ మరియు స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి >>2



మంగళవారం న్యూఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో భేటీ అయిన పిసిసి చీఫ్ వైఎస్ షర్మిల

# రాహుల్‌తో షర్మిల భేటీ

**విజయవాడ,.జనవరి 27,ప్రభాతవార్త ప్రతినిధి:** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో పిసిసి చీఫ్ వైఎస్ షర్మిల ఢిల్లీలో మంగళవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంలో రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులపై ఆమె రాహుల్‌గాంధీతో చర్చించారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని పునరుద్ధరించేందుకు రాష్ట్రంలో చేసే పోరాటంలో పాల్గొనాలని రాహుల్‌ని కోరారు. మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకానికి పిబ్రవరి 2తో 20 ఏళ్లు పూర్తవుతున్నాయి. బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసిందనే అంశంపై షర్మిల్ రాహుల్‌తో మాట్లాడారు. ఉపాధి హామీ పథకాన్ని పునరుద్ధరణకు ఎపిలో భారీ ఎత్తున ఉద్యమం చేపడుతున్నట్లు వివరించారు. ఉపాధి హామీ పథకాన్ని తొలుత ప్రారంభించింది ఎపిలోనే అని రాహుల్‌కు ఆమె వివరించారు. ఉపాధి హామీ పథకాన్ని ప్రారంభించిన బండ్లపల్లి నుంచి రాష్ట్రంలో ఉద్యమం ప్రారంభిస్తామని రాహుల్‌కు తెలిపారు. రాహుల్‌తో భేటీ అనంతరం షర్మిల మీడియాతో మాట్లాడుతూ ఉపాధి హామీ పోరాటానికి రాష్ట్రానికి రావాలని రాహుల్‌ని ఆహ్వానించినట్లు వివరించారు. రాహుల్ గాంధీ వచ్చేందుకు అంగీకరించారన్నారు. రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఉద్యమానికి శ్రీకారం చుడుతున్నామన్నారు.

## ఎపి సచివాలయ సిఎస్ఓ మల్లికార్జునరావుకు
# ఇండియన్ పోలీస్ మెడల్



**విజయవాడ,జనవరి27,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సచివాలయం ముఖ్య భద్రతాధికారి(సిఎస్ఒ)గా పని చేస్తున్న పోలవరపు వెంకట శేష నాగ మల్లికార్జునరావుకు భారత ప్రభుత్వ ప్రతిష్టాత్మక మెడల్ అయిన మెరిటోరియస్ సర్వీస్ మెడల్ (ఇండియన్ పోలీస్ మెడల్)ను జనవరి 2026 గణతంత్ర దినోత్సవం సందర్భంగా భారత ప్రభుత్వం ప్రకటించింది. ప్రస్తుతం సిఎస్ఒగా పనిచేస్తున్న మల్లికార్జునరావు కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు వాస్తవ్యులు వీరి బాల్యం మరియు విద్యాభ్యాసం గుడివాడలోను, ఉన్నత విద్యాభ్యాసం విజయవాడలోను సాగింది. 1989వ సంవత్సరంలో ఐటిబిపి (పారా మిలటరీ)లో కులు, హిమాచల్ ప్రదేశ్‌లో ట్రైనింగ్ చేసి అక్కడ నుంచి వివిధ యూనిట్లో ఢిల్లీ, హర్యానా, చండీగఢ్ నందు విధులు నిర్వర్తించారు. అనంతరం 1993 సెప్టెంబరులో ఐటిబిపి నుంచి పర్మినెంట్ అబ్జర్వేషన్ మీద ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక రక్షణ దళం (ఎపి ఎస్పిఎఫ్)లో చేరారు. మల్లికార్జునరావు ఎపి ఎస్పిఎఫ్ లో 1993 నుంచి వివిధ యూనిట్స్‌లో అనగా డిజి ఎస్పిఎఫ్ హెడ్ క్వార్టర్స్ హైదరాబాద్, ఐడిపిఎల్, ఏపీ హైకోర్టు, కెటిపిఎస్ పాల్వంచ, ఆర్టిపిపి కలముల, టిటిడి తిరుమల, ఓఎన్జిసి రాజమండ్రి, కడప, రాజమండ్రి, విజయవాడ విమానాశ్రయాల్లోను, జిపిపి విజయవాడలో పని చేశారు. అదే విధంగా విజయవాడ జోన్ కమాండెంట్ కార్యాలయంలో డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ అధికారిగా, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గాను విధులు నిర్వహించారు. ప్రస్తుతం ఎపి సచివాలయంలో ముఖ్య భద్రతాధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. అంతేగాక ఐటిబిపి మరియు ఎపిఎస్పిఎఫ్‌లో 1989 నుంచి చేసిన సేవలు గుర్తించి క్యాష్ రివార్డ్స్ 27, గుడ్ సర్వీస్ ఎంట్రీస్17 కమెండేషన్08 ఏప్రిసియేషన్04 మరియు ఏపీ పోలీస్ మెడల్స్ అనగా 2006 ఏపీ పోలీస్ సేవా పథకం, 2013లో ఏపీ ఉత్తమ సేవా పథకం వంటి అవార్డులు పొందారు. ఐటిబిపి మరియు ఏపీఎస్పిఎఫ్ లో చేసిన 36 సంవత్సరాల సేవల్లో భాగంగా ఎన్నో రివార్డ్స్, అవార్డ్స్ మరియు పథకాలు పొందిన ప్రస్తుత సచివాలయం ముఖ్య భద్రతాధికారైన అసిస్టెంట్ కమాండెంట్ మల్లికార్జున రావు సేవలను గుర్తించి భారత ప్రభుత్వ ప్రతిష్టాత్మక మెడల్ అయిన మెరిటోరియస్ సర్వీస్ మెడల్ (ఇండియన్ పోలీస్ మెడల్)ను జనవరి 2026 గణతంత్ర దినోత్సవం సందర్భంగా భారత ప్రభుత్వం ప్రకటించింది. మల్లికార్జున రావుకు ఇండియన్ పోలీస్ మెడల్ రావడం పట్ల ఆంధ్రప్రదేశ్ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్సు డిజి, ఐజి, కమాండెంట్లు, ఏపీఎస్పిఎఫ్ సెక్రటేరియట్ అధికారులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేసి ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఢిల్లీ హైకోర్టుకు అకీరా నందన్

>> నకిలీ ప్రొఫైల్స్, సోషల్ మీడియా పేజీలు ఉన్నాయని, వాటిని తొలగించాలని హైకోర్టును అకీరా నందన్ అభ్యర్థించాడు. అతడి పిటిషన్ స్వీకరించిన హైకోర్టు ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. ఎఐ సాయంతో తీసిన ఓ లవ్ స్టోరి సినిమాపై హైకోర్టు నిషేధం విధించింది. కృత్రిమ మేధస్సు, డీప్ ఫేక్ సాంకేతిక పరిజ్ఞానాల ద్వారా అకీరా నందన్ పేరు, ఇమేజ్, పోలిక, స్వరం, వ్యక్తిత్వాన్ని ఉపయోగించడం దోపిడీ చేయడమేనని హైకోర్టు వ్యాఖ్యానించింది. పిటిషనర్ ప్రతిష్టకు భంగం కలిగించేలా వక్రీకరించిన కంటెంట్‌ను రూపొందించడం ద్వారా అతని గోప్యతా హక్కును ఉల్లంఘించడమేనని పేర్కొంది.
ఈ వీడియోకు సంబంధించిన సోషల్ మీడియా ఖాతాలు తొలగించాలని, ఐపి వివరాలను బహిర్గతం చేయాలని మెటా, యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్ బుక్, ఎక్స్ సంస్థలకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ కేసు విచారణ జస్టిస్ తుషార్ రావు ధర్మాసనం ముందు జరిగింది. అకీరా నందన్ తరఫున సీనియర్ న్యాయవాది సాయి దీపక్ ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ వేశారు. గూగుల్‌తరఫున ఆదిత్యాగుప్తా, మెటాతరఫున వరుణ్‌పాఠక్ న్యాయవాదులు కోర్టులో హాజరయ్యారు.

# నరసరావుపేటలో ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

**నరసరావుపేట క్రైమ్, జనవరి 27, ప్రభాతవార్త :** నరసరావుపేట ఆక్స్ ఫర్డ్ విట్ ఇంటర్ కళాశాల విద్యార్థి కొరకుల బాల కోటిరెడ్డి(17) అనే సీనియర్ ఇంటర్ విద్యార్థి హాస్టల్ గదిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ దారుణ ఘటన స్థానికంగా కలకలం రేపింది. స్థానికుల సమాచారం ప్రకారం బాపట్ల జిల్లా సంతమాగులూరు మండలం ఏల్చూరు గ్రామానికి చెందిన బాల కోటిరెడ్డి ఆక్స్ఫర్డ్ విట్ ఇంటర్మీడియట్ కళాశాలలో సీనియర్ ఇంటర్ చదువుతున్నాడు. రాత్రి హాస్టల్ గదిలో ఒంటరిగా ఉండగా, ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడని తెలుస్తోంది. హాస్టల్ వార్డెన్ మరియు రూమ్‌మేట్లు గది తలుపు తెరిచి చూడగా అతడు ప్రాణాలు కోల్పోయి ఉన్నాడని గుర్తించారు. వెంటనే స్థానికులు మరియు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలన చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. ప్రాథమికంగా ఇది ఆత్మహత్యే అని నిర్ధారించారు. అయితే ఆత్మహత్యకు కారణాలు ఏమిటనే విషయంలో స్పష్టత లేదు. చదువు ఒత్తిడి, వ్యక్తిగత సమస్యలు లేదా ఇతర కారణాలు ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. దర్యాప్తు కొనసాగుతోంది.

# కార్మిక హక్కుల భద్రతకే కొత్త లేబర్ కోడ్

>> రాష్ట్రాలదే అన్నారు. అందుకే వివిధ ప్రాంతాల్లోని అధికారులు, మంత్రులతో సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. కొత్త లేబర్ కోడ్ ద్వారా కార్మికుల జీవితాల్లో ఎలాంటి మార్పులు తీసుకురావాలి, ఇ.పి.ఎఫ్.ఓ ఇ.ఎస్.ఐ సౌకర్యాలను అసంఘటిత రంగంలోని 90 శాతం కార్మికులకు ఎలా అందించాలి అనే అంశాలపై చర్చిస్తున్నామన్నారు. కొత్త చట్టాల ప్రకారం మహిళలకు సమాన పనికి సమాన వేతనం లభిస్తుందన్నారు. పని పూర్తి చేసిన ఒక వారంలోపే వేతనాలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఇలాంటి ఎన్నో మార్పులను రాష్ట్రస్థాయిలో, తాలూకా, జిల్లా స్థాయిలో సమర్థవంతంగా అమలు చేయడంపై అధికారులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు.. ఇదివరకే గోవా, జైపూర్‌లలో సమావేశాలు జరిగాయని ఇప్పుడు విజయవాడలో ప్రాంతీయ సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. త్వరలో లక్నో, గౌహతి ల్లో కూడా నిర్వహిస్తామని కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ సహాయ మంత్రి శోభా కరంద్లాజే తెలియజేశారు.
రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి శుభాష్ మాట్లాడుతూ.. గోవా, జైపూర్ తర్వాత ఈ మూడవ ప్రాంతీయ సదస్సు మన రాష్ట్రం విజయవాడలో జరగడం గర్వకారణమన్నారు. కొత్త కార్మిక చట్టాల పట్ల కార్మికుల్లో ఉన్న అపోహలను తొలగించడానికి, వారిలో అవగాహన కల్పించడానికి ఈ సమావేశం దోహదపడుతుందన్నారు. మహిళల భాగస్వామ్యం పెంచి, వారి భద్రత కోసం పని ప్రదేశాల నుండి ఇంటి ముంగిట వరకు రక్షణ కల్పించడం జరుగుతుందన్నారు. లింగ వివక్ష లేకుండా పురుషులతో సమానంగా వేతనాలు అందించడం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. విశాఖపట్నంలో 50 సీట్ల ఈఎస్ఐ మెడికల్ కాలేజీ, అమరావతిలో కొత్త మెడికల్ కాలేజీతో పాటు 150 పడకల సెకండరీ కేర్ హాస్పిటల్, 500 పడకల సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, నెల్లూరు, శ్రీసిటీ, గుంటూరు, కర్నూలులో ఈఎస్ఐ ఆసుపత్రుల కోసం భూముల కేటాయింపు, విజయనగరంలో ఈఎస్ఐ ఆసుపత్రి పనుల ప్రారంభం జరుగుతుందన్నారు. పని ప్రదేశాల్లోనే వైద్య శిబిరాల ద్వారా షుగర్, బీపీ వంటి దీర్ఘకాలిక వ్యాధుల గుర్తింపు, ఐటీ ఆధారిత డిజిటల్ సిస్టమ్స్, ఆన్‌లైన్ సేవల ద్వారా పారదర్శకతను పెంచే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. బ్రిటిష్ కాలం నాటి పాత చట్టాలను సవరించి, కార్మికుల ఆరోగ్యం, భద్రత, న్యాయం కోసం నాలుగు కొత్త లేబర్ కోడ్‌లను తీసుకువచ్చామని, వీటిపై మీడియా మిత్రులు కూడా అవగాహన కల్పించాలని కోరుతూ కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలియజేశారు.

# బాధ్యత నుంచి తప్పిస్తా

>> తరగతుల్లో పాల్గొన్నారు. టిడిపి పార్టీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో జరుగుతున్న పార్లమెంట్ కమిటీ వర్క్ షాప్‌లో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. వర్క్ షాప్ జరుగుతున్న గదుల్లోకి వెళ్లిన అధినేత చివరి సీట్లో కూర్చుని శిక్షణ తరగతులను ఫాలో అయ్యారు. నూతనంగా ఎంపికైన పార్లమెంట్ అధ్యక్షులకు మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు నిర్వహించిన శిక్షణ తరగతికి చంద్రబాబు హాజరయ్యారు. నాయకులు చెప్పేది శ్రద్ధగా విని వర్క్ షాప్ జరుగుతున్న విధానాన్ని పరిశీలించారు. ఈ రోజు ఉదయం నుంచి పార్టీ కార్యాలయంలోనే ఉన్న మంత్రి నారా లోకేష్ ప్రతి గదిలోకి వెళ్లి వర్క్ షాప్‌లోని అన్ని బృందాల సభ్యులతో ముచ్చటించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన వర్క్ షాప్‌లో సిఎంతో పాటు నారా లోకేశ్ పాల్గొన్నారు.



ప్రభుత్వం తరపున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న మంత్రి గుమ్మడి సంధ్యారాణి, ఎమ్మెల్యే జయకృష్ణ

# అంబరాన్నంటిన సిరిమాను సంబరం

>> సంధ్యారాణి, పాలకొండ ఎమ్మెల్యే జయకృష్ణ, తోయక జగదీశ్వరిలు అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం అమ్మవారిఘటాలను మోస్తూ మొక్కలు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం 2:30కు ప్రారంభం అవ్వాల్సిన సిరిమానోత్సవం ఎన్నడూ లేని విధంగా సాయంత్రం 4 గంటల 30 నిమిషాలకు ప్రారంభం అయ్యింది. అమ్మవారి ఘటాలను సిరిమాను నుంచి మేళతాళాల నడుమ చదురు గుడి నుండి స్థానిక కార్యనిర్వాహక అధికారి బి.శ్రీనివాసరావు, ఆలయ కమిటీ ఛైర్మన్ నైదాన తిరుపతిరావు మరియు గ్రామ పెద్దలు సమక్షంలో కమిటీ సభ్యులు పూజారి జన్ని పేకాపు జగదీశ్వరరావును భుజాలపై మోసుకుని వచ్చి సిరిమాను అధిరోహింప చేశారు. తొలుత గిరడ వారి ఇంటి వద్ద పూజలు అందుకున్న తదుపరి అమ్మవారు నాయుడుగా పేరొందిన పూడి వారి ఇంటికి వెళ్లి పూజలు అందుకున్నారు. అనంతరం నడిమి వీధి మీదుగా ఎస్సీ వీధి పనుకు వీధినుండి తిరుగు ముఖం పట్టిన అమ్మవారు మరల గొల్ల వీధి మీదుగా సావిడి వీధికి చేరుకున్నారు. సిరిమాను నుండి పూజారిని కిందికి దింపే కార్యక్రమం సాయంత్రం 6:30 గంటలకు ముగిసింది. పూజారి చదురు గుడికి వెళ్లిన వెంటనే సిరిమాను రథాన్ని మూడు రోడ్ల కూడలి సమీపంలో బోల్తా పడవేశారు. దీంతో సిరిమానోత్సవం ముగిసింది. సిరిమాను ముగిసే సమయానికే పారిశుద్ధ్య కార్మికులు ఎన్నడూ లేని విధంగా అప్పటికప్పుడు పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామంలో ఎక్కడ అపారిశుద్ధ్యానికి తావ లేకుండా పారిశుద్ధ్య పనులను చేపట్టామని ఎంపిడిఓ అర్జునరావు తెలిపారు. జాతర ముగిసిన అనంతరం వెనుదిరిగిన భక్తులు, మక్కువ రహదారిలో ఎస్ఆర్ పురం ప్రాంతంలో రోడ్లపై వాహనాలు నిలిపివేయడంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది.

# ఇయు-భారత్ మధ్య స్వేచ్ఛా వాణిజ్యం

>> జరిగిన సంయుక్త విలేకరుల సమావేశంలో యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయెన్, యూరో పియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టాతో కలిసి ప్రధాని మోడీ మాట్లాడారు. భారత గణతంత్ర దినోత్సవ వేడుకలకు తొలిసారి ఇయు నేతలు ముఖ్య అతిథులుగా హాజ రైన మరుసటి రోజే కీలక ఒప్పందం కుదరడం చరిత్రాత్మక ఘట్టమని ఆయన అన్నారు. ఇటీవలి సంవత్సరాల్లో భారత్ ఈయూ సంబంధాలు వేగంగా బలోపేతమయ్యాయని చెప్పారు. ప్రజాస్వామ్య విలువలు, ఆర్థిక అనుబంధం, ప్రజల మధ్య బంధాలే దీనికి పునాదిగా నిలిచాయని తెలిపారు. ప్రస్తుతం భారత్ ఇయు మధ్య వాణిజ్యం 180 బిలియన్ యూరోల స్థాయికి చేరిందని వెల్లడించారు. ఎనిమిది లక్షల మందికి పైగా భారతీయులు ఈయూ దేశాల్లో నివసిస్తూ అక్కడి సమాజాలకు సేవలందిస్తున్నారని గుర్తు చేశారు. టెక్నాలజీ, గ్రీన్ ఎనర్జీ, డిజిటల్ పాలన, అభివృద్ధి భాగస్వామ్యం వంటి రంగాల్లో విస్తృత సహకారం కొనసాగుతోందని మోడీ తెలిపారు. ఈ ఒప్పందంతో రైతులు, చిన్న వ్యాపారులు, సేవల రంగానికి చెందినవారికి కొత్త అవకాశాలు ఏర్పడతాయని స్పష్టం చేశారు. యూరోపియన్ మార్కెట్లకు భారత ఉత్పత్తులకు మరింత విలువ లభిస్తుందని, పెట్టుబడులు పెరుగుతాయని, సరఫరా వ్యవస్థ మరింత బలపడుతుందని అన్నారు. 16వ భారత్ – ఇయు సదస్సు సందర్భంగా ప్రతినిధి స్థాయి చర్చల అనంతరం కీలక ఒప్పందం ఖరారైంది. ఇదే సమయంలో భద్రత, రక్షణ భాగస్వామ్య ఒప్పందం కూడా కుదిరింది. జపాన్, దక్షిణ కొరియా తర్వాత ఆతరహా ఒప్పందం చేసుకున్న మూడో ఆసియా దేశంగా భారత్ నిలిచింది. ఇండియా ఎనర్జీ వీక్ కార్యక్రమంలో మోడీ, భారత్ ఈయూ ఒప్పందాన్ని మదర్ ఆఫ్ ఆల్ డీల్స్‌గా అభివర్ణించారు. ప్రపంచ జిడిపిలో నాలుగో వంతు వాటా కలిగిన రెండు ప్రధాన ఆర్థిక శక్తులను కలుపుతున్న కీలక ఒప్పందమిదని అన్నారు. భారత్ ఇయు మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందానికి 2007లోనే చర్చలు మొదలయ్యాయి. ఆటోమొబైల్స్, వైన్‌పై దిగుమతి సుంకాలు, ఫార్మాస్యూటికల్స్ వంటి అంశాల్లో ఏకాభిప్రాయం కుదరకపోవడంతో మధ్యలో నిలిచిపోయిన చర్చలు 2022లో తిరిగి ప్రారంభమయ్యాయి. గతేడాది ప్రపంచ దేశాలపై ట్రంప్ సుంకాల నేపథ్యంలో ఈ ఎఫ్‌టిఎ కోసం వేగంగా అడుగులు పడ్డాయి.

# రెండు దశాబ్దాల కృషికి చిహ్నం: ప్రధాని మోడీ
## భారత్ ఐరోపా కూటములమధ్య ద్వైపాక్షిక వాణిజ్యం మరింత విస్తృతం: ఉర్సులా వాండర్‌లేయన్

**న్యూఢిల్లీ,జనవరి 27:** రెండుదశాబ్దాలుగా విస్తృతస్థాయిలో ఇరువైపులా కృషి, కసరత్తులుచేసిన భారత్ ఐరోపా స్వేఛ్ఛా వాణిజ్య ఒప్పందం ఎట్టకేలకు ఖరారయింది. న్యూఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో జరిగిన ఐరోపా కూటమి నేతలతో జరిగిన విస్తృత స్థాయి సమావేశం అనంతరం రెండు దేశాలమధ్య ఒప్పందంపై సంతకాలుచేసారు. యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాండర్‌లేయన్, యూరోపియన్ మండలి అధ్యక్షుడు ఆంటోనియో కోస్టాలు, ప్రధాని నరేంద్రమోడీల సమక్షంలో ఈ ఒప్పందంపై సంతకాలు జరిగాయి. భారత వాణిజ్య చరిత్రలోనే ఇది అత్యంత భారీ డీల్ అని ప్రధానిమోడీ పేర్కొనగా భారత్, ఐరోపా మండలి మధ్య వాణిజ్యసంబంధాలను మరింతగా బలోపేతం చేస్తుందని ఐరోపా ప్రతినిధులు హర్షం ప్రకటించారు. ఇది కేవలం వాణిజ్య ఒప్పందంగానే భావించలేమని పరస్పర అభ్యున్నతికి ఒక బ్లూప్రింట్ వంటిదని అన్నారు. ఈ ఒప్పందం అంతర్జాతీయ సమాజానికి స్పష్టమైన సందేశం ఇచ్చిందని భారత్, యూరోపియన్ యూనియన్‌లమధ్య పరస్పర మైత్రీ బంధం మరింత పటిష్టం అయిందన్నారు. హైదరాబాద్‌హౌస్‌లోనే 16వ ఇయు భారత్ సదస్సు వివరాలను కోస్టా వెల్లడించారు. భౌగోళిక స్థిరత్వానికి రెండుదేశాలకు స్వేఛ్ఛా వాణిజ్య ఒప్పందం అత్యంత కీలకమని ఇరువురునేతలు వెల్లడించారు. కొత్తగా భద్రత, రక్షణరంగ భాగస్వామ్యంవల్ల భవిష్యత్తు భద్రతా ముప్పును ముందుగానే సంరక్షించుకోగలమని చెప్పారు. ఇండోపసిఫిక్, ప్రపంచ వ్యాప్తంగాను, ఐరోపా కూటమి దేశాల్లోను మరింత స్థిరత్వాన్ని తెచ్చిపెడుతుందని చెప్పారు. 2030 వైపు ఉన్న వ్యూహాత్మక సమగ్ర అజెండా ఇరువైపులా ఉన్న ప్రాధాన్యతను స్పష్టంచేస్తుందన్నారు. ఇంధనం, కనెక్టివిటీ, మొబిలిటీని మరింత పటిష్టంచేస్తుందని కోస్టా అన్నారు. ప్రపంచ పర్యావరణ పరిరక్షణకు కూడా ఈ ఒప్పందం కీలకం అవుతుందని వుర్సులా వాండర్‌లేయన్ అన్నారు. అన్ని డీల్స్‌కు తల్లిలాంటి ఎఫ్‌టిఎ ఖరారయిందని కేంద్ర వాణిజ్య మంత్రి పియూష్‌గోయల్ అన్నారు. ఈ ఒప్పందం ప్రకారం 93శాతం భారత ఎగుమతులు 27 యూరోప్ దేశాల్లో ఎలాంటి సుంకాలు ఉండవు. అలాగే లగ్జరీ కార్లు, వైన్ భారత్‌కు దిగుమతులపై కూడా తక్కువ సుంకాలు ఉంటాయి. కొన్నింటిపై అసలు సుంకాలనే తొలగిస్తారు. ఇరువైపులా 200 కోట్లమందికి ఈ వాణిజ్య ఒప్పందం వల్ల ఎంతో మేలు జరుగుతుందని అంచనా. ప్రపంచ జిడిపిలో భారత్; ఐరోపా రెండూకలిపితే 25శాతం వాటాతో ఉన్నాయి. ప్రపంచ వాణిజ్యంలోమూడో వంతు ఉంటుంది. మొత్తం 33 లక్షలకోట్లడాలర్ల ప్రపంచ వాణిజ్యంలో భారత్ ఐరోపా వాణిజ్యం 11 లక్షలకోట్ల డాలర్లమేర ఉంటుందని అంచనా. 20 ఏళ్లనాడే బీజం పడిన ఈ ఒప్పందం 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా భారత్‌కు విశిష్ట అతిథులుగా వచ్చిన మరుసటిరోజే ఖరారు కావడం విశేషం. ఇయు భారత్ డీల్‌తో వస్త్ర పరిశ్రమ ఎగుమతులు 2030 నాటికి 100 బిలియన్ డాలర్లకు చేరతాయని అంచనావేస్తున్నారు. యూరోప్ మారెనకట్‌లో భారత్‌నుంచి 5.5 బిలియన్ డాలర్ల ఎగుమతులు ఉన్నాయి.

# రాష్ట్రంలో ప్రశాంతంగా బ్యాంకుల బంద్

**విజయవాడ,జనవరి27,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో మంగళవారం బ్యాంకుల బంద్ ప్రశాంతంగా జరిగింది. వరుస శెలవుల అనంతరం బ్యాంకులు ఉంటాయని వచ్చిన ఖాతాదారులకు మంగళవారం కుడా మూసి, సిబ్బంది సమ్మె చేస్తుండటంతో నిరాశకు గురయ్యారు. వేతన సవరణ ఒప్పందంలో అంగీకరించిన అంశాలు సహా తమ డిమాండ్లన్నింటినీ నెరవేర్చాలని కోరుతూ బ్యాంక్ ఉద్యోగులు ఆఫీసర్ యూనియన్లు దేశవ్యాప్తంగా మంగళవారం సమ్మె పిలుపు నిచ్చారు. దాంతో ఏపీలోను బ్యాంకు సిబ్బంది సమ్మెకు మద్దతుగా నిలిచారు. ఒక రోజు పాటు ఈ సమ్మె కొనసాగుతుంది. దేశవ్యాప్తంగా గల పలు ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో సేవలు నిలిచిపోయాయి, యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యుఎఫ్‌బియు) ఈ సమ్మెకు పిలుపునిచ్చింది. తొమ్మిది ప్రధాన బ్యాంక్ యూనియన్లకు ఈ సంఘం ప్రాతినిధ్యం వహిస్తుంది.

# హాస్టల్ గదిలో ఆత్మహత్య

>> కుమార్ సిద్దార్థ ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ప్రదీప్‌కుమార్ కళాశాలకు సమీపంలోని ఓ ప్రైవేటు హాస్టల్ మొదటి అంతస్తులోని ఓ గదిలోని సహా విద్యార్థులతో కలిసి వుంటూ చదువుకుంటున్నాడు. అయితే మంగళవారం ఉదయం సుమారు 11గంటల ప్రాంతంలో హాస్టల్ గదిలోనే ఫ్యానుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం ప్రదీప్‌కుమార్ కళాశాలకు రాకపోవడంతో అతని స్నేహితుడు ఫోన్ చేశాడు. ఫోన్ తీయకపోవడంతో మధ్యాహ్నం 3గంటలకు హాస్టల్ గదిలోకి వెళ్లి చూడగా ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకొని వుండడంతో హాస్టల్ నిర్వాహకులు మృతదేహాన్ని బయటకు తీశారు. అనంతరం స్థానిక ఎస్ఐ శ్రీనివాసులకు సమాచారం అందించడంతో వెంటనే ఎస్ఐ మృతదేహాన్ని పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుని తల్లితండ్రులకు సమాచారం అందించి, విద్యార్థి ఎందుకు ఆత్మహత్య చేసుకున్నాడన్న కోణంలో పుత్తూరు రూరల్ సిఐ రవీంద్ర, ఎస్ఐ శ్రీనివాసులు తన సిబ్బందితో కలిసి దర్యాప్తు చేసుకున్నారు. విద్యార్థి ఆత్మహత్యకు సంబందించి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తామని పోలీసులు తెలిపారు.

# సాగునీటి ప్రాజెక్టులు

>> లోని ప్రాధాన్యతల వారీగా నిర్మాణం చేపట్టేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు.

**ప్రపంచంలో అతిపెద్ద ఉద్యాన క్లస్టర్ గా రాయలసీమ..**

ఈ ప్రాజెక్టులు పూర్తి అయితే రాయలసీమ, ప్రకాశం, మార్కాపురం జిల్లాల్లో ఉద్యాన పంటల సాగు అపారంగా పెరిగే అవకాశం ఉందని మంత్రి అచ్చెన్నాయుడు అభిప్రాయపడ్డారు. మొత్తం 10 జిల్లాల్లోని 201 క్లస్టర్లు, 303 మండలాల్లో ఉద్యాన పంటలను అభివృద్ధి చేసేలా ప్రతిపాదించినట్టు మంత్రి అచ్చెన్నాయుడు సిఎంకు తెలిపారు. అలాగే ఉద్యాన సాగు విస్తీర్ణాన్ని మూడేళ్లల్లో 8.41 లక్షల హెక్టార్ల నుంచి 14.41 లక్షల హెక్టార్లకు విస్తరించేలా ప్రణాళికలు చేపట్టినట్టు వివరించారు. రాయలసీమ ప్రాంతం ఉద్యాన ఉత్పత్తుల విషయంలో దేశంలోనే అగ్ర స్థానంలో ఉందని... ప్రపంచంలోనే అతిపెద్ద క్లస్టర్‌గా రాయలసీమ, ప్రకాశం, మార్కాపురం జిల్లాలను అభివృద్ధి చేయాలని సిఎం సూచించారు. దుబాయికి చెందిన డిపి వరల్డ్ సంస్థ ఎపిలో ఉద్యాన క్లస్టర్ ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చిందని ముఖ్యమంత్రి సమావేశంలో వెల్లడించారు. అంతర్జాతీయ స్థాయిలో రాయలసీమ ప్రాంతం ఉద్యాన రంగంలో అభివృద్ధి చెందడానికి ఆస్కారం మెండుగా కన్పిస్తోందని.. దీనికి అనుగుణంగా ఎకో సిస్టం డెవలప్ అభివృద్ధి చేయాలని సిఎం స్పష్టం చేశారు. దీంట్లో భాగంగా అంతర్జాతీయ విధానాలను అధ్యయనం చేయాలని ఆదేశించారు. అలాగే స్థానికంగా ఉద్యాన రంగ అభివృద్ధికి అవసరమైన రూరల్ రోడ్ నెట్ వర్క్, లాజిస్టిక్స్, మార్కెట్ కనెక్టివిటీ, గ్లోబల్ కనెక్టివిటీ వంటి అంశాలపై ఫోకస్ పెట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. పూర్వోదయ ద్వారా వచ్చే నిధులతో పాటు ఉద్యాన రంగంలో ప్రైవేట్ పెట్టుబడులను సాధించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, పోర్ట్ కనెక్టివిటీ, గోదాములు, కోల్డ్ చైన్ తదితర లాజిస్టిక్స్ ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో సీఎస్ విజయానంద్ సహా ఆర్థిక, ఇరిగేషన్, వ్యవసాయ, ఉద్యాన, పోర్టులు, ఆర్ అండ్ బి శాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.
జిల్లాల్లో ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయనున్న ఇరిగేషన్ ప్రాజెక్టులు, కొరిశపాడు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం, పాలేరు రిజర్వాయర్, మల్లెమడుగు లిఫ్ట్ రిజర్వాయర్, శ్రీ బాలాజీ రిజర్వాయర్, కుప్పం బ్రాంచ్ కెనాల్, పుంగనూరు బ్రాంచ్ కెనాల్, మూలపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం, హంద్రీనీవా ప్రధాన కాల్వ పనులు, అట్లూరు-పాడుమెర్లపాక ఎస్ఎస్ఎల్సీ, నీవా బ్రాంచ్ కెనాల్ పనులు, జీడిపల్లిభైరవానితిప్ప లిఫ్ట్ ఇరిగేషన్ పథకం, జీడిపల్లి- అప్పర్ పెన్నార్ ఎత్తిపోతలు, అనంతలో కమ్యూనిటీ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్, మడకశిర బ్రాంచ్ కెనాల్ విస్తరణ పనులు, పేరూరు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం, కడప, కోడూరు వరకు గాలేరు- నగరి సుజల స్రవంతి, అన్నమయ్య ప్రాజెక్టు పునరుద్దరణ పనులు, పశ్చిమ కర్నూలుకు నీళ్లిచ్చేలా వేదవతి అలగనూరు, గాజులదిన్నె ప్రాజెక్టులు ఉన్నాయి. ఏడు జిల్లాల్లో 1011 మైనర్ ఇరిగేషన్ చెరువుల అభివృద్ధి పనులున్నాయి.

# ఇది 'డబులింజన్' బుల్లెట్ రైలు

>> చంద్రబాబు" అని లోకేష్ పేర్కొన్నారు. చంద్రబాబు సంక్షేమం, అభివృద్ధికి బ్రాండ్ అంబాసిడర్ అయితే.. టీం 11 కల్తీ నెయ్యి, కోడికత్తి, కల్తీ మద్యానికి బ్రాండ్ అంబాసిడర్లు అని ఎద్దేవా చేశారు.

**ఒక్క పెన్షన్‌లకే ఏడాదికి రూ.30వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం**

"ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని పద్ధతి ప్రకారం నిలబెట్టుకుంటున్నాం. దేశంలో ఎక్కడా ఇవ్వని విధంగా రూ.4వేల వృద్ధాప్య పెన్షన్ చెల్లిస్తున్నాం. వికలాంగులకు రూ.6వేలు ఇస్తున్నాం. మంచానికే పరిమితమైన వారికి రూ.15వేలు చెల్లిస్తున్నాం. ఒక్క పెన్షన్‌లకే ఏడాదికి రూ.30వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం. ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను కూడా అమలుచేస్తున్నాం" అని మంత్రి లోకేష్ వివరించారు. "చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని చెప్పుకోవాల్సిన బాధ్యత మనపై ఉంది. 2019 ఎన్నికల ముందు హామీ ఇవ్వకపోయినా రూ.వెయ్యి పెన్షన్‌ను రూ.2వేలకి పెంచాం. గత ప్రభుత్వం పెన్షన్ వెయ్యి పెంచడానికి ఐదేళ్లు తీసుకుంది. మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వెయ్యి పెన్షన్ పెంచి రూ.4వేలు చేశాం. ఇవన్నీ ప్రజలకు వివరించాలి. మనం పనులు చేయడం ఎంత ముఖ్యమో.. చేసిన పనులు చెప్పుకోవడం కూడా అంతే ముఖ్యం" అని లోకేష్ పేర్కొన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా పార్టీలో మార్పులు రావాలని తాను కోరుకుంటున్నానని అన్నారు.

**రాజకీయాల్లో యువతను ప్రోత్సహించాల్సిన బాధ్యత మనపై ఉంది**

"యువత రాజకీయాల్లోకి రావాలి. అన్ని కమిటీల్లో యువతకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉంది. యువతను కూడా ప్రోత్సహించాల్సిన బాధ్యత మనపై ఉంది. అన్ని పార్టీ పదవులు, నామినేటెడ్ పదవుల్లో దామాషా ప్రకారం సామాజిక న్యాయం చేయాల్సిన బాధ్యత మనపై ఉంది. పార్టీ పదవుల్లో మహిళలకు సముచిత స్థానం కల్పించాలి. మహిళలను కించపరిచే పదాలను విడనాడాలి. పార్టీలో మహిళలను గౌరవించాలి. తెలుగుజాతి కోసం పుట్టిన పార్టీ టిడిపి. ప్రపంచంలో ఏ రంగం చూసినా తెలుగువారు నెం.1గా ఉండే విధంగా మనం కృషిచేయాలి. అదే మన లక్ష్యం" అని లోకేష్ పేర్కొన్నారు.

**పార్టీ సొంతిల్లు, ప్రభుత్వం కిరాయి ఇల్లు లాంటిది**

"పార్టీ సొంతిల్లు, ప్రభుత్వం కిరాయి ఇల్లు లాంటిది. పార్టీ కార్యాలయానికి సమయం కేటాయించాలి. చంద్రబాబు ఎంత పని ఒత్తిడి ఉన్నా వారానికోసారి పార్టీ కార్యాలయానికి వస్తున్నారు. కార్యకర్తలను కలుస్తున్నారు. అనేక రాష్ట్రాల్లో డబుల్ ఇంజన్ సర్కార్లు ఉన్నా.. ఎపిలో డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్ ఉంది. కేంద్రంలో నరేంద్ర మోడీ, రాష్ట్రంలో చంద్రబాబు, పవనన్న కలిసికట్టుగా రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తున్నారు. విశాఖ ఉక్కును కాపాడుకోగలిగాం. అమరావతి పనులు వేగంగా జరుగుతున్నాయి. పోలవరం పనులు పరిగెడుతున్నాయి. విశాఖకు పెద్దఎత్తున పెట్టుబడులు వస్తున్నాయి. రైల్వేజోన్ ఏర్పాటుచేసుకున్నాం. త్వరలో కర్నూలుకు హైకోర్టు బెంచ్ తీసుకువస్తాం. కేంద్ర సహకారం లేకపోతే మనం అనుకున్న కార్యక్రమాలు చేయలేం. దీనిని అందరూ గుర్తుపెట్టుకోవాలి" అని పార్టీ శ్రేణులకు లోకేష్ సూచించారు. అనంతరం మంత్రి లోకేష్ నిత్య విద్యార్థిలా మారి శిక్షణ తరగతులకు హాజరయ్యారు. శిక్షణ తరగతుల్లో వెనుక కూర్చొని పాఠాలు విన్నారు. వర్క్ షాప్ జరుగుతున్న తీరును స్వయంగా పరిశీలించారు. అంతకుముందు వర్క్ షాప్‌లో పాల్గొనేందుకు పార్టీ కార్యాలయానికి వచ్చిన పార్లమెంటరీ పార్టీ కమిటీ సభ్యులకు మంత్రి లోకేష్ స్వయంగా ఆహ్వానం పలికారు. ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరించి ఫోటోలు దిగారు.

## వారం - వర్జ్యం

28-01-2026, బుధవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
మాఘమాసం, ఉత్తరాయణం
శిశిర ఋతువు, శుక్లపక్షం, శ్రావణ కార్తె
దశమి సా.4.34, కృత్తిక ఉ.9.26
వర్జ్యం : రా.12.09-1.38
దు.ఉ.11.58-12.43
శుభసమయం : ఉ.9.00-9.45
సా.5.30-6.15
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

**మేషం:** కుటుంబ సభ్యుల నుండి సహాయ సహకారాలు అందుకుంటారు. శుభ కార్యాలలో చురుకుగా పాల్గొంటారు.

**వృషభం:** ఉద్యోగులకు ఇంక్రిమెంట్లు లభిస్తాయి. మానసిక ప్రశాంతత పొందుతారు. రాజకీయరంగాల వారికి విదేశీ పర్యటనలు.

**మిథునం:** చేపట్టిన పనులలో అనేకమైన వాటిని విజయవంతంగా పూర్తి చేస్తారు. ధనలాభం పొందుతారు.

**కర్కాటకం :** నూతన వ్యక్తులు పరిచయమై మాట సహాయం అందిస్తారు. ఇంటా బయటా మీదే పై చేయిగా నిలుస్తుంది.

**సింహం:** సన్నిహితుల నుండి అతి ముఖ్యమైన సమాచారం అందుకుంటారు. ఒత్తిడుల నుండి బయటపడతారు.

**కన్య :** దీర్ఘకాలిక సమస్యలు తీరతాయి. కాంట్రాక్టులు లాభిస్తాయి. ఆరోగ్య సమస్యలు కొంత వరకు మెరుగుపడుతాయి.

**తుల :** భూ వివాదాలు పరిష్కారదశకు చేరుకుంటాయి. దూరప్రాంతాల నుండి అరుదైన ఆహ్వానాలు అందుకుంటారు.

**వృశ్చికం:** రాజకీయ, కళారంగాల వారికి యోగదాయకం. తద్వారా లాభపడడతారు. బాధ్యతలు సక్రమంగా నెరవేరుస్తారు.

**ధనుస్సు:** కొన్ని వాయిదా పద్ధతులలో వస్తువులను కొనుగోలు చేస్తారు. వాహనాలు నడిపేటప్పుడు నిర్లక్ష్యం తగదు.

**మకరం:** శ్రమించి అనుకున్న పనులు ఆలస్యంగానైనా పూర్తి చేసి నామమాత్రపు ఫలితాలు సాధిస్తారు.

**కుంభం:** భాగస్వామ్య పెట్టుబడులలో ఆలోచించి నిర్ణయాలు తీసుకోవడం చెప్పదగినది. ప్రయాణాలు.

**మీనం :** మీ మాట దురుసుతనం వల్ల మిత్రులు సైతం శత్రువులుగా మారే ప్రమాదం ఉంది. జాగ్రత్త వహించండి.

– శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

### రేపు అమరావతి రైతులకు
# మలివిడత ప్లాట్ల కేటాయింపు

**విజయవాడ,జనవరి27,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ రాజధాని అమరావతి నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతులకు ఈ నెల 29న మలివిడత ప్లాట్ల కేటాయింపు జరుగనుంది. సీడ్ యాక్సెస్ రోడ్డు నిర్మాణం కోసం భూములు ఇచ్చిన రైతులకు ఈలాటరీ విధానం ద్వారా ప్లాట్లు కేటాయించనున్నారు. నిబంధనల ప్రకారం పూర్తి పారదర్శకంగా ఈలాటరీ పద్ధతిలో ఈ ప్రక్రియను చేపట్టనున్నారు. అయితే ముందుగా ఈ నెల 28న లాటరీ నిర్వహించాలని ప్రణాళిక ఉండగా దానిని సీఆర్డీఏ అధికారులు 29వ తేదీకి వాయిదా వేశారు.సీడ్ యాక్సెస్ రోడ్డు అమరావతి నగరానికి ముఖ్యమైన కనెక్టివిటీ ప్రాజెక్ట్. ఈ రోడ్డు నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతులకు రిటర్నబుల్ ప్లాట్లు ఇవ్వాలని ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఇటీవల జనవరి 23న రైతులకు లాటరీ ద్వారా భూములు కేటాయించిన విషయం తెలిసిందే. గతంలో భూ సమీకరణ ఉన్న ప్రాంతాల్లో భూములు వచ్చిన రైతుల్లో కొందరు తమకు వేరే చోట భూములివ్వాలని కోరారు. దీంతో ఈలాటరీ ప్రక్రియను అనుసరించడంతో పలువురు రైతులు అభ్యంతరాలు తెలిపారు. అయితే వాటిని కూడా పరిగణనలోకి తీసుకున్న సీఆర్డీఏ అధికారులు ఈనెల 29న మరోసారి పూర్తిస్థాయిలో ఈలాటరీ ద్వారా తుది విడతలో ప్లాట్లను కేటాయిస్తామని పేర్కొన్నారు.

### పాదయాత్రకు మూడేళ్లు
## మంత్రి లోకేష్‌కు శుభాకాంక్షల వెల్లువ

**విజయవాడ,జనవరి27,ప్రభాతవార్తప్రతినిధి:** యువగళం పాదయాత్ర ప్రారంభించి నేటికి మూడేళ్లు పూర్తైంది. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో ఘనంగా సంబరాలు చేసుకున్నారు. టీడీపీ నేతలు. మంగళవారం ఉదయం పార్టీ కార్యాలయానికి చేరుకున్న టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్‌కు టీడీపీ నేతలు పెద్దఎత్తున శుభాకాంక్షలు తెలిపారు. యువగళం పాదయాత్ర మూడేళ్ల సందర్భాన్ని గుర్తుచేస్తూ లోకేశ్‌తో కేక్ కట్ చేయించి సంబరాలు చేసుకున్నారు. ఏపీ రాజకీయాల్లో యువగళం పాదయాత్ర గేమ్ ఛేంజర్‌గా నిలిచిందని ఆ పార్టీ నేతలు కొనియాడారు. రాష్ట్ర పార్టీ అధ్యక్షుల్లు పల్లా శ్రీనివాసరావు, మంత్రులు అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు ఏలూరి సాంబశివరావు, సోమిరెడ్డి, యార్లగడ్డ వెంకట్రావు, ఉగ్ర నరసింహారెడ్డి, గణబాబు, ఆదిరెడ్డి వాసు, ఎంఎస్ రాజు, ఎమ్మెల్సీలు భూమిరెడ్డి, వేపాడ, గ్రీష్మ, కార్పొరేషన్ ఛైర్మన్లు, తదితరులు అభినందనలు తెలియజేశారు.

**మహిళా మంత్రుల శుభాకాంక్షలు:** పార్టీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో లోకేశ్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు మహిళా మంత్రులు అనిత, సవిత. ఈ సందర్భంగా పాదయాత్ర ప్రారంభం నాటి స్మృతులను నేతలు గుర్తుచేసుకున్నారు. నేడు ప్రజలు సంతోషంగా, ప్రశాంతంగా ఉండటానికి యువగళం పాదయాత్రది ప్రధాన పాత్ర అని మంత్రులు అన్నారు. ఎన్నో నిర్బంధాలు, ఆటంకాలను తట్టుకుంటూ, ప్రభుత్వ అవమానాలను భరిస్తూ.. ప్రజల కోసంనాడు లోకేశ్ పాదయాత్ర కొనసాగించారని తెలిపారు. నేడు తమకు పదవులు వచ్చాయంటే అందుకు కారణం కూడా యువగళం పాదయాత్రే అని మంత్రులు వెల్లడించారు.



## అనంతలో నేడు గణపతి సచ్చిదానంద స్వామీజీ పర్యటన

**అనంతపురం, జనవరి 27 ప్రభాతవార్త బ్యూరో:** మైసూర్ దత్త పీఠాధిపతి శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ అనంతపురం జిల్లా పర్యటనకు రానున్నారు. ఈనెల 28వ తేదీన బుధవారం ఉదయం అనంతపురం నగరంలోని దత్త మందిరంలో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హాల్ ను ప్రారంభించనున్నారని అనంతపురం దత్త మందిరం ట్రస్ట్ సభ్యులు నారాయణ శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 29, 30, 31 వ తారీకులలో బొమ్మపర్తి జయలక్ష్మిపురంలో దత్త క్రియా యోగా తరగతులను శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ నిర్వహిస్తారు. జిల్లాలోని దత్త భక్తులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని అనంతపురం దత్త మందిరం ఎగ్జిక్యూటివ్ ట్రస్ట్ మెంబర్ నారాయణ శర్మ కోరారు.

## మాజీ మంత్రి పేర్ని నానిపై కేసు

**విజయవాడ,జనవరి 27,ప్రభాతవార్తప్రతినిధి:** వైసీపీ మాజీమంత్రి పేర్ని నానిపై కేసు నమోదైంది.సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు ఆయనపై ఇనగుదురుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. నానిపై 196(1), 353(2), 351(2), 352 బీఎన్ఎస్ సెక్షన్ల కింద కేసు పెట్టారు. రెండు రోజుల క్రితం ఏలూరు జిల్లా చాట్రాయిలో జరిగిన వైఎస్ఆర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పేర్ని నాని రెచ్చిపోయి మాట్లాడారు. ఈ వ్యాఖ్యలపై మండిపడిన టీడీపీ శ్రేణులు.. మచిలీపట్నంలోని ఇనగుదురుపేట పీఎస్‌లో నానిపై ఫిర్యాదు చేయగా నానిపై కేసు నమోదు చేశారు.

### టిడిపి పార్లమెంట్ కమిటీల శిక్షణా తరగతులు
# సామాన్య కార్యకర్తలా సీఎం చంద్రబాబు



మంగళవారం టీడీపీ పార్లమెంట్ కమిటీల శిక్షణా తరగతుల్లో కార్యకర్తల మధ్య సీఎం చంద్రబాబు

**విజయవాడ,జనవరి27,ప్రభాతవార్తప్రతినిధి:** పదవి కన్నా పార్టీయే ముఖ్యమని తరచు సీఎం చంద్రబాబు నాయుడు వ్యాఖ్యాస్తుంటారు.పార్టీ కార్యక్రమాల్లో అందరు సమానమని ఆయన పలు పర్యాయాలు స్పష్టీకరిం చారు. 4వ సారి ముఖ్యమంత్రి అయినా సామాన్య కార్యకర్తలానే సీఎం చంద్రబాబు పార్టీ శిక్షణ తరగతుల్లో పాల్గొని తన మాటలను కార్యచరణలో చూపారు.ఈ ఘటన సంచలనానికి,ఆదర్శనీయ విధానానికి దారి తీసింది. టీడీపీ పార్టీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో జరుగుతున్న పార్లమెంట్ కమిటీ వర్క్ షాప్ లో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. వర్క్ షాప్ జరుగుతున్న గదుల్లోకి వెళ్లిన అధినేత చివరి సీట్లో కూర్చుని శిక్షణ తరగతులను అనుసరించారు. నూతనంగా ఎంపికైన పార్లమెంట్ అధ్యక్షులకు మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు నిర్వహించిన శిక్షణ తరగతికి చంద్రబాబు హాజరయ్యారు. నాయకులు చెప్పేది శ్రద్ధగా విని వర్క్‌షాప్ జరుగుతున్న విధానాన్ని పరిశీలించారు. ఈ రోజు ఉదయం నుంచి పార్టీ కార్యాలయంలోనే ఉన్న మంత్రి నారా లోకేశ్ ప్రతి గదిలోకి వెళ్లి వర్క్ షాప్‌లోని అన్ని బృందాల సభ్యులతో ముచ్చటించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన వర్క్ షాప్ లో సీఎంతో పాటు నారా లోకేశ్ పాల్గొన్నారు. నాలుగున్నర దశాబ్దాల పార్టీ ప్రయాణం, పార్టీ ఐడియాలజీ, క్యాడర్ మేనేజ్‌మెంట్, కార్యకర్తలకు ప్రాధాన్యం వంటి అంశాలపై వర్క్ షాప్ జరిగింది. కూటమి ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, విజన్ ప్రణాళికలు, అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధి వంటి అంశాలపై జరిగిన వర్క్ షాప్ లో సీఎం పాల్గొన్నారు.ఒక్కో పార్లమెంట్ కమిటీలో 42 మంది సభ్యులు చొప్పున మొత్తం 25 పార్లమెంట్లకు కలిపి 1050 మంది వర్క్ షాప్‌లో పాల్గొన్నారు. అయితే ఈ వర్క్ షాప్‌లో పాల్గొన్న సీఎం పార్టీ విధానాలు, ఆలోచనలు, సిద్దాంతాలపై నాయకులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వ విజయాలు, భవిష్యత్ ఆలోచనలు వివరించారు. కార్యకర్తే అధినేత అనే పార్టీ సిద్దాంతానికి కట్టుబడి అంతా పని చేయాలని నాయకులకు సూచించారు. సామాన్య కార్యకర్తగా చంద్రబాబు ఒదిగిపోయిన విధానం ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉందని కార్యకర్తలు, నాయకులు అభిప్రాయపడ్డారు. ఇంకా ఈ కార్యక్రమానికి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ ఛైర్మన్లు హాజరయ్యారు.

### మద్యం మత్తులో మతిస్థిమితం కోల్పోయిన వ్యక్తి
# కూరలో విషం కలిపి ప్రాణాలు పోగొట్టుకున్నాడు
### అదే కూర తిని మృత్యువుతో పోరాడుతున్న ఐదుగురు చిన్నారులు
### చింతూరు మన్యంలో హృదయవిదారక ఘటన



పోసయ్య ఇల్లు, భద్రాచలం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులు.


**చింతూరు , జనవరి 27 ప్రభాతవార్త :** చింతూరు మన్యంలో జరిగిన ఒక హృదయ విదారక ఘటన చూపరులను సైతం కన్నీళ్ళు పెట్టించేలా ఉంది.చింతూరు మండలం ఇర్కంపేట(వలస ఆదివాసి గ్రామం) గ్రామానికి చెందిన మడకం పోసయ్య(45) అనే గిరిజనుడు మద్యం మత్తులో మతి స్థిమితం కోల్పోయి ఇంట్లో భార్య వండిన ఆనపకాయ కూరలో పిట్టల మందు కలిపి తాను తిని అస్వస్థతకు గురై ఆసుపత్రికి తరలించి వైద్యం అందిస్తుండగా ప్రాణాలు కోల్పోయాడు.మతి స్థిమితం లేని వ్యక్తి మద్యం మత్తులో చేసిన పొరపాటుతో ఆ కుటుంబం మొత్తం ఆసుపత్రిపాలు అయ్యింది. మడకం పోసయ్య చింతూరు మండలం ఇర్కంపేట గ్రామములో నివసిస్తున్నాడు.అతనికి ఆరుగురు సంతానం.అందులో ఐదుగురు ఆడపిల్లలే. సోమవారం ఉదయం పోసయ్య భార్య హడమమ్మ,పెద్ద కూతురు లక్ష్మి కూలీ పనులకు వెళ్తూ ఇంటి వద్ద ఆనపకాయ కూర,అన్నం వండి ఇంట్లో ఉంచి వెళ్లారు. మధ్యాహ్నం మద్యం మత్తులో కూరలో పిట్టల మందు కలిపి తిన్న సోమయ్య ఇంట్లో ఓ మూలన పడుకున్నాడు.సాయంత్రం కూలీ పనుల నుంచి వచ్చిన భార్య,కూతురు పోసయ్య పరిస్థితి గమనించి ఏడుగురాళ్ళపల్లి ఆసుపత్రికి తరలించారు.అక్కడ చికిత్స పొందుతూ పోసయ్య మృతిచెందాడు.పోసయ్యకు ఏమైందో తెలియని ఆ కుటుంబంలోని ఐదుగురు చిన్నారులను ఇంటి వద్ద ఒంటరిగా వదలేక, పోసయ్యకు అక్క అయిన ముచ్చిక ఐతమ్మ,ఆమె కూతురు లక్ష్మిని ఇంటి వద్ద వదిలేసి వెళ్ళారు.రాత్రి కావటంతో పిల్లలు ఆకలి అనటంతో ఐతమ్మ అన్నం వండి ఇంట్లో ఉన్న కూరను పిల్లలకు పెట్టింది.తాను కూడా తిన్నది.కాని కూరలో విషం కలిపినట్టు ఆమె గుర్తించలేదు.అయితే పోసయ్య కుమారుడు వయస్సు రెండుసంవత్సరాలు అన్నం తినటానికి నిరాకరించాడు.దాంతో ఆ ప్రమాదం నుంచి బయటపడ్డాడు.అయితె రాత్రి కావటంతో ఎక్కడి వాళ్ళు అక్కడ పడుకున్నారు.పిల్లలు,ఐతమ్మ అందరికి వాంతులు, విరేచనాలు కావటంతో ఎదో జరిగింది అని ఊహించిన ఐతమ్మ చింతపండు రసం తీసి అందరికి తాగించింది. రాత్రి 10గం॥ ప్రాంతంలో మృతదేహంతో ఇంటికి చేరిన హడమమ్మ, ఆమె కూతురు,బంధువులు ఇంట్లో ఉన్న అందరు చిన్నారులు,ఐతమ్మ పరిస్థితి చూసి తల్లడిల్లి పోయారు.ఒక వైపు శవం,మరో వైపు ఆరుగురి పరిస్థితి విషమం.కారుచీకటి,కమ్యూనికేషన్ లేని గ్రామం .అలాగే తెల్లవారే వరకు గడిపి మంగళవారం ఉదయం ఏడుగురాళ్ళపల్లి ఆసుపత్రికి తరలించగా ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు.ప్రస్తుతం ఐదుగురు చిన్నారులు, మృతుడి అక్క పరిస్థితి నిలకడగా ఉంది.విషయం తెలుసుకున్న పోలీసులు ఆ గ్రామానికి చేరుకొని పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని చింతూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు.ఆసుపత్రి వద్ద మృతుడి భార్య,కుమార్తెతో పాటు బంధువులు,గ్రామస్తులు ఆసుపత్రి ముందు కూర్చొని అమాయకంగా చూస్తున్న దృశ్యం చూరులను సైతం కంట తడిపెట్టించేలా ఉంది.

# ఏడుకొండలస్వామిని చూడాలంటే ఎన్ని క్యూలైన్లో!

**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** ధార్మికసంస్థ తిరుమల తిరుపతిదేవస్థానం యాజమాన్యం సామాన్యభక్తులకు ఏడుకొండల వెంకన్న దర్శనం,వసతి సదుపాయాలకు సాంకేతిక పరంగా విప్లవాత్మక మార్పులు తీసుకువస్తున్నా ఆ దేవుని దగ్గరకు చేరుకునేందుకు క్యూలైన్లు మాత్రం ఎంతెంతదూరం అనేది భక్తులు అంచనావేయలేక పోతున్నారు. తిరుమలకు చేరుకున్న భక్తులు వైకుంఠమ్ 1, వైకుంఠమ్ 2 క్యూకాంప్లెక్స్‌లలో 62 కంపార్టుమెంట్లు నిండితే భక్తులకు సర్వదర్శన కష్టాలు తప్పవు. ఒక్కో కంపార్టుమెంట్‌లో 350నుండి 400మంది వరకు భక్తులు నిరీక్షిస్తారు. ఇలా 25వేలమంది వరకు భక్తులు కూర్చునేందుకు సౌకర్యంగా ఉంటుంది. ఆ తరువాత వచ్చిన సామాన్యభక్తులు ఏటిసి, నారాయణగిరి ఉద్యానవనాల వరకు విస్తరించిన క్యూలైన్లలో నుండి ఆలయంలోనికి చేరుకోవాల్సి ఉంది.ఇక 60వేలమంది భక్తులు దాటితే వెలుపల శిలాతోరణం వరకు, ఆక్టోపస్ భవనం, గోగర్భమ్‌డ్యామ్ వరకు కూడా కిలోమీటర్లు దూరం క్యూలైన్లు వ్యాపిస్తాయి. సర్వదర్శనానికి రద్దీరోజుల్లో, వారాంతంరోజుల్లో ఏకంగా 24 గంటలు సమయం నిరీక్షించాల్సి వస్తోంది.

**క్యూలైన్లు కుదింపుపై అధ్యయనం అవసరం:** తిరుమలేశుని దర్శనం కోసం టిటిడి అధికారులు రోజువారీగా ఆన్‌లైన్ లో 300 రూపాయలు ప్రత్యేక ప్రవేశ దర్శనాలు, ఆర్జితసేవలు, కాలినడక భక్తులకు ,సామాన్యభక్తులకు సర్వదర్శన టైమ్‌స్లాట్ దర్శనాలు, సాధారణ సర్వదర్శనం దర్శనాలు అమలవుతున్నాయి. ఎలాంటి దర్శన టోకెన్లు, టిక్కెట్లు లేని భక్తులు నేరుగా తిరుమలకు వస్తే గతంలో వైకుంఠమ్ 2క్యూకాంప్లెక్స్ వద్ద క్యూలైన్లలో నుండి భక్తులు ఆలయంలోనికి చేరుకునే విధానం ఉండేది. ఇప్పుడు సామాన్యభక్తులు ఈ దరిదాపుల్లోకి కూడా రావడం లేదు. తిరుమలలో సులభంగా భక్తులు ఆలయంలోనికి చేరుకునేందుకు వీలుగా 2014వ సంవత్సరంలోనే వైకుంఠమ్ 1కు సమీపంలో ఏటిసి వద్ద ప్రత్యేక ప్రవేశ దర్శనాల కాంప్లెక్స్‌ను, కాలినడక భక్తులకు దివ్యదర్శనం కాంప్లెక్స్‌ను అప్పటి టిటిడి ఇఒ డాక్టర్ సాంబశివరావు ముందు చూపుతో నిర్మించి అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ రెండు విధానాల్లో టిక్కెట్లు ఉన్న భక్తులు నేరుగా ఈ కాంప్లెక్స్‌ల వద్దకు చేరుకుని ఆలయంలోనికి వెళ్ళేవారు.

### ఆలయంలోనికి సులభ క్యూలైన్లు ఏవీ?





శిలాతోరణం ప్రాంతంలో వెలుపల క్యూలైన్లు

300 రూపాయలు ప్రత్యేక ప్రవేశదర్శన టిక్కెట్లు భక్తులను ఎస్ఎంసి వద్ద క్యూలైన్లనుండి ఆలయానికి దగ్గర దారిని అమలుచేశారు. అయితే ఇప్పుడు ఈ విధానం అమలుకాకపోగా కిలోమీటర్లు బారులుతీరిన క్యూలైన్లు సామాన్యభక్తుల ఓపికను పరీక్షించేలా టిటిడి అధికారుల వ్యవహారం తయారైంది. ఎలాంటి దర్శన టోకెన్లు, టిక్కెట్‌లేని భక్తులను రద్దీని బట్టి లేపాక్షి కూడలి నుండి గానీ, పాత అన్నదానం కాంప్లెక్స్ క్యూలైన్ల నుండి భక్తులను అనుమతించే వారు. తిరుమలకు వచ్చిన టిటిడి ఇఒలు, జెఇఒలు తమదైన రీతిలో విధానాల్లో మార్పులు తీసుకుంటూ సామాన్యభక్తులకు దర్శనంలో చుక్కలు చూపిస్తున్నారు. సహనాన్ని పరీక్షిస్తూ ఏకంగా 24 గంటలుపైగానే దర్శనం సమయం నిరీక్షణ తప్పడంలేదు.

# ఆర్టీసీలో 3,673 డ్రైవర్లు, 1,813 కండక్టర్ పోస్టులు భర్తీకి ప్రతిపాదన

### ప్రభుత్వాన్ని కోరిన ఆర్టీసీ బోర్డుసమావేశం

**విజయవాడ.జనవరి 27,ప్రభాతవార్తప్రతినిధి:** మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పించేందుకు రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న స్త్రీ శక్తి పథకాన్ని మరింత సమర్థంగా అమలు చేసేందుకు ఆర్టీసీ చర్యలు తీసుకుంటుంది. ప్రస్తుతం ఉన్న సిబ్బంది కొరత సహా బస్సుల కొరత సమస్యలను అధిగమించేందుకు ఆర్టీసి బోర్డు సమావేశమై కీలక నిర్ణయం తీసుకుంది. ఆర్టీసీ చైర్మన్, మాజీ ఎంపీ కొనకళ్ళ నారాయణ మీడియాకు అందించిన సమాచారం మేరకు సంస్థలో ఖాళీగా ఉన్న రెగ్యులర్ డ్రైవర్, కండక్టర్ ఉద్యోగాలు భర్తీ చేసేందుకు రంగం సిద్దం చేస్తోంది. ఖాళీగా ఉన్నటువంటి 7,673 రెగ్యులర్ పోస్టుల నియామకానికి అనుమతించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు ఆర్టీసీ పాలకమండలి సమావేశంలో తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపింది. ఇందులో 3,673 డ్రైవర్లు పోస్టులు, 1,813 కండక్టర్ పోస్టులు భర్తీకి అనుమతించాలని ప్రభుత్వాన్ని బోర్డు కోరింది. ఆన్ కాల్ డ్రైవర్ల రోజువారీ వేతనాన్ని రూ. 800 నుంచి రూ.1000 వరకు పెంచాలని నిర్ణయించారు. డబుల్ డ్యూటీ చేసే కండక్టర్లకు ఇచ్చే మొత్తాన్ని రూ. 900కి పెంచింది. పనిష్మెంట్ కేసులతో సంబంధం లేకున్నా ఆర్టీసీ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరింది. కొనకళ్ళ వివరించిన మేరకు కొత్త ఎలక్ట్రిక్ బస్సులు ఇప్పుడు రూపొందుతున్నాయి. వాటి నిర్మాణాలన్నీ పూర్తయిన తర్వాత వీలయినంత త్వరగా ఇక్కడకు వస్తాయి. త్వరలోనే ఏపీకి 1,050 బస్సులు అందుబాటులోకి వచ్చి సేవలందిస్తాయి. ప్రస్తుతానికి ఆర్టీసీ సిబ్బందికి ఎటువంటి కొరత లేదు. అయితే ఆన్ కాల్ డ్రైవర్లను నియమించుకుని వారికి తగిన తర్ఫీదును అందించి డ్రైవింగ్‌లో నైపుణ్యాన్ని సాధించిన తర్వాతే వారిని పూర్తి స్థాయి డ్రైవర్ ఉద్యోగులుగా నియమించుకుంటాం. అయితే ఈ రోజున తాత్కాలిక సిబ్బంది కావాలనే ఆలోచన సైతం ఉంది.

**జరుగుతోన్న సంప్రదింపులు:** అందుకు అనుగుణంగానే దీన్ని దృష్టిలో పెట్టుకుని కేంద్రం సబ్సిడీని ఇస్తుంది. ఇంతకు ముందుగానే 1,050 బస్సులను ఆర్డర్ ఇవ్వడం జరి గింది. అవి ఇప్పుడు వచ్చినట్లయితే ప్రస్తుతం ఉన్న ఇబ్బంది నుంచి తాత్కాలికంగా బయటపడతాం. ప్రస్తుతం ఆ బస్సుల కోసమే ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు దిల్లీ వెళ్లి వచ్చారు. ప్రస్తుతానికి కొత్త బస్సుల కోసం సంప్రదింపులు జరుగుతున్నాయి. ఇవన్నీ సకాలంలో పూర్తయితే బస్సులు కొరతనేది తీరిపోతుంది.

# బాలికపట్ల అసభ్యప్రవర్తన: ముద్దాయికి ఆరు నెలల జైలు శిక్ష

### 10,000 జరిమానా విధించిన న్యాయస్థానం

**విజయవాడ.జనవరి 27,ప్రభాతవార్తప్రతినిధి:** మచిలీపట్నం లోని పాత రామన్నపేటకు చెందిన బాలిక ను 2017 వ సంవత్సరంలో ప్రైవేటు స్కూలు స్కూల్ నందు 10 తరగతి చదువుతుండగా అదే స్కూల్ నందు ఫిజిక్స్ మాస్టర్‌గా పనిచేయుచున్న వీరంకి నాగరాజు అను అతను ఎక్కువ మార్కులు తెప్పిస్తానని ప్రైవేటు క్లాసులు చెప్తానని ఆమె పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినట్లుగా ఆమె ఇచ్చిన రిపోర్టుపై అప్పటి SI, K.V.S.R.K. కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరము ముద్దాయిని అరెస్టు చేసి తదనంతరం ఛార్జ్ షీట్ దాఖలు చేయడం జరిగింది. స్పెషల్ పీపీ మాదివాడ నరసింహారావు సాక్షులను విచారించిన పిదప పోక్సోకోర్టు జడ్జి అయినా బి వెంకటేశ్వర్లు ముద్దాయిపై నేరం రుజువైనందున ముద్దాయికి నిర్దేశిత చట్ట ప్రకారం రూ..10,000 జరిమానా, పెనాల్టీ కటని యెడల ఒక నెల రోజులు సాధారణ జైలు శిక్ష, పోక్సోయాక్ట్ ప్రకారము ఆరు నెలలు జైలు శిక్ష మరియు వెయ్యి రూపాయలు జరిమానా, జరిమాన కట్టని ఎడల నెల రోజులు సాధారణ జైలు శిక్ష, U/s.506 IPC ప్రకారము 5000 రూపాయలు జరిమానా జరిమాన కట్టని యెడల ఒక నెల రోజులు సాధారణ జైలు శిక్ష విధించినట్లుగా తీర్పు చెప్పారు. ఈ కేసులో ముద్దాయికి శిక్ష పడేందుకు సహకరించిన పిఎ ఏపీఎకి, సిబ్బందికి జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు, ఐపీఎస్ అభినందనలు తెలియజేశారు.

# తిరుమల సమాచారం



## తెప్పపై పార్థసారథిస్వామి కటాక్షం

**తిరుపతి,జనవరి 27ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతి గోవిందరాజస్వామి ఆలయ వార్షిక తెప్పోత్సవాల్లో రెండవరోజు మంగళవారం సాయంత్రం రుక్మిణీ సత్యభామసమేత పార్థసారథిస్వామి భక్తులను కటాక్షించారు. సాయంత్రం నిత్య కైంకర్యాలు ముగించుకున్న అనంతరం ఉత్సవమూర్తులు పార్థసారథిస్వామి, అమ్మవార్లను పుష్కరిణిలోని తెప్పపైకి వేంచేపు చేయించారు. అక్కడ దేవేరులతో కలసి స్వామి సాయంత్రం 6.30గంటలకు తెప్పపై ఐదుచుట్లు విహారించి భక్తులకు అభయమిచ్చారు. భక్తులు గోవిందనామస్మరణలతో పులకించారు. అనంతరం ఉత్సవమూర్తులు ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు భజనల, హరికథ, సంగీత కార్యక్రమాలు నిర్వహించారు. ఈ తెప్పోత్సవంలో పెద్దజీయర్‌స్వామి,చిన్నజీయర్‌స్వామి, ఆలయ డిప్యూటీ ఇఒ శాంతి, ఎఇఒ నారాయణచౌదరి, సూపరింటెండెంట్ శేషగిరి, ఆలయ ఇన్‌స్పెక్టర్ ధనంజయ,అర్చకులు పాల్గొన్నారు.



## శ్రీమధ్వ విజయం పారాయణం

**తిరుమల,జనవరి 27ప్రభాతవార్తప్రతినిధి:** మధ్యనవమిని పురస్కరించుకుని టిటిడిదాససాహిత్యప్రాజెక్టు ఆధ్వర్యంలో మంగళవారం తిరుమల ఆస్థానమండపంలో 140మంది పండితులు శ్రీమధ్వవిజయం పారాయణం చేశారు.భువనగిరి శ్రీరాఘవేంద్రస్వామి మఠం మఠాధిపతి సువిద్యేంద్రతీర్థ స్వామి అనుగ్రహ భాషణం చేశారు. శ్రీమద్వాచార్యులు బోధించిన ద్వైత సిద్ధాంతం ద్వారా భక్తేమోక్షానికి మార్గమని చాటిచెప్పారు. ఈ కార్యక్రమంలో దాససాహిత్యప్రాజెక్టు ప్రత్యేక అధికారి ఆనందతీర్థాచార్యులు, పండితులు పాల్గొన్నారు.



## స్వామివారి ఆశీస్సులతో అందరికీ మంచి జరగాలి

**తిరుమల,జనవరి 27ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవేంకటేశ్వర స్వామి ఆశీస్సులతో ప్రజలందరికీ మంచి జరగాలని, ప్రజలు సంతోషంగా ఉం డాలని స్వామివారిని వేడుకున్నట్లు పలువురు ప్రముఖులు తెలిపారు. మం గళవారం ఉదయం విఐపి బ్రేక్‌లో సినీసంగీత దర్శకుడు ఎంఎం కీరవాణి, సినీ నటుడు రాజీవ్‌కనకాల కుటుంబంతో కలసి వేర్వేరుగా ఆలయంలోనికి చేరు కు న్నారు.ఉదయం విఐపిబ్రేక్‌లో వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. టిటిడి ఆలయఅధికారులు దర్శనంచేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.



# సమష్టిగా రథోత్సవం విజయవంతం
### 3.45 లక్షల మంది భక్తులు వాహనసేవల వీక్షణం
### 9.42 మందికి అన్నప్రసాదం

**తిరుమల,జనవరి 27ప్రభాతవార్తప్రతినిధి:** సాధారణంగా ఏడుకొండల వేంకటేశ్వంస్వామికి నిర్వహించే వార్షిక బ్రహ్మోత్సవాల తొమ్మిదిరోజుల సందర్భం కంటే, ఒకరోజు బ్రహ్మోత్సవం(రథసప్తమి,జనవరి 25) రోజు ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు ఆదేశాలు, టిటిడి పాలకమండలి సహకారం...వెరసి అనుభవజ్ఞులైన టిటిడి ,జిల్లాఉన్నతాధికారుల నిర్విరామ కృషి, సమన్వయం విజయవంతమైందని టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి హర్షం వ్యక్తం చేశారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా అర్థబ్రహ్మోత్సవాన ఏడువాహనసేవలవీక్షణకు 3.45లక్షలమంది భక్తులు మాఢవీధుల్లో విచ్చేశారన్నారు. ఒక్కరోజే 9.42లక్షలమంది భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేయడం జరిగిందన్నారు. 6.30క్షలమందికి పానీయాలు, 2.90లక్షలమందికి పాలు, 2.15లక్షలమందికి తాగునీటి సీసాలు అందించగలిగామన్నారు. మంగళవారం మధ్యాహ్నం తిరుమల అన్నమయ్య భవనంలో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, టిటిడి సివిఎస్ఒ కెవి మురళీకృష్ణ, సిపిఆర్ఒ డాక్టర్‌తలారి రవి, పిఆర్ఒ నీలిమతో కలసి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్ ఐక్యంగా మీడియాప్రతినిధులతో సమావేశమయ్యారు. టిటిడి సదుపాయాలపై భక్తుల నుండి విశేషస్థాయిలో ప్రశంసలు రావడం ప్రత్యేకత. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ,భక్తుల నుండి సేకరించిన అభిప్రాయాలు ,సలహాలు సూచనలతో మరింత మెరుగైన సేవలందించగలిగామని ఇఒ తెలిపారు. మాఢవీధుల్లో 220మంది శ్రీవారిసేవకులను వినియోగించామన్నారు. 1,800మంది పోలీసులు, 1200మంది విజిలెన్స్‌సిబ్బంది, 150మంది ట్రాఫిక్ పోలీసులు మెరుగైన సేవలందించారన్నారు. గతంలో బ్రహ్మోత్సవాల సమయంలో కూడా లేని విధంగా లగేజీకేంద్రంలో 3.65లక్షల గ్యాడ్జెట్లు,బ్యాగులు డిపాజిట్ చేశారన్నారు. తిరుపతి నుండి తిరుమలకు 1,932ట్రిప్పులు ఆర్టీసిబస్సులు నడిపి 60,425మంది భక్తులను తరలించగా, తిరుమల నుండి తిరుపతికి 1,942ట్రిప్పుల ద్వారా 82,241మంది భక్తులను చేరవేశారన్నారు. రథసప్తమిరోజు 23వేలమంది భక్తులకు వైద్యసేవలందించారని, 94మందిని అంబులెన్స్‌లద్వారా తిరుపతిలోని ఆస్పత్రులకు తరలించామన్నారు. రథసప్తమి వేడుకలను విజయవంతం చేయడంలో మీడియాసిబ్బంది పాత్ర అమూల్యమన్నారు. ఉదయం ఐదుగంటల నుండి రాత్రి 9గంటలవరకు తాను(టిటిడి ఇఒ), టిటిడి అదనపు ఇఒ,తిరుపతి జిల్లా ఎస్పీ ,సివిఎస్ఒ అధికారులు కలసి గ్యాలరీలను పరిశీలించడం, గ్యాలరీల్లో భక్తులతో మాట్లాడటం జరిగిందన్నారు. టిటిడి కల్పించిన సౌకర్యాలు,ఏర్పాట్లపై ప్రతి ఒక్కరూ సంతృప్తి వ్యక్తం చేశారన్నారు. బ్రహ్మోత్సవాల కంటే రథసప్తమిన భక్తులకు కల్పించిన సౌకర్యాలతో ,3.45లక్షలమంది భక్తులకు సకలం సంతోషంగా చేయించడం పట్ల సిఎం చంద్రబాబునాయుడు అభినందనలు తెలియజేయడం తమకు మరింత బాధ్యతను గుర్తుచేసిందని అధికారులు ముక్తకంఠంతో తెలిపారు.

నిన్ను నువ్వు ప్రేమించుకోవడం నేర్చుకుంటే ఇతరుల్ని ద్వేషించడం మానివేస్తావు.


-రోజర్

# ఉపేక్షిస్తే ఉపద్రవమే!

మాదకద్రవ్యాల వ్యసనం జాతి వినాశనానికి దారి తీస్తుందని, దాన్ని సమష్టిగా నిర్మూలించాల్సిన అవసరం ఉందని ఎంతో కాలంగా ప్రపంచ వ్యాప్తంగా దేశాధినేతలు పదేపదే చెప్తూనే ఉన్నారు. కానీ అంతకు రెట్టింపు స్థాయిలో ఈ మహమ్మారి యేడాదియేడాదికి విస్తరిస్తుండడం ఆందోళన కలిగించే అంశం. ముఖ్యంగా ఈ వ్యసనం పదిహేను, పదహారేళ్ల పిల్లలపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందని, నేరాల సంఖ్య అదుపు లేకుండా పెరిగిపోతున్నది. మాదకద్రవ్యాల మత్తులో వారు ఏంచేస్తున్నారో వారికే తెలియని పరిస్థితుల్లో చేయరాని, చేయకూడని పనులకు పాల్పడుతూ అవి కప్పిపుచ్చుకునేందుకు హత్యలు చేయడానికి కూడా వెనుకాడడం లేదు. తాజాగా మొన్న నిజామాబాద్ జిల్లాలో ఒక కారులో గంజాయి తరలిస్తున్న ముఠాను అడ్డుకునేందుకు ప్రయత్నించిన ఎక్సైజ్ మహిళా కానిస్టేబుల్ సౌమ్యపై కిరాతకులు కారుతోనే దాడికి ప్రయత్నించారు. దాడిలో ఆమె తీవ్రంగా గాయపడింది. ప్రాథమిక చికిత్స అందించి హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. కిడ్నీలు దెబ్బతినడంతో ఒక కిడ్నీని పూర్తిగాతొలగించారు. మరొక కిడ్నీకి డయాలసిస్ చేస్తున్నారు. ఆమె ప్రాణాలు కాపాడేందుకు వైద్యబృందం శతవిధాలా ప్రయత్నం చేస్తున్నది. ఎక్సైజ్, ఆరోగ్యశాఖ మంత్రులు ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. గంజాయి అక్రమ రవాణా అడ్డుకునే క్రమంలోనే సౌమ్యపై దాడి జరగడం దురదృష్టకరమన్నారు. నిందితులను ఎట్టి పరిస్థితుల్లో వదిలిపెట్టేదిలేదని స్పష్టం చేశారు. పోలీసులు ఇప్పటికే ఇద్దరిని అరెస్టు చేశారు. మిగిలిన నిందితుల కోసం గాలిస్తున్నారు. ఇదే కాదు ఇటీవల కాలంలో మాదకద్రవ్యాల రవాణాను అడ్డుకునే ప్రయత్నంలో ఎందరో అధికారులపై దాడులు జరుగుతున్నాయి. మొన్న ఆ మధ్య నెల్లూరు జిల్లాలో మత్తు మందుల వ్యాపారమే కాక అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్న ముఠా గుట్టును రట్టు చేయడమేకాక అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నారనే నెపంతో సామాజిక కార్యకర్తను హత్య చేయించినట్లు ఆరోపణలపై పోలీసులు కేసు నమోదు చేసి నిందితులను అదుపులోకి తీసుకొని దర్యాప్తు చేస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో నిత్యం ఎక్కడో ఒక చోట ప్రధానంగా గంజాయితోపాటు మత్తుమందులు పట్టుబడుతూనే ఉన్నాయి. గంజాయి సాగు ఊహించని రీతిలో పెరిగిందని చెప్పొచ్చు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లోనూ, విశాఖ ఏజెన్సీలోనూ ఇటు తెలంగాణ, ఖమ్మం, వరంగల్ తదితర జిల్లాల అటవీ ప్రాంతాల్లో గంజాయి సాగు ఇటీవల కాలంలో బాగా విస్తరించినట్లు వార్తలు అందుతున్నాయి. గతంలో ఆంధ్ర, ఒడిశా, సరిహద్దుల్లో తెలంగాణ పోలీసులు చేపట్టిన 'ఆపరేషన్ గంజా' తనిఖీల్లో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి.

అప్పట్లో ఆవిషయంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, అధికార ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధానికి దారితీసింది. ఈ అక్రమ వ్యాపారులను ప్రోత్సహిస్తున్నది మీరంటే మీరని పరస్పర ఆరోపణలు చేసుకున్నారు. ఇదేకాదు విదేశాల నుండి భారీఎత్తున డ్రగ్స్ అటు ఆంధ్రప్రదేశ్‌కు, ఇటు తెలంగాణకు చేరుకుంటున్నట్లు పట్టుబడుతున్న సంఘటనలు రుజువు చేస్తున్నాయి. గతంలో గుజరాత్‌లోని ముంద్రా పోర్టులో ఇరవైఒక్కవేల కోట్లరూపాయల విలువైన మూడు వేల కిలోల హెరాయిన్ పట్టుబడినప్పుడు విజయవాడ లింక్‌లు వెలుగులోకి వచ్చాయి. మత్తుమందు సరఫరా కోట్ల డాలర్ల వ్యవహారంలో ఎక్కువ భాగం ఉగ్రవాదులకే చేరుతున్నదని దర్యాప్తుసంస్థలు చెబుతున్నాయి. పాకిస్థాన్, అఫ్ఘానిస్థాన్, ఉజ్బెకిస్థాన్‌తోపాటు మరికొన్ని ఆఫ్రికా దేశాలు ఇందులో విరివిగా పాల్గొంటున్నాయి. కశ్మీర్ ఉగ్రవాదులకు, పంజాబ్‌లోని మత్తుమందు సరఫరాదారులకు గట్టి సంబంధమే ఉన్నట్లు బయటపడింది. మత్తుముఠాలు సొంతంగా ఒక పెద్ద నెట్‌వర్క్‌ను ఏర్పాటుచేసుకున్నాయి. మారుమూల ప్రాంతాలకు రవాణా చేయగలిగిన రకరకాల మార్గాలను ఏర్పర్చుకుంటున్నారు. లాటిన్ అమెరికాలో తయారవుతున్న మత్తు మందులు నలుమూలాల విస్తరించడంతోపాటు రసాయనికాలు తయారు చేసే యాంఫిటామైన్ ట్రైప్‌స్టిమ్‌లెన్స్ ఎక్కడికక్కడ తయారవుతున్నాయి. భారతదేశంలో ఈ తరహా మత్తుమందులు పెద్దమొత్తంలో ఉత్పత్తి అవుతున్నాయి. అందుబాటులోకి వస్తున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా ఈమత్తుమందువ్యాపారులు ఉపయోగించుకుంటున్నారు. బ్యాంకులు, ఇతర వ్యవస్థలతో సంబంధం లేకుండా సరాసరి ఒకరి ఖాతా నుంచి మరొకరి ఖాతాకు బదలీచేయించే 'క్రిప్టోకరెన్సీ' వాడకం సైతం పెరగడంతో లావాదేవీలకు అదుపులేకుండాపోతున్నది. గతంలో మత్తుమందులు కొనేవారు తెలిసినా నమ్మకం ఉన్న వ్యాపారినే సంప్రదించేవారు. మత్తు మందులు తీసుకొని డబ్బులుచేతిలో పెట్టేవారు. ఆవ్యాపారి కూడా అత్యంత రహస్యంగా మూడోకంటికి తెలియకుండా మత్తు మందు తెప్పించి అప్పగించేవాడు. ఇది అత్యంత పకడ్బం దీగా జరుగుతున్నా నిఘా విభాగం అధికారులు కన్ను వేయడంతో ఎక్కడో ఒక దగ్గర దొరికిపోయేది. ఇప్పుడు ఆ పరిస్థితులు లేవు. ఇండియాలో మారుమూల ప్రాంతాల్లో కూర్చొని ఎక్కడో విదేశాల్లో ఉన్నమత్తుమందు వ్యాపారికి ఆర్డర్ ఇవ్వొచ్చు. రవాణా, చెల్లింపులు సులభం కావ డంతో విక్రయాలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఈ మహమ్మారి ప్రపంచమంతా విస్తరించిపోయింది. మాదక ద్రవ్యాలను నిరోధించే విషయంలో మాటలకే పరిమితం కాకూడదు. అటుకేంద్రం, ఇటు రాష్ట్రప్రభుత్వాలు ఉమ్మడి కార్యాచరణ రూపొందించి అమలు చేయగలిగితే కొంతవరకైనా నియంత్రించవచ్చు.

అధర్మంగా ఆర్జించిన సంపాదనతో ఆచరించిన సత్కర్మలు సత్ఫలితాలనివ్వవు.



ఆస్కార్‌వైల్డ్

తోటివారికి మీ వల్ల హెచ్చు ఉపకారమూ, సాధ్యమైనంత తక్కువ అపకారమూ జరిగేటట్టు చూసుకోవడమే సరైన ప్రవర్తన.



హెచ్.లాంగ్‌ఫెలో

# రహదారి విధానంలో మార్పులవసరం

**రహదారులు భూమట్టం నుండి 23 మీటర్ల ఎత్తులో నిర్మించడం వల్ల, దానికి కావాల్సిన మట్టిని గుట్టలు పుట్టలు తవ్వి వాడడం వల్ల, పరిసర గ్రామాల ప్రజలకు కనీసం ఇంటి నిర్మాణానికి అవసరమయ్యే మట్టిదొరకడం లేదు. ఈ రోడ్ల నిర్మాణంలో భారీ వాహనాలు నడవడం వల్ల ఆ చుట్టుపక్క ప్రాంత రోడ్లు గుంతలు పడడం, అవి వేసే దుమ్ము ధూళి వల్ల పంటలు దిగుబడి రాకుండా నష్టపోతున్నాయి. ఇలా చెప్పుకుంటే రైతుల వ్యధలు అన్నిఇన్ని కావు. భవిష్యత్ తరాలకు అద్భుత ఫలాలనిచ్చే రహదారులను నిర్మించడం అవసరమే. అందుకు రైతులు అందరు సహకరించాల్సిన అవసరం ఉంది. కానీ ఆ నిర్మాణంలో రైతు కోల్పోతున్న ఉనికిని, నష్టానికి తగ్గట్టుగా పరిహారానికి ప్రభుత్వాలు ఆలోచన చేయాలి. వ్యవసాయమే సుడిగుండం అయి రైతులను అతలాకుతలం చేస్తున్నవేళ ఇటువంటి అకాల పరిణామాల నుండి రైతులను రక్షించే బాధ్యత ప్రభుత్వాలదే.**

భైరబోయిన వెంకటేశ్వర్లు

దేశాల, రాష్ట్రాల అభివృద్ధి సూచికలు రహదారులు. రహదారులు ఎంత సౌకర్యవంతంగా ఉంటే అంత అభివృద్ధి చెందినట్లు లెక్క. జాతీయ స్థాయిలో రాష్ట్రాలను కలుపుతూ జాతీయ రహదారులు, రాష్ట్రస్థాయిలో జిల్లాలను అలాగే గ్రామస్థాయిలో పల్లెలను కలుపుతూ రహదారులు ఉంటాయి. వీటిలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పెరుగుతున్న వాహనాల రద్దీకి తగ్గట్టుగా రహదారులు విస్తరించడం అవసరం. అలానే సుదూరాలను దగ్గర చేయడానికి కొత్త రహదారులను నిర్మించడం అనివార్యం. ఒక దేశ అభివృద్ధిలో పెట్టుబడుల పరంగా పరిశ్రమలు రావాలంటే ఆ పరిశ్రమలకు తగిన భూమి ప్రభుత్వం చూపించాల్సి ఉంటుంది. ఒక నిర్దిష్ట పరిధిలో నిర్మించే పరిశ్రమలకు ప్రభుత్వ భూములు ఉంటే వాటినే కేటాయిస్తారు. లేదంటే పరిహారం ఇచ్చి రైతుల వద్ద నుండి సేకరిస్తారు. కానీ కొత్త రహదారులు నిర్మించే విషయంలో మాత్రం రహదారులకు కావలసిన భూమి అంతా రైతుల నుండి సేకరించాల్సిందే. దేశంలో అభివృద్ధి పథంలో నడవడానికి రోజురోజుకు కొత్త రహదారులు నిర్మాణానికి రూపకల్పన చేస్తున్నాయి ప్రభుత్వాలు. ఉన్న మార్గాన్ని విస్తరిస్తే బ్రౌన్ ఫీల్డ్ అని కొత్త మార్గాలను గ్రీన్ ఫీల్డ్ హైవేలని అంటారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రం అంతట సుమారు 600 కి.మి నిడివి గల గ్రీన్‌ఫీల్డ్ రహదారులు నిర్మాణంలో ఉన్నాయి. కానీ రహదారుల నిర్మాణంలో కనబడే అభివృద్ధి వెనక ఎంతో మంది రైతుల వ్యధలు ఉన్నాయన్నది నిజం. భారీ భూస్వామ్యవ్యవస్థలు లేని మన దేశంలో భూమి అంతా చిన్నచిన్న కమతలుగా రైతుల చేతుల్లో ఉంది. రహదారుల కింద కోల్పోతున్న భూములలో తాతలు, తండ్రుల నుండి వారసత్వంగా వస్తున్న భూములు కొన్ని అయితే తిని తినక రూపాయి రూపాయి పోగుచేసు కొని కొన్న భూములు కొందరివి. రహదారుల క్రింద తమ అస్తిత్వం బ్రతుకుతెరువు అన్ని కోల్పోయి నగరాలకు వలస వెళ్లేవారు కొందరైతే ఒకటి రెండు ఎకరాలు ఉన్న చిన్న రైతులు ఉన్నది కోల్పోయి వ్యవసాయ కూలీలుగా మారుతున్నారు. రహదారుల అమరికలో భూమి కోల్పోయిన రైతులకు ప్రభుత్వాలు నష్టపరిహారాన్ని చెల్లిస్తాయి. కానీ ఈ చెల్లించే నష్టపరిహారం రైతులకు ఏమాత్రం సరిపోదుఅన్నది నిజం. రైతులకు ప్రభుత్వాలు భూమి, ప్రభుత్వ విలువను బట్టి దానికి అధనంగా పరిహారం ఇస్తారు. కానీ వాస్తవానికి మార్కెట్లో అధిప్రభుత్వ విలువకన్నా చాలారెట్లు అధికంగా ఉంటుంది. సుమారు ఒక ఎకరం భూమి రోడ్డు పరిధిలో



వెళితే ఆ ఎకరానికి ఇచ్చిన నష్టపరిహారంతో ఆ ప్రాంతంలో కనీసం సగం భూమి కూడా రాని పరిస్థితి ఉంది. పల్లెల్లో బండ్ల బాట, తారు రోడ్ల ప్రక్కన ఉన్న భూముల విలువ లోపలి భూముల కన్నా ఎక్కువగా ఉంటుంది. కానీ ప్రభుత్వ విలువ సమానంగా ఉన్నందున దీనికి లోపలి భూములకు ఒకే తరహా పరిహారం చెల్లించడంతో కొంత మంది రైతులకు నష్టం జరుగుతోంది. కొందరు రైతులు ప్రభుత్వంతో పోరాడలేక ఇచ్చే పరిహారానికి ఒప్పుకున్న మరికొందరు అధిక పరిహారం కోసం కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. పరిహారం విషయం పక్కన పెడితే భూమిని నమ్ముకున్న రైతు తన వ్యవసాయ సాధన అనుకూలతను బట్టి తన భూమిని చతురస్రాకార, దీర్ఘచతురస్రాకార ఆకారాలలో చిన్న కమతలుగా నిర్మించి తమకనువుగా వ్యవసాయం చేసుకుంటారు. నూతన రహదారుల అమరికలో అప్పటివరకు ఏకరీతిగా ఉన్న భూమి ఆకారం లేకుండా అవుతుంది. అది కూడా వ్యవసాయం చేయడానికి అనువుగా ఉండడం లేదు. మరి గ్రీన్‌ఫీల్డ్ లాంటి వాహన నియంత్రణ రహదారి పొడుగునా ప్రహరీ గోడ నిర్మించే రహదారుల్లో ఈ ఆకారం లేని భూభాగం సగం రహదారులకు ఒకప్రక్కన ఉంటే మిగిలినది మరొక్క ప్రక్కన ఉంటుంది. ఇటు నుండి అటు దాటలేని రహదారుల ప్రక్కన రైతులకు వ్యవసాయం చేయడం దినదిన గండంగా మారనుంది. ఈ రహదారుల అమరికలో భూమితోపాటు జల వనరులు అయిన బావులు సైతం పూడ్చాల్సి వస్తుంది. ఒకవేళ రహదారుల అమరికలో విద్యుత్‌లో, హై టెన్షన్ లైన్లు, మిషన్ భగీరథ పైప్ లైన్లు, ఇరిగేషన్ కాలువలు లాంటివి నష్టపోతే మాత్రం వాటిని ఎంత ఖర్చైనా తిరిగి యధావిధిగా పునర్ నిర్మించే ప్రయత్నం చేస్తారు. కానీ రైతులను పునర్మించడం లేదన్నదినిజం. అలాగే ఈ రహదారుల నిర్మాణంలో నిర్మాణానికి కావలసిన కంకర కోసం ఆ చుట్టుపక్కల గ్రామాల్లో ప్రకృతి సంపదగా వస్తున్న కొండలను పిండి చేసి రోడ్ల నిర్మాణంలో వాడుతున్నారు. ఈ రహదారులు భూమట్టం నుండి 23 మీటర్ల ఎత్తులో నిర్మించడం వల్ల దానికి కావాల్సిన మట్టిని గుట్టలు పుట్టలు తవ్వి వాడడంవల్ల పరిసర గ్రామాల ప్రజలకు కనీసం ఇంటి నిర్మాణానికి అవసరమయ్యే మట్టిదొరకడం లేదు. ఈ రోడ్ల నిర్మాణంలో భారీ వాహనాలు నడవడం వల్ల ఆ చుట్టుపక్క ప్రాంత రోడ్లుగుంతలు పడడం, అవి వేసే దుమ్ము ధూళి వల్ల పంటలు దిగుబడి రాకుండా నష్టపోతున్నాయి. ఇలా చెప్పుకుంటే రైతుల వ్యధలు అన్నిఇన్ని కావు. భవిష్యత్ తరాలకు అద్భుత ఫలాలనిచ్చే రహదారులను నిర్మించడం అవసరమే. అందుకు రైతులు అందరు సహకరించాల్సిన అవసరం ఉంది. కానీ ఆ నిర్మాణంలో రైతు కోల్పోతున్న ఉనికిని, నష్టానికి తగ్గట్టుగా పరిహారానికి ప్రభుత్వాలు ఆలోచన చేయాలి. వ్యవసాయమే సుడిగుండం అయి రైతులను అతలాకుతలం చేస్తున్నవేళ ఇటువంటి అకాల పరిణామాల నుండి రైతులను రక్షించే బాధ్యత ప్రభుత్వాలదే. ●

# ఆదివాసీల సొంతింటి కల నెరవేరేనా?

మల్లేశ్ పొంగి

దేశంలో అత్యంత వెనుకబడిన ఆదివాసీగిరిజన సమూహాలుగా గుర్తించబడిన పివిటిజి కమ్యూనిటీల జీవన పరిస్థితులు మెరుగుపడాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి జంజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ (పిఎం జంజాతి) పథకాన్ని తీసుకొచ్చింది. ఈ కార్యక్రమం 18 రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతంలో ఉన్న 75 పివిటిజి సమూహాలకు ఉద్దేశించబడింది. మూడు సంవత్సరాల కాలంలో పివిటిజి కుటుంబాలు, నివాస ప్రాంతాలకు సురక్షిత గృహాలు, శుభ్రమైన తాగునీరు, విద్య, ఆరోగ్యం, పోషణ సేవలకు చేరువ, రోడ్డు, టెలికాం కనెక్టివిటీ, విద్యుత్ సౌకర్యం లేనిగృహాలకు విద్యుదీకరణ, స్థిరమైన జీవనోపాధి అవకాశాలు వంటి ప్రాథమిక సదుపాయాలు అందేలా చేయడమే దీనిలో ప్రధాన ఉద్దేశం. ఈ లక్ష్యాలను వివిధ శాఖల సమన్వయంతో అనేక కార్యాచరణల ద్వారా అమలు చేయాలని ప్రభుత్వం ప్రకటించింది. లక్ష్యం గొప్పదే. కానీ ఆంధ్రప్రదేశ్ అల్లూరి సీతారామరాజు జిల్లాలో గిరిజన ఆదివాసి పివిటిజి నిరుపేద కుటుంబాలకు ఈ పథకం కింద గృహాలు వాస్తవంగా ఆశించినా దాని కంటే మేలు చేస్తాయా అంటే లేదనే చెప్పాలి. ఎందుకంటే ఇప్పుడు నిర్మిస్తున్న పిఎం జంజాతి గృహాలు కొన్నిచోట్ల సగటు నిరుపేద కుటుంబాలకు శాపంగా మారుతున్నాయి. ఇల్లు కట్టుకోవడం ప్రతి నిరుపేద కుటుంబం కల. మరీ ముఖ్యంగా వెనకబడిన పివిజిటి కుటుంబాలు పూరి గుడిసెల్లో జీవిస్తూ కొండలు అడవుల్లో జీవనం కొనసాగిస్తుంటారు. వీరు బయట ప్రపంచానికి దూరంగా ఎన్నో కట్టుబాట్లతో జీవనం సాగిస్తుంటారు. ఇప్పటి పరిస్థితుల్లో ఇల్లు కట్టాలంటే ఇంటి సామాగ్రి సిమెంట్, ఇనుము, ఇసుక వంటి వాటిని మైదాన ప్రాంతం నుంచి కొనుగోలు చేసి గ్రామాలకు తీసుకురావాల్సి ఉంటుంది. కానీ రోడ్డు సౌకర్యం లేకపోవడం వల్ల ఆ సామాగ్రి చేర్చడంలోనే అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. ఇప్పుడు సిమెంట్, ఇనుము కొనుగోలు ఖర్చుకంటే వాటినిగ్రామాలకు చేర్చడానికి అయ్యే రవాణా ఖర్చే ఎక్కువ అవుతుందని చెప్పవచ్చు. అల్లూరి జిల్లాలో రోడ్డు లేని పివిజిటి గ్రామాలు చాలానే ఉన్నాయి. రహదారి మార్గాలు లేకపోవడం వల్ల కొంత దూరం వరకు వాహనాల్లో తరలించి అక్కడ దించుకుని ఆ తర్వాత మనుషులు ఎత్తుకొని తీసుకెళ్లే పరిస్థితులు



కూడా అనేకం ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం ఇచ్చే (పిఎం జంజాతి) గృహాలు పివిజిటి నిరుపేద కుటుంబాలకు ఒక రకంగా అగ్ని పరీక్షగా మారుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం (పిఎం జంజాతి) గృహాల నిర్మాణానికి రెండు లక్షలముప్పై తొమ్మిదివేల రూపాయలు మంజూరు చేసింది. అయినప్పటికీ ఇల్లు కట్టుకోవడానికి సరైన సౌకర్యాలు లేకపోవడం వల్ల అప్పు తీసుకునే పరిస్థితిగా మారుతోంది. మొత్తంగా ఒక ఇల్లు పూర్తి చేయడానికి ఎనిమిది నుంచిపది లక్షల వరకు ఖర్చయ్యే అంచనా ఉంది. ప్రభుత్వం ఇచ్చే 2,39,000 సహాయం ఉన్నా, మిగిలిన మొత్తం సగటు కుటుంబంపై భారీ ఆర్థిక భారం అవుతోంది. అంటే సుమారుగా ఏడులక్షల అరవై ఒక వేల రూపాయలు సగటు కుటుంబానికి భారం పడుతుందని చెప్పడానికి సందేహం లేదు. సగటు కుటుంబం ఇంత ధనాన్ని వెచ్చించగలదా అనే ప్రశ్న సహజంగా వస్తుంది. ఉదాహరణకు అల్లూరి జిల్లాలోని జిమాడుగుల మండలం గడుతూరు పంచాయతీ బొడ్డు మామిడి గ్రామం మండల కేంద్రం నుంచి సుమారుగా అరవై కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ గ్రామానికి వెళ్లడానికి ఎటువంటి రోడ్డు సౌకర్యంలేదు. ఈ ఒక్క గ్రామంలో యాభై కుటుంబాలు నివసిస్తున్నారు. ఈ గ్రామంలో కొంతమందికి ఇప్పటికీ రేషన్ కార్డులు లేవు, మరి కొంత మందికి ఆధార్ కార్డులు లేవు. మరికొన్ని కుటుంబాలకు (ఎన్ఆర్ఇజిఎ) జాబ్ కార్డులు కూడా లేవు. అందులో ఈ కేంద్ర ప్రభుత్వం (పిఎం జంజాతి)పథకం ద్వారా కొంతమందికి మాత్రమే గృహాలు మంజూరు చేయటం జరిగింది. ఎందుకంటే జాబ్‌కార్డు ఈ పథక గృహాలకు ముఖ్యమైనదిగా అధికారులు నిర్ణయించినట్లు కనిపిస్తోంది. ఇలాంటి గ్రామాలు ఇంకా మరెన్నో మనకు పాడేరు జిల్లాలో కనిపిస్తాయి. ఇంకా గతంలో అల్లూరిజిల్లాలో పెద్దసంఖ్యలో(ఎన్ఆర్ఇజిఎ) జాబ్ కార్డులు తొలగింపుకు గురైన సందర్భాలున్నాయి. ఈ విషయమై గతంలో అల్లూరి జిల్లా కలెక్టర్‌కి వినతి పత్రం కూడా ఇవ్వడం జరిగింది. కానీ ఇప్పటికీ చాలా గ్రామాల్లో సమస్య అలాగే ఉంది. అందువల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అల్లూరి జిల్లాలోని గ్రామాలను అధికార యంత్రాంగం క్షేత్రస్థాయిలో సందర్శించి రోడ్లు, మంచినీరు, విద్యుత్, విద్య సదుపాయాలు కల్పించగలిగితేనే ఈపథకం నిజంగా ఉపయోగపడుతుంది. అంతేకాకుండా స్థానిక పాడేరు ఐటిడిఏ అధికారులు, జిల్లాకలెక్టర్ కార్యాలయం ఈవిషయంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. ముఖ్యంగా ఇల్లుకంటే ముందు దారిరావాలి. అప్పుడే ఆదివాసీల సొంత ఇంటి కల నిజంగా నెరవేరుతుంది. ●

# వృద్ధతల్లిదండ్రుల 'భద్రత'కు చట్టాల ఆసరా!

పద్మ పుత్ర మల్లికార్జున

తెలంగాణ రాష్ట్రంలో తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసే ప్రభుత్వ ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకునేలా కొత్త చట్టాన్ని తీసుకురావాలని ముఖ్యమంత్రి ప్రకటించడం సమాజంలో ఒక ముఖ్యమైన చర్చకు నాంది పలికింది. ఇది కేవలం పరిపాలనా నిర్ణయం మాత్రమేకాదు, మనసమాజం, కుటుంబ వ్యవస్థ, విలువలు ఎటు దారి తీస్తున్నాయనే ప్రశ్నను కూడా మన ముందుంచింది. తల్లిదండ్రులను చూసుకోవడం అనేది ఎప్పటి నుంచో మన సంస్కృతిలో సహజంగా వస్తున్న ధర్మం. కానీ నేటికాలంలో, ఆ ధర్మాన్ని గుర్తు చేయడానికి ప్రభుత్వం చట్టం చేయాల్సిన పరిస్థితి రావడం నిజంగా ఆలోచింపజేసే విషయం. ఈ ప్రతిపాదిత చట్టం ప్రకారం, తెలంగాణలో పనిచేస్తున్న ఏ ప్రభుత్వ ఉద్యోగి అయినా తన తల్లిదండ్రులను సరిగా చూసుకోకపోతే, అతని లేదా ఆమె జీతం నుండి 10నుండి 15శాతం వరకు కోత విధించి, ఆ మొత్తాన్ని నేరుగా తల్లిదండ్రుల బ్యాంకు ఖాతాలో జమ చేస్తారు. ఇది మాటల హెచ్చరిక కాదు, దీనిని చట్టబద్ధంగా అమలు చేయడానికి ప్రభుత్వం ఒక ప్రత్యేక కమిటీని కూడా ఏర్పాటు చేయబోతోంది. అంటే ఈ విషయం మీద ప్రభుత్వం ఎంత శ్రద్ధగా ఆలోచిస్తుందో దీని ద్వారా స్పష్టమవుతుంది. తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేయడం ఒక వ్యక్తిగత సమస్యగా కాకుండా, ఒక సామాజిక సమస్యగా ప్రభుత్వం గుర్తిస్తోంది. మన దేశంలో ఇప్పటికే వృద్ధతల్లిదండ్రుల హక్కుల పరిరక్షణ కోసం కేంద్రప్రభుత్వం 2007లో 'మెయింటెనెన్స్ ఆఫ్ పేరెంట్స్ అండ్ అదర్ సీనియర్ సిటిజన్స్ యాక్ట్' అనే చట్టాన్ని తీసుకువచ్చింది. ఈ చట్టం ప్రకారం, తల్లిదండ్రులు తమను తాము పోషించుకోలేని స్థితిలో ఉన్నప్పుడు, పిల్లలు వారికి ఆర్థిక సహాయం చేయాల్సిన బాధ్యత కలిగి ఉంటారు. అంతేకాకుండా, తల్లిదండ్రులు తమ పిల్లలు చూసుకుంటారనే నమ్మకంతో ఆస్తులను బదలాయించి, తర్వాత వారు నిర్లక్ష్యం చేస్తే, ఆ ఆస్తులను తిరిగి తమ పేరుపైకి తీసుకునే హక్కు కూడా ఈ చట్టం ఇస్తుంది. అయితే ఈ చట్టం అమలు కోసం వృద్ధులు కోర్టులు, ట్రిబ్యునల్స్ చుట్టూ తిరగాల్సివస్తోంది. ఇది చాలా మందికి మానసికంగా, శారీరకంగా కష్టమైన ప్రక్రియ. తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించిన కొత్త విధానం ఈ సమస్యకు ఒక భిన్నమైన పరిష్కారాన్ని చూపుతోంది. కోర్టులు, కేసులు, అలస్యం లేకుండా, నేరుగా ఉద్యోగి జీతం నుంచే డబ్బును తల్లిదండ్రులకు అందించడం ద్వారా వృద్ధులకు తక్షణ భద్రత కల్పించాలన్నది దీని లక్ష్యం. ఇది తల్లిదండ్రుల హక్కులను మరింత బలంగా పరిరక్షించే చర్యగా చూడవచ్చు. కానీ అదే సమయంలో, ఇది వ్యక్తిగత జీవితాల్లో ప్రభుత్వ జోక్యాన్ని ఎంతవరకు అనుమతించాలి అన్న ప్రశ్నను కూడా లేవనెత్తుతుంది. ఒక కుటుంబంలో జరిగే వివాదాలను, సంబంధాలను నేరుగా ప్రభుత్వం నియంత్రించడం సరైందా అనే చర్చ తప్పనిసరిగా జరుగుతుంది. భారతదేశంలో వృద్ధుల సంక్షేమం విషయంలో కేరళరాష్ట్రం ఒకఅడుగు ముందుకు వేసింది. 'స్టేట్ ఎల్డరీ కమిషన్ యాక్ట్ 2025' ద్వారా కేరళలో ఒక ప్రత్యేకమైన చట్టబద్ధమైన కమిషన్ను



ఏర్పాటు చేశారు. ఈ కమిషన్ వృద్ధుల హక్కులు, సంక్షేమం, సమస్యలపై ప్రత్యేకంగా పనిచేస్తుంది. భారతదేశంలో వృద్ధుల కోసం ఇలాంటి సంస్థను ఏర్పాటు చేయడం ఇదే మొదటిసారి. ఇది వృద్ధుల సమస్యలను ప్రభుత్వం ఎంత ప్రాధాన్యతతో చూస్తుందో చెప్పే ఉదాహరణ. అంతర్జాతీయంగా కూడా అనేక దేశాలు తల్లిదండ్రుల సంరక్షణపై చట్టాలు తీసుకొచ్చాయి. సింగపూర్లో 'మెయింటెనెన్స్ ఆఫ్ పేరెంట్స్ యాక్ట్' ఉంది. ఈ చట్టం ప్రకారం, 60 ఏళ్లు దాటిన తల్లిదండ్రులు తమను తాము పోషించుకోలేని స్థితిలో ఉంటే, వారి పిల్లలు వారికి ఆర్థిక సహాయం చేయాల్సిందే. అదే విధంగా చైనాలో 'ప్రొటెక్షన్ ఆఫ్ రైట్స్ అండ్ ఇంట్రెస్ట్ ఆఫ్ ఎల్డర్ పీపుల్' అనే చట్టం ఉంది. దీనిలో తల్లిదండ్రులకు ఆహారం, నివాసం, వైద్యం వంటి అవసరాలను పిల్లలు అందించాల్సిన బాధ్యతను స్పష్టంగా పేర్కొన్నారు. అంటే ఈ సమస్య భారతదేశానికే పరిమితం కాదు, ప్రపంచవ్యాప్తంగా వృద్ధుల నిర్లక్ష్యం ఒక పెద్ద సమస్యగా మారుతోంది. మన భారతీయ సంస్కృతిలో తల్లిదండ్రులను దైవంతో సమానంగా భావిస్తాం. 'మాతృ దేవోభవ, పితృ దేవో భవ' అన్న మాటలు మన చిన్నప్పటి నుంచే మన చెవుల్లో నినదిస్తాయి. శ్రవణ కుమారుడి కథ మనకు తల్లిదండ్రుల పట్ల చూపాల్సిన భక్తి, సేవ ఎంత గొప్పదో గుర్తు చేస్తుంది. తన అంధులైన తల్లిదండ్రులను కావడిలో పెట్టుకుని తీర్థయాత్రకు తీసుకెళ్లిన శ్రవణ కుమారుడు, తన ప్రాణాలు పోయే క్షణంలో కూడా తల్లిదండ్రుల దాహం గురించి మాత్రమే ఆలోచించాడు. అలాంటి కథలు మన సంస్కృతిలో తల్లిదండ్రుల సేవ ఎంతపవిత్రమోచెబుతాయి. కానీ నేటి సమాజంలో పరిస్థితి చాలా మారిపోయింది. పట్టణీకరణ, ఉద్యోగాల కోసం వలసలు, ఆర్థిక ఒత్తిళ్లు ఇవన్నీ కలిసి కుటుంబసంబంధాలను బలహీనపరుస్తున్నాయి. చాలా మంది యువత తమ సొంత పిల్లల భవిష్యత్తు గురించి ఎంతగా ఆలోచిస్తారో, తమ తల్లిదండ్రుల వృద్ధాప్యంగురించి అంతగా అలోచించడం లేదు. కొందరు పిల్లలు తల్లిదండ్రులను తమ జీవితంలో ఒక భారంగా చూడడం బాధాకరం. ఆహారం, మందులు, వైద్యసేవలు వంటి కనీస అవసరాలు కూడా ఇవ్వడానికి ఇష్టపడని సందర్భాలు మన చుట్టూ కనిపిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో తెలంగాణ ప్రభుత్వం తీసుకురాబోయే చట్టం ఒక హెచ్చరికలా కూడా పనిచేయవచ్చు. తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తే, కేవలం నైతికంగా తప్పు చేయడమే కాకుండా, ఆర్థికంగా కూడా దాని ఫలితాలుఉంటాయని ఇది చెప్తుతుంది. ఇది కొంతమందిలో అయినామార్పు తీసుకువచ్చే అవకాశం ఉంది. కనీసం తల్లిదండ్రులకు ఒక స్థిరమైన ఆదాయ మార్గంఏర్పడుతుంది. వారు తమ పిల్లల దయాదాక్షిణ్యాల మీద పూర్తిగా ఆధారపడాల్సిన అవసరం తగ్గుతుంది. అయితే ఈచట్టాన్ని అమలు చేసే సమయంలో చాలా జాగ్రత్త అవసరం. ప్రతి కుటుంబ సమస్య ఒకేలా ఉండదు. కొన్ని సందర్భాల్లో తల్లిదండ్రులే పిల్లలను వేధించే పరిస్థితులు కూడా ఉంటాయి. కొన్ని సందర్భాల్లో పిల్లలు నిజంగా ఆర్థికంగా ఇబ్బందుల్లోఉండవచ్చు. కాబట్టి ఈ చట్టం గుడ్డిగా అమలవ్వకుండా, ప్రతి కేసును సున్నితంగా పరిశీలించే వ్యవస్థ అవసరం. అందుకే కమిటీ ఏర్పాటు చేయడం చాలా ముఖ్యమైన విషయం. సరైన మార్గదర్శకాలు, రక్షణలు లేకపోతే, ఈ చట్టం కొత్త అన్యాయాలకు కూడా దారి తీసే ప్రమాదంఉంది. తల్లిదండ్రులను చూసుకోవడం చట్టం వల్ల కాదు, మన మనసువల్ల జరగాలి. కానీ మన మనసు మారకపోతే, సమాజాన్ని కాపాడటానికి చట్టాలు రావాలి. ఒక మొక్కమనకు నీడను, పండ్లను ఇస్తుంది. కానీ ఆమొక్క వేర్లుఎండిపోతే, చెట్టుమొత్తం కూలిపోతుంది. అలాగే మనల్ని పెంచి పెద్దచేసిన తల్లిదండ్రులు మన జీవితానికి వేర్లులాంటి వారు. వారి ని నిర్లక్ష్యంచేస్తే, మన జీవితానికి కూడా పునాది ఉండదు. కాబట్టి తెలంగాణ ప్రభుత్వం తీసుకురాబోయే ఈ చట్టం మనందరికీ ఒక సం దేశంఇస్తోంది. తల్లిదండ్రులను చూసు కోవడం మనపై ఎవరో మోపిన బాధ్యతకాదు, అది మనఅస్తిత్వానికి మూలం. ఇప్పటికైనా మనం మన విలువలను గుర్తుచేసుకొని, తల్లిదండ్రు లను గౌరవించి, వారికి అవసరమైన భద్రతను అందించాలి. ●

# ప్రజావాక్కు



## ప్రతిభకు తూకం

రెండువేల ఇరవైఆరు రిపబ్లిక్ దినోత్సవం సందర్భంగా పద్మ అవార్డులను పలువురు ప్రముఖులకు ప్రదానం చేయబడింది. గతంలో సినీ ప్రపంచంలో అందనంత ఎత్తుకుఎదిగిన మహానటులైన ఎన్.టి.రామారావు, ఎస్.వి. రంగారావులకు కేవలం పద్మశ్రీ అవార్డులతో సరిపెట్టేసారు. మహానటి సావిత్రి, సినీ సీత అంజలీదేవిలను ఏప్రభుత్వ అవార్డులు వరించలేదు. కాని వారి నటనానైపుణ్యం తెలుగు సినీపరిశ్రమలో నిఘంటువులా నిలచిపోగలదనేది అక్షర సత్యం. ప్రతిభను ఏ కొలమానంతో తూకం వేస్తున్నారో అవార్డుల కమిటీ వారికే తెలియాలి..

- ఎన్.రామలక్ష్మి, సికింద్రాబాద్

## గవర్నర్లు ఆలోచించాలి

మళ్ళీఒకసారి తమిళనాడుఉదంతంతో గవర్నర్‌ల పాత్రపై మరొకసారి గందరగోళం నెలకొంది. నిజానికి కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రం, రాష్ట్రాలలో ఉన్నప్పుడు ఎటువంటి గందర గోళం లేదు. ఎప్పుడయితే ప్రాంతీయ పార్టీలు అధికారంలోకి వచ్చాయో అప్పటి నుండి ఈ గందరగోళం నెలకొంది. ఇకపోతే ఈదశాబ్దకాలంలో కేరళలో, ఢిల్లీలో, తమిళనాడు, పశ్చిమబెంగాల్, రాష్ట్రాలలో నెలకొన్న పరిస్థితులు ఏమి రుజువుచేస్తున్నాయి. ప్రతిపక్షం అధికారంలో ఉన్న రాష్ట్రాలలో పాలక పక్షం తమ అభిష్టాలు నెరవేర్చే సాధనంగా గవర్నర్‌ల పాత్ర ఉండడం విచారం. అలాఅని అందరూ అలా ప్రవర్తించడంలేదు. కేరళలాంటి రాష్ట్రాలు గవర్నర్‌గురించి సుప్రీంకోర్టుకువెళ్లడంకూడా చూస్తున్నాం. బీజేపీలాంటి పార్టీలు మార్గదర్శక మండలిపేరుతో సలహా సంఘాన్ని ఫామ్ చేసి అందులోని వాళ్లకు గవర్నర్‌గిరి ఇస్తున్నారు. ఇది సుప్రీం కోర్టు ఆదేశాలకు విరుద్ధం.

- భారత అవినాష్, జనగామ

## ఎస్సీ,ఎస్టీలకు న్యాయం చేయాలి

తెలంగాణ రాష్ట్రంలోని మండల కేంద్రాలలో భూముల విలువ ధరలు పెరగడంతో ఎస్సీ, ఎస్టీల ఇండ్ల స్థలాలు అగ్రవర్ణాలు ఆక్రమించుకోవడం అక్రమ నిర్మాణాలు చేయడం జరిగింది. ఇట్టి విషయమై భూమిని కోల్పోయిన వారు భూ కబ్జాదారులపై పోలీసులకు ఫిర్యాదు చేసి 3 సంవత్సరాలు దాటుతున్నా కూడా న్యాయం జరగడం లేదు. అక్రమ నిర్మాణాలు తొలగించడం లేదు.

- రాపాక రవీందర్, జనగాం

## ఫీజులను పెంచడం సమర్ధనీయంకాదు

దేశంలో ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో చదువుతున్న తమ పిల్లల ట్యూషన్‌ఫీజులు, ఇతరఖర్చులు నిరంతరం పెరుగుతుండటం మధ్యతరగతి తల్లిదండ్రుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. కుటుంబ బడ్జెట్‌ను నిర్వహించడం కష్టతరమైనప్పటికీ, తమ పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాలనే ఉద్దేశంతో తల్లిదండ్రులు ఈ కష్టాలను భరిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రైవేటు పాఠశాలల ట్యూషన్ ఫీజులపెంపుపై రెండేళ్లకుఒకసారి గరిష్ఠంగా ఎనిమిది శాతం పరిమితిని విధించాలని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ప్రతిపాదించడం ఆహ్వానించదగ్గ పరిణామం. ఇది మధ్యతరగతి కుటుంబాలకు కొంత ఉపశమనాన్ని కలిగిస్తుంది. అయితే ప్రభుత్వపాఠశాలల మాదిరిగా ప్రైవేటు విద్యాసంస్థలకు ఏటా ప్రభుత్వ బడ్జెట్ కేటాయింపులు ఉండవు.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## రైతులకు పరిహారం చెల్లించాలి

రాయలసీమ పెన్నా ఎత్తిపోతల పథకం పనులకు దశాబ్దాల నుండి కృష్ణ జలాలు అందే సమయం ఇప్పుడువచ్చింది. నీటి నిల్వల సామర్థ్యం లేక ఆగిపోయింది. అప్పటి మంత్రి వర్ధంతి రోజున ఇప్పుడు ప్రారంభమై పేదల ఆకలి తీర్చే అవకాశం యాధృచ్ఛికంగా జరిగింది. అదే మనిషికిప్రధానం. దాని ప్రాధాన్యత గుర్తించి కృషి చేయడం ప్రభుత్వ ఘనతే. భూములిచ్చిన రైతులకు పరిహారం చెల్లింపు హామీతో వారికి సమస్యలేదు. మనకు సుఖాలు, ఆనందం వచ్చే వాటి కన్నా ఇది ముందు అత్యవసరమని మనం కూడా తెలుసుకోవడం విజ్ఞత. వాటి కోసం ప్రభుత్వనేతల చొరవ, అధికారుల జాప్యంలేని పనితీరు ప్రజలు మరువలేరు. ఆ రీతిలోనే కుటుంబానికి కూడు పెట్టే అంశాలు ముందు ప్రాధాన్యత గొప్పవి కూడా.

- బొల్లోజు మేఘనాదం విశాఖపట్నం

## శబ్దకాలుష్యాన్ని నియంత్రించాలి

భారత్ క్రికెట్‌జట్టు మ్యాచ్ గెలిచినా, పెళ్లివేడుకలు, ఇతర కార్యక్రమాలు ఏవైనా నిర్వహించినా ఆ హాపినెస్‌ని పరస్పరం అభినందనలు తెలుపుకోవటంతోను మిఠాయిలు పంచుకోవటంతోను ఆపేయాలి. లేదా చిచ్చుబుడ్లు, చక్రాలు, కాకరపువ్వొత్తులు, మతాబులతోను సరిపెట్టుకోవాలి. అంతేకానివృద్ధులు, రోగులు, మహిళలు, పసిపిల్లలు నిద్రించే సమయంలో పెద్ద శబ్దాలు వచ్చే బాంబులు, సీమటపాకాయలు పేల్చటం సరికాదు. చాలా ఇప్పుడే అదే చేస్తూ ఇతరులను ఇబ్బందిపెడుతున్నారు.

-ఎమ్.శాస్త్రి, హైదరాబాద్

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# యాసిడ్ దాడి నిందితుల ఆస్తులు జప్తు



### మరింత కఠిన చర్యలు తీసుకోవాలి
### సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టీకరణ
### రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు ఆదేశం
### విచారణ నాలుగు వారాలకు వాయిదా

**న్యూఢిల్లీ, జనవరి 27:** దేశవ్యాప్తంగా యాసిడ్ దాడి కేసులు పెండింగ్‌లో ఉండటంపై సుప్రీం కోర్టు మంగళవారం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. బాధితులకు పరిహారం అందించడానికి దోషుల ఆస్తులను అటాచ్ చేయడంతో సహా మరింత కఠినమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం, సుప్రీం కోర్టు గతంలో నిర్దేశించిన మార్గదర్శకాలను అమలు చేయాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని విచారిస్తూ, 15 హైకోర్టులు ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న యాసిడ్ దాడి కేసుల వివరాలను అందించాయని పేర్కొన్న విషయాన్ని గమనించింది. సుప్రీం కోర్టు ముందు ఉంచిన స్థితి నివేదిక ప్రకారం, ఉత్తరప్రదేశ్‌లో మాత్రమే 198 పెండింగ్ కేసులు, గుజరాత్‌లో 114, పశ్చిమబెంగాల్‌లో 60, బీహార్‌లో 68, మహారాష్ట్రలో 58 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. సిజెఐ కాంత్ నేతృత్వంలోని ధర్మాసనం తన ఉత్తర్వులో, మిగిలిన హైకోర్టుల నుండి నివేదికలు ఇంకా ఎదురుచూస్తున్నాయని పేర్కొంది. 'యాసిడ్ దాడులకు సంబంధించిన కేసులను త్వరితగతిన పరిష్కరించడానికి నిర్ణయం తీసుకోవాలని తాము హైకోర్టులను అభ్యర్థిస్తున్నాము' అని సుప్రీంకోర్టు పేర్కొంది. విచారణ సందర్భంగా, సిజెఐ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం యాసిడ్ దాడుల నిరోధించడానికి కఠినమైన శిక్షా చర్యల ఆవశ్యకతపై కీలక వ్యాఖ్యలు చేసింది. 'నిందితుల ఆస్తులను ఎందుకు అటాచ్ చేయకూడదు? ఒక వ్యక్తి యాసిడ్ దాడిలో దోషిగా తేలితే, అతని అన్ని స్థిరాస్తులను ఎందుకు సంపాదించి బాధితుడికి పరిహారం చెల్లించకూడదు? మీరు కొన్ని అసాధారణమైన శిక్షా చర్యలు తీసుకోవాలి. చర్య అంత బాధాకరమైనది కాకపోతే, ఇక్కడ నిరోధక సిద్ధాంతాన్ని అనుసరించాలి' అని సుప్రీంకోర్టు పేర్కొంది. యాసిడ్ దాడుల సంవత్సరాల వారీగా జరిగిన సంఘటనలు, ఛార్జిషీట్ల దాఖలు, నిర్ణయించిన కేసుల సంఖ్య, విచారణ దశలో పెండింగ్, ముగిసిన విచారణల నుండి ఉత్పన్నమయ్యే అప్పీళ్లతో సహా నాలుగు వారాల్లోపు సమగ్ర డేటాను తన ముందు ఉంచాలని కూడా అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను ఆదేశించింది. యాసిడ్ దాడి బాధితుడి విద్యా అర్హతలు, ప్రస్తుత ఉద్యోగ స్థితి, వైవాహిక స్థితి, వైద్య చికిత్స వివరాలు, చికిత్స, పునరావాసం కోసం ప్రభుత్వం చేసిన లేదా ప్రతిపాదించిన ఖర్చులతో సహా ప్రతి యాసిడ్ దాడి బాధితుడి సంక్షిప్త వివరాలను రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు తప్పనిసరిగా అందించాలని సుప్రీం కోర్టు పేర్కొంది. యాసిడ్ దాడి బాధితులకు పునరావాసం, పరిహారం, వైద్య సహాయం కోసం అమలు చేయబడిన పథకాల వివరాలను సమర్పించాలని అన్ని రాష్ట్ర న్యాయ సేవల అధికారులను ఆదేశించింది. యాసిడ్ దాడి కేసులను పరిష్కరించే చట్టపరమైన చట్రాన్ని బలోపేతం చేయడానికి కేంద్ర ప్రభుత్వం శాసన జోక్యాన్ని పరిగణించాలని సిజెఐ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం మౌఖికంగా సూచించింది.



## పాక్ నుంచి భారత్‌లోకి భారీగా నకిలీ కరెన్సీ
### ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలపై డీ కంపెనీ నజర్

**న్యూఢిల్లీ,జనవరి 27:** భారత్‌లో ఈ ఏడాది వరుసగా జరగనున్న అసెంబ్లీ ఎన్నికలను లక్ష్యంగా చేసుకుని, పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న దావూద్ ఇబ్రహీం సిండికేట్ భారీ కుట్రలు ప్రారంభించింది. కోట్లాదిరూపాయల విలువైన నకిలీ కరెన్సీని దేశంలోకి చొప్పించేందుకు సిద్ధమవుతోందని భారత నిఘా వర్గాలు తీవ్ర హెచ్చరికలు జారీ చేశాయి. దీంతో సరిహద్దు రాష్ట్రాల్లో భద్రతా ఏజెన్సీలు అప్రమత్తమయ్యాయి. నిఘా వర్గాల సమాచారం ప్రకారం, పాకిస్థాన్‌లో భారీ ఎత్తున నకిలీ భారత కరెన్సీ నోట్లను ముద్రించి, వాటిని బంగ్లాదేశ్, నేపాల్ దేశాలకు తరలిస్తున్నారు. అక్కడి నుంచి భారత్‌లోకి అక్రమంగా రవాణా చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ముఖ్యంగా పశ్చిమ బెంగాల్‌లోని మాల్దా ప్రాంతం నకిలీ నోట్ల రవాణాకు ప్రధాన కేంద్రంగా మారినట్లు ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ) అధికారులు గుర్తించారు. బంగ్లాదేశ్ నుంచి పెద్ద మొత్తంలో నకిలీ కరెన్సీ మాల్దాకు చేరనుందని, అందుకు స్థానిక నెట్‌వర్క్ సన్నాహాలు చేసుకుంటోందని సమాచారం అందింది. ఈ నకిలీ నోట్లను అత్యంత నాణ్యతతో, అత్యాధునిక యంత్రాలపై ముద్రిస్తున్నారని ఫోరెన్సిక్ నిపుణులు చెబుతున్నారు. అసలు నోట్లలో ఉండే వాటర్‌మార్క్‌ను సైతం పక్కాగా రూపొందిస్తుండటంతో, వీటిని గుర్తించడం దాదాపు అసాధ్యమని వారు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వ ఆధీనంలో ఉండే కరెన్సీ ప్రింటింగ్ యంత్రాల ద్వారానే వీటిని ముద్రిస్తున్నట్లు ఏజెన్సీలు బలంగా అనుమానిస్తున్నాయి. బంగ్లాదేశ్ ప్రభుత్వం ఇస్లామాబాద్ పట్ల ఇటీవల అనుసరిస్తున్న మెతక వైఖరితో, పాకిస్థాన్ నుంచి బంగ్లాదేశ్‌కు సముద్ర మార్గం ద్వారా నకిలీ నోట్ల రవాణా సులువుగా మారింది. ఇదే మార్గంలో ఆయుధాలు కూడా చేరుతున్నాయని ఏజెన్సీలు అనుమానిస్తున్నాయి. అసోం, పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి రాష్ట్రాల్లో మార్చి నుంచి మే మధ్య ఎన్నికలు జరగనున్నాయి. ఈ సమయంలో భద్రతా సిబ్బంది ఎన్నికల విధుల్లో నిమగ్నమై ఉంటారు. ఇదే అదనుగా భావించి, నకిలీ నోట్లను సులభంగా చెలామణి చేయాలని డీ కంపెనీ ప్లాన్ చేస్తోంది. ఈ నేపథ్యంలో సరిహద్దు ప్రాంతాల్లో, ముఖ్యంగా మాల్దా పరిసరాల్లో నిఘాను తీవ్రతరం చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఈ కరెన్సీ ఒక్కసారి దేశంలోకి ప్రవేశిస్తే అడ్డుకోవడం కష్టమని, అందుకే సరిహద్దుల్లోనే దీన్ని నిరోధించడం కీలకమని వారు పేర్కొన్నారు.

## రైలు జాప్యానికి విద్యార్థినికి రూ.9 లక్షల పరిహారం
### కోర్టు ఖర్చులుగా రూ.12 వేలు చెల్లించాలని ఆదేశం

**బస్తీ(యుపి),జనవరి 27:** రైలు ఆలస్యంతో ఓ విద్యార్థి భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపిన కేసులో న్యాయస్థానం తాజాగా కీలక తీర్పు వెలువరించింది. ఆవిద్యార్థినికి రైల్వే శాఖ నుంచి రూ.9లక్షల పరిహారం చెల్లించాలని వినియోగదారుల ఫోరమ్ భారతీయ రైల్వేను ఆదేశించింది. ఉత్తరప్రదేశ్ బస్తీ జిల్లాకు చెందిన సమృద్ధి అనే విద్యార్థిని 2018లో బీఎస్సీ బయోటెక్నాలజీ ప్రవేశ పరీక్ష రాయాల్సి ఉంది. పరీక్షకు లక్నోలోని జై నారాయణ్ పీజీ కళాశాల సెంటర్ పడింది. దీంతో పరీక్షా కేంద్రానికి చేరుకోవడానికి ఆమె ఇంటర్‌సిటీ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కింది. కానీ, ఆ రైలు నిర్ణీత సమయం కంటే రెండున్నర గంటలు ఆలస్యంగా చేరుకుంది. దీంతో సమృద్ధి టైమ్‌కి పరీక్షా కేంద్రానికి చేరుకోలేకపోయింది. ఫలితంగా ఆమె ఓ అకాడమిక్ ఇయర్‌ను కోల్పోవాల్సి వచ్చింది. దీంతో తీవ్ర మనోవేదనకు గురైన విద్యార్థిని రైల్వే శాఖపై న్యాయపోరాటానికి దిగింది. జిల్లా వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించింది. దాదాపు ఏడు సంవత్సరాలు జరిగిన న్యాయ పోరాటం తర్వాత కమిషన్ ఆమెకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. ఈ లోపాలకు రైల్వే శాఖే బాధ్యత వహించాలని తీర్పు చెప్పింది.




విద్యార్థిని కోల్పోయిన విద్యా సంవత్సరానికిగానూ పరిహారంగా రూ.9లక్షలు, కేసు ఖర్చుల నిమిత్తం రూ.12వేలు చెల్లించాలని రైల్వే శాఖను వినియోగదారుల కోర్టు ఆదేశించింది. ఈ మొత్తాన్ని 45 రోజుల్లో చెల్లించాలని స్పష్టం చేసింది.



## సిగరెట్ లైటర్ కోసం ఘర్షణ
# ఒకరు మృతి

**కోలార్, జనవరి 27:** సిగరెట్ లైటర్ కోసం ఇద్దరు స్నేహితుల మధ్య జరిగిన ఘర్షణ ఒకరి ప్రాణాన్ని బలితీసుకుంది. మరొకరి నాలుక తెగి, తీవ్ర గాయాలు కావడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కర్ణాటక రాష్ట్రంలోని కోలార్ జిల్లా కమ్మసంద్రలో ఈ దారుణ ఘటన జరిగింది. కర్ణాటకలోని కమ్మసంద్రలో క్రికెట్ పోటీలకు ఇద్దరు స్నేహితులు ప్రశాంత్ (35), రోషన్ హెగ్డే వెళ్లారు. మ్యాచ్ ముగిసిన తర్వాత ఇద్దరు మద్యం సేవించారు. ఈ క్రమంలో స్నేహితులు ఇద్దరి మధ్య సిగరెట్ లైటర్ విషయంలో గొడవ జరిగింది. ఈ గొడవ ముదరడంతో బీర్ బాటిళ్లతో ఒకరిపై మరొకరు దాడి చేసుకున్నారు. ఈ ఘటనలో రోషన్ హెగ్డే నాలుకకు తీవ్రగాయమైంది. తీవ్ర గాయాలు కావడంతో భయపడిపోయిన రోషన్ తన కారులో అక్కడి నుంచి పారిపోవడానికి ప్రయత్నించాడు. కానీ ప్రశాంత్ అతన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించాడు. కారు డోర్ పట్టుకుని అడ్డగించేందుకు చూశాడు. దీంతో ప్రశాంత్‌ను అలాగే కారుతో ఈడ్చుకెళ్లి వేగంగా చెట్టును ఢీకొట్టాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ప్రశాంత్‌ను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందాడు. ప్రశాంత్ మృతికి కారణమైన రోషన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రోషన్ నాలుక తెగిపోవడంతో పాటు తీవ్ర గాయాలు కావడంతో ప్రైవేటు ఆస్పత్రిలో అతనికి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘర్షణకు సంబంధించిన దృశ్యాలు కారు డ్యాష్‌బోర్డు కెమెరాలో రికార్డయ్యాయి.

## కేంద్ర ప్రభుత్వరంగ ఉద్యోగులకు గ్రాట్యుటీ రూ.20 లక్షల పరిమితి

**న్యూఢిల్లీ, జనవరి 27:** కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగుల గ్రాట్యుటీ చెల్లింపులకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన, ఏకరూప మార్గదర్శకాలను జారీ చేసింది. గ్రాట్యుటీ అర్హత, చెల్లింపు కాలపరిమితులు, రూ. 20 లక్షల గరిష్ఠ పరిమితి ఎప్పటి నుంచి వర్తిస్తుందన్న గందరగోళంపై కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిధిలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ (డిపిఇ) ఒక ఆఫీస్ మెమోరాండం విడుదల చేసింది. గ్రాట్యుటీ చెల్లింపుల చట్టం 1972కు చేసిన సవరణల నేపథ్యంలో 2017, 2018లో జారీ చేసిన పలు సూచనలను, వివరణలను క్రోడీకరించి ఈ తాజా మార్గదర్శకాలను రూపొందించినట్లు డీపీఈ తెలిపింది. సీపీఎస్‌ఈలలో పనిచేస్తున్న ఎగ్జిక్యూటివ్‌లు, నాన్‌ఎగ్జిక్యూటివ్‌లు సహా అందరు ఉద్యోగులకు ఈ నిబంధనలు వర్తిస్తాయని పేర్కొంది. గ్రాట్యుటీ చెల్లింపు చట్టం1972కు 2018లో సవరణలు చేసి, గ్రాట్యుటీ గరిష్ఠ పరిమితిని రూ. 10 లక్షల నుంచి రూ. 20 లక్షలకు పెంచుతూ కేంద్ర కార్మిక మరియు ఉపాధి మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ సవరించిన నిబంధనలు 2018 మార్చి 29 నుంచి అమల్లోకి వచ్చాయి. దీని ప్రకారం 2018 మార్చి 29 లేదా ఆ తర్వాత ఉద్యోగ విరమణ చేసిన లేదా గ్రాట్యుటీకి అర్హులైన సీపీఎస్‌ఈ ఉద్యోగులందరికీ రూ. 20 లక్షల గరిష్ఠ పరిమితి వర్తిస్తుంది. ఇది చట్టబద్ధమైన నిబంధన కాబట్టి, సంస్థల ఆర్థిక పరిస్థితితో సంబంధం లేకుండా ఈ మొత్తాన్ని




తప్పనిసరిగా చెల్లించాలని డీపీఈ తన మెమో రాండంలో స్పష్టం చేసింది. 2017 జనవరి 1 నుంచి 2018 మార్చి 28 మధ్య కాలానికి సంబంధించిన గ్రాట్యుటీ చెల్లింపులు ఆయా సంస్థల ఆర్థిక స్తోమతపై ఆధారపడి ఉంటాయని కేంద్రం స్పష్టం చేసింది. 2017లో జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం ఈ కాలంలో ఐడీఏ పే స్కేల్‌లో వేతన సవరణ పొందిన ఎగ్జిక్యూటివ్‌లు, నాన్‌యూనియనైజ్డ్ సూపర్‌వైజర్లకు వారి సంస్థ ఆర్థిక భారాన్ని మోయగలదా అనే అంశాన్ని బట్టి గ్రాట్యుటీ చెల్లింపులు జరపడానికి అనుమతించారు. సీపీఎస్‌ఈ ఉద్యోగులలో తరచూ తలెత్తే ఒక ముఖ్యమైన అనుమానాన్ని కూడా డీపీఈ నివృత్తి చేసింది. 7వ కేంద్ర వేతన సంఘం సిఫార్సుల మేరకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు గ్రాట్యుటీ పరిమితిని 2016 జనవరి 1 నుంచి రూ. 10 లక్షలనుంచి రూ.20లక్షలకు పెంచారు. అయితే, ఈ పెంపు సీపీఎస్‌ఈ ఉద్యోగులకు వర్తించదని కేంద్రం తేల్చిచెప్పింది. సీపీఎస్‌ఈ ఉద్యోగులు ఈ ప్రయోజనాన్ని 2016జనవరి 1నుంచి క్లెయిమ్ చేసుకోవడానికి వీలులేదని స్పష్టం చేసింది. ఈ ఏకీకృత మార్గదర్శకాలను అన్ని సీపీఎస్‌ఈలు కచ్చితంగా పాటించేలా చూడాలని, వాటి పరిధిలోని సంస్థలకు ఈ సమాచారాన్ని చేరవేయాలని అన్ని పరిపాలనా మంత్రిత్వ శాఖలను, విభాగాలను డీపీఈ ఆదేశించింది.

### ఫుట్‌బాల్ మైదానంలో మాఫియా కాల్పులు..
## 11 మంది మృతి , 20 మందికిపైగా గాయాలు



**మెక్సికోసిటీ, జనవరి 27:** మెక్సికోలోని ఫుట్‌బాల్ మైదానంలో దుండగులు తుపాకులతో విచక్షణా రహితంగా కాల్పులు జరిపారు. ఈ ఘటనలో 11 మంది మృతిచెందారు. 20 మందికి పైగా గాయపడ్డారు. మృతుల్లో ఒక మహిళ, చిన్నారి ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. మెక్సికోలోని గ్వానాహువాటో రాష్ట్రం సలమంకా నగరంలో ముందురోజు రాత్రి ఈ ఘటన జరిగింది. సాకర్ మ్యాచ్ పూర్తయిన తర్వాత పలువురు అభిమానులు మైదానంలోనే ఉన్నారు. అదే సమయంలో అక్కడకు వచ్చిన పలువురు దుండగులు కాల్పులకు దిగారు. దాదాపు 100 రౌండ్ల కాల్పులు జరిపినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ ఘటన వెనుక గల కారణాలు మాత్రం తెలియరాలేదు. అయితే ఈ ఘటన వెనునక ఆర్గనైజ్డ్ క్రైమ్ గ్యాంగ్ ఉందని సలమంకా మేయర్ సీజర్ ప్రిటో తెలిపారు. శాంతి భద్రతలను అదుపులోకి తీసుకొచ్చేందుకు మెక్సికో ప్రభుత్వం సహకరించాలని కోరారు. అధికారులను లొంగదీసుకునేందుకు క్రైమ్ గ్యాంగ్‌లు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారని పేర్కొన్నారు. గ్వానహువాటోలో చమురు దోపిడీ, డ్రగ్స్ ట్రాఫికింగ్‌కు సంబంధించిన గ్యాంగ్‌ల మధ్య కొంతకాలంగా ఆధిపత్య పోరు నడుస్తోంది. ముఖ్యంగా జాలిస్కో న్యూ జనరేషన్ కార్టెల్, శాంటారోసా డి లామా కార్టెల్ గ్యాంగ్‌ల మధ్య గొడవలు నడుస్తున్నాయి. తాజాగా సాకర్ గ్రౌండ్‌లో జరిగిన కాల్పులు కూడా ఈ రెండు గ్యాంగ్‌ల మధ్య వార్‌గానే అనుమానిస్తున్నారు.

## బంగ్లాదేశ్‌లో హిందుమైనార్టీ హంతకుల రక్షణకోసం ప్రత్యేక ఆర్డినెన్స్

**ఢాకా, జనవరి 27:** బంగ్లాదేశ్‌లో హిందూ మైనా రిటీలపై దాడులు పెరిగిపోతుంటే వాటిని అడ్డుకోవాల్సిన యూనస్ సర్కారు ప్రభుత్వం నిందితులకు అండగా నిలుస్తోంది. హంతకులు, ఆందోళనకారులకు రక్షణ కల్పించే చర్యలు ప్రారంభించింది. ఇందుకోసం ప్రత్యేక ఆర్డినెన్స్ జారీ చేసింది. ప్రస్తుతం బంగ్లాదేశ్‌లో షేక్ హాసీనా తర్వాత ముహమ్మద్ యూనస్ ఆధ్వర్యంలో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడిన సంగతి తెలిసిందే. ఈ ప్రభుత్వం ఏర్పాటయ్యాక అక్కడ ఆందోళనలు ఎక్కువయ్యాయి. పోలీసులు, భద్రతా బలగాలతోపాటు హిందువులపై, రాజకీయ ప్రత్యర్థులపై ఆందోళనకారులు దాడులు, హత్యలు చేశారు. గత ఏడాది జులై ఆగష్టు సమయంలో ఈ దాడులు ఎక్కువగా జరిగాయి. ఈ ఘటనల్లో పోలీసులతోపాటు హిందువులు, ఇతర పౌరులు మరణించారు. పలు ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులు భారీగా ధ్వంసమయ్యాయి. ఈ



ఘటనల్లో నిందితులపై చర్యలు తీసుకోవాల్సిన యూనస్ ప్రభుత్వం ఇప్పుడు వారికి అండగా నిలిచింది. వారిపై కఠిన చర్యలు తీసుకోకుండా ప్రత్యేక ఆర్డినెన్స్ జారీ చేసింది. ప్రొటెక్షన్ అండ్ లయబిలిటీ డిటర్మినేషన్ ఆర్డినెన్స్ 2026ను ఆదివారం అర్ధరాత్రి జారీ చేసింది. ఈ ఘటనల్లో నిందితులకు రక్షణ లభిస్తుంది, వారిపై కఠిన చర్యలు తీసుకోవడానికి వీల్లేదు. నిందితులపై ఇప్పటివరకు నమోదైన సివిల్, క్రిమినల్ కేసుల్ని రద్దు చేస్తారు. కొత్త కేసులు నమోదు చేయడానికి వీల్లేదు. జులై, ఆగష్టులో పోలీసులు, హిందువులు, మైనారిటీలు, అవామీ లీగ్ సభ్యుల్ని చంపిన వారిపై చర్యలుండవు. ఇస్లామిస్టులు, అతివాదులు అయిన హంతకులు ఇకపై స్వేచ్ఛగా తిరుగుతారు. బంగ్లా మాజీ ప్రధాని షేక్ హాసీనాకు వ్యతిరేకంగా అప్పట్లో ఆందోళనకారులు తీవ్ర హింసకు పాల్పడ్డారు. పోలీస్ స్టేషన్లు కూడా తగలబెట్టేశారు. కొందరిని లక్ష్యంగా చేసుకుని హత్యలు చేశారు. అక్కడ ఏడాదిన్నర కాలంగా హాసీనా పాలనకు వ్యతిరేకంగా ఆందోళనలు సాగుతున్నాయి. ఈ ఘటనల్లో గత అక్టోబర్ వరకు 44 మంది పోలీసులు మరణించినట్లు అక్కడి నివేదికలు తెలిపాయి. ఆగష్టు 5, 2024న బంగ్లాదేశ్‌లో ప్రభుత్వం కూలిపోయింది. తనకు వ్యతిరేకంగా జరిగిన ఆందోళనల నేపథ్యంలో షేక్ హాసీనా ఇండియాకు వచ్చి ఆశ్రయం పొందుతున్నారు.

## భద్రతామండలిలో మరోసారి బయటపడిన పాక్ వక్రబుద్ధి
### తిప్పికొట్టిన భారత్ శాశ్వతప్రతినిధి

**న్యూయార్క్,జనవరి 27:** ఐక్యరాజ్యసమితి లో పాకిస్థాన్ వైఖరిని భారత్ మరోసారి ఎండగట్టింది. ఆపరేషన్ సిందూర్ పై ఆ దేశ రాయబారి చేసిన తప్పుడు ప్రచారాన్ని గట్టిగా తిప్పికొట్టింది. ఉగ్రవాదాన్ని చట్టబద్ధం చేసేందుకు ఆ దేశం ప్రయత్నిస్తోందని మండిపడింది. ఈ మేరకు ఐరాసలో భారత శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీశ్ ఘాటుగా స్పందించారు. ఐక్యరాజ్యసమితి భద్రతామండలి సమావేశంలో పాక్ రాయబారి ఆసిమ్ ఇఫ్తికార్ అహ్మద్ మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్, జమ్ముకశ్మీర్, సింధూ జలాల ఒప్పందం గురించి ప్రస్తా




వించారు. ఉగ్రవాదాన్ని శిక్షిస్తూ సరికొత్త సాధారణ స్థితి నెలకొల్పినట్లు భారత్ చెబుతున్న పరిస్థితి ఏమీ కనిపించడం లేదని పేర్కొన్నారు. ఈ విషయం ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో తమ ప్రతిస్పందనతోనే తెలిపోయిందని వ్యాఖ్యానించారు. దీనిపై ఐక్యరాజ్యసమితిలో భారత శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీశ్ ఘాటుగా స్పందించారు. అంతర్జాతీయ వేదికల్లో పాకిస్థాన్ ప్రతిసారీ భారత్‌కు, దేశ ప్రజలకు హాని కలిగించడమే అజెండాగా పెట్టుకుందని మండిపడ్డారు. పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి, ఆ తర్వాత భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ గురించి వివరించారు. జమ్ముకశ్మీర్ భారత్‌లో అంతర్భాగమని హరీశ్ పునరుద్ఘాటించారు. భారత అంతర్గత అంశాలపై వ్యాఖ్యానించే హక్కు పాకిస్థాన్‌కు లేదన్నారు. 65 ఏళ్ల క్రితం విశ్వాసం, స్నేహం స్ఫూర్తితో భారత్ సింధూ జలాల ఒప్పందం చేసుకున్న విషయాన్ని ఆయన గుర్తుచేశారు. పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని ఎగదోస్తూ ఒప్పందాన్ని ఉల్లంఘించిందని అన్నారు. అందుకే భారత్ ఆ ఒప్పందాన్ని నిలిపివేసిందని తెలిపారు.

## అమెరికా మద్దతులేకుండా ఐరోపా స్వీయరక్షణ అసాధ్యం: మార్క్ రుట్టే

**బ్రస్సెల్స్,జనవరి 27:** అమెరికా సైనిక మద్దతు లేకుండా యూరప్ తనను తాను రక్షించుకోగలదని భావిస్తే, అది పగటి కలలు కనడమేనని నాటో సెక్రటరీ జనరల్ మార్క్ రుట్టే సంచలన వ్యాఖ్యలు చేశారు. యూరప్ భద్రత విషయంలో వాస్తవికంగా ఉండాలని, అమెరికాపై ఆధారపడటం తప్పనిసరి అని ఆయన స్పష్టం చేశారు. బ్రస్సెల్స్‌లోని యూరోపియన్ పార్లమెంట్‌లో భద్రత, విదేశీ వ్యవహారాల కమిటీల సభ్యులను ఉద్దేశించి మార్క్ రూటె ప్రసంగించారు. అమెరికా లేకుండా యూరప్ తనను తాను కాపాడుకోగలదని ఇక్కడ ఎవరైనా అనుకుంటే, వారు ఆ కలలు కంటూనే ఉండవచ్చు. కానీ అది సాధ్యం కాదని ఆయన తేల్చి చెప్పారు. ఇటీవలి



కాలంలో గ్రీన్‌ల్యాండ్‌పై అమెరికా విధానం, కూటమి సభ్య దేశాల సహకారంపై నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో రూటె వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. యూరప్ భద్రత విషయంలో నాటో, యూరోపియన్ యూనియన్ (ఈయూ) పరస్పరం పోటీ పడకూడదని, ఒకరికొకరు సహకారంతో పనిచేయాలని ఆయన సూచించారు. యూరప్ తన రక్షణ సామర్థ్యాన్ని పెంచుకోవడం చాలా కీలకమని అయితే అది నాటో ప్రయత్నాలకు ప్రత్యామ్నాయం కాకూడదని అన్నారు. యూరప్, కెనడా దేశాలు తమ భద్రతపై మరింత బాధ్యత తీసుకుంటున్నాయని, ఇది శుభపరిణామమని అన్నారు. ఉక్రెయిన్‌కు అందిస్తున్న సైనిక, మానవతా సహాయాన్ని ప్రస్తావిస్తూ, రష్యాదాడుల వల్ల ఉక్రెయిన్ ఇంధన మౌలిక సదుపాయాలు తీవ్రంగా దెబ్బ తిన్నాయని తెలిపారు. ప్రస్తుతం యూరప్ తన రక్షణ పరిశ్రమను నిర్మిస్తున్నప్పటికీ, ఉక్రెయిన్‌కు తక్షణ అవసరాలను తీర్చే స్థాయిలో అది లేదని అభిప్రాయపడ్డారు.



## ఇరాన్‌పై దాడికి అమెరికా యుద్ధనౌక సిద్ధం

**వాషింగ్టన్, జనవరి 27:** పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నాయి. అగ్రరాజ్యానికి చెందిన యుద్ధ విమాన వాహక నౌక యుఎస్ఎస్ అబ్రహం లింకన్ తాజాగా పశ్చిమాసియాకు చేరుకుంది. దీంతో ఇరాన్‌పై యుఎస్ ఏ క్షణాన దాడి చేస్తుందోనన్న భయాందోళనలు నెలకొన్నాయి. అబ్రహం లింకన్‌తోపాటు యుఎస్ఎస్ ఫ్రాంక్ ఈ పీటర్సన్ జూనియర్, యుఎస్ఎస్ స్ప్రూయాన్స్ డెస్ట్రాయర్లు, యుఎస్ఎస్ మిషెల్ మార్ఫీ కూడా ఇక్కడికి చేరుకున్నాయి. అమెరికాకు చెందిన సెంట్రల్ కమాండ్ ఈ విషయాన్ని ధ్రువీకరించింది. ప్రాంతీయ భద్రత, స్థిరత్వం కోసం దీన్ని మోహరించినట్లు పేర్కొంది. ఈ బృందం ఇరాన్ సరిహద్దుల్లోని అరేబియా సముద్రంలో కాకుండా హిందూ మహాసముద్రంలో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ఈ పరిణామాలతో ఈ ప్రాంతంలో అమెరికా సైనిక సిబ్బంది సంఖ్య మరింత పెరిగింది. ఇదిలా ఉండగా పెంటగాన్ పలు ఫైటర్ జెట్‌లు, మిలిటరీ కార్గో విమానాలను ఈ ప్రాంతానికి తరలించనున్నట్లు మీడియాలో కథనాలు వస్తున్నాయి. ఇరాన్‌లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనలు జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో జరిగిన ఘర్షణల్లో వేలాది మంది ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోంది. ఆందోళనకారులకు మద్దతుగా నిలిచిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వారికి వ్యతిరేకంగా ఇరాన్ ప్రభుత్వం ఏదైనా చర్యలు తీసుకుంటే జోక్యం చేసుకుంటామని హెచ్చరించారు. ఈ క్రమంలో భారీగా తమ సైన్యాన్ని ఇరాన్ దిశగా పంపినట్లు ప్రకటించారు. దీంతో ఇరు దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి.

**చర్చలకు అమెరికా సిద్ధం:** ట్రంప్ హెచ్చరికల నేపథ్యంలో ఇరాన్ చర్చించాలనుకుంటే అమెరికా అందుకు సిద్ధంగా ఉందని అగ్రరాజ్యానికి చెందిన అధికారి ఒకరు పేర్కొన్నారు. చర్చలు ముందుకు సాగేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో టెహ్రాన్‌కు ఇప్పటికే తెలుసని అన్నారు.

# సంక్షిప్తంగా..

## ఫ్రాన్స్‌లో 15 యేళ్లలోపు పిల్లలకు సోషల్ మీడియా నిషేధం




**ప్యారిస్, జనవరి 27:** పిల్లలపై సామాజిక మాధ్యమాల ప్రభావాన్ని అరికట్టేందుకు ఫ్రాన్స్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 15 యేళ్లలోపు పిల్లలు సామాజిక మాధ్యమాలు వినియోగించకుండా ఓ చట్టం తీసుకురానుంది. ఈ విషయాన్ని ఫ్రాన్స్ దేశాధ్యక్షుడు ఇమాన్యుయేల్ మేక్రాన్ ప్రకటించారు. 15యేళ్లలోపు పిల్లలు సోషల్ మీడియా మాధ్యమా లను ఉపయోగించడాన్ని నిషేధించే బిల్లుకు ఫ్రాన్స్ దిగువ సభలోని శాసనసభ్యులు మద్దతిచ్చారన్నారు. సెనెట్‌లో దీనిపై చర్చలు జరిపి, బిల్లుపై నిర్ణయం తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. పిల్లలు గంటలకొద్దీ సమయాన్ని స్క్రీన్‌కు కేటాయించడం వల్ల వారిలో తలెత్తుతున్న ఆరోగ్య, మానసిక సమస్యలను నివారించడానికి ఈ చర్యలు తీసుకుంటున్నట్లు మేక్రాన్ వెల్లడించారు. ఫిబ్రవరి చివరికి సెనెట్ ఈ బిల్లును ఆమోదించే అవకాశం ఉందని ఫ్రాన్స్ అధికారులు పేర్కొన్నారు. సోషల్ మీడియాపై నిబంధనలు సెప్టెంబరు 1 నుంచి అమల్లోకి వస్తాయన్నారు.

## ట్రంప్ ఇమిగ్రేషన్ విధానాలపై అమెరికాలో అసంతృప్తి




**వాషింగ్టన్, జనవరి 27:** అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇమిగ్రేషన్ విధానాలపై అమెరికన్లు అసంతృప్తితో ఉన్నారు. ఈ అంశంలో ట్రంప్ నిర్ణయాలకు ప్రజల మద్దతు భారీగా తగ్గింది. రాయిటర్స్-ఇప్సాస్ నిర్వహించిన పోల్‌లో ఈ విషయం వెల్లడైంది. వలసలపై ఆయన తీసుకుంటున్న కఠిన చర్యలు చాలా దూరం వెళ్లాయని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. వలసదారుల్ని అడ్డుకోవడానికి అమెరికాలోని పలు ప్రాంతాల్లో ట్రంప్ యంత్రాంగం ఇమిగ్రేషన్ ఏజెంట్లను మోహరించింది. దీనికి నిరసనగా జరిగిన ఘర్షణల్లో ఆ ఏజెంట్ల చేతిలో శనివారం మినియాపొలిస్‌లో మరో అమెరికా పౌరుడు ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటనకు ముందు, తర్వాత అంటే శుక్రవారం నుంచి ఆదివారం మధ్య ఈ పోల్ చేపట్టగా ట్రంప్ నిర్ణయాలను ఆమోదించేవారి సంఖ్య తగ్గిపోయింది. తాజాగా 39 శాతం మంది ఆమోదించగా అంతకుముందు ఆ రేటు 41 శాతంగా ఉంది.

## ప్రపంచ ఇంధన మార్కెట్లలో టాప్ భారత్: కెనడా మంత్రి



**న్యూఢిల్లీ,జనవరి 27:** ప్రపంచంలోని అత్యంత కీలకమైన ఇంధన మార్కెట్‌లలో ఒకటిగా భారత్ అభి వృద్ధి చెందుతోందని కెనడా ఇంధన మంత్రి టిమ్ హడ్గ్‌సన్ వ్యాఖ్యానించారు. ఇంధన రంగంలో కెనడా సూపర్‌పవర్ కావాలంటే భారత్‌తో వ్యాపారం చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఇరుదేశాల మధ్య వాణిజ్య సంబంధాలను, ఎనర్జీ ట్రేడ్‌ను మరింత ముందుకు తీసుకువెళ్లడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. చమురు, గ్యాస్ వాణిజ్యాన్ని విస్తరించడం కోసం ఒట్టావా నుంచి భారత్‌కు ముడి చమురు, పెట్రోలియం, సహజ వాయువులను రవాణా చేయడానికి కెనడా సిద్ధంగా ఉందని టిమ్ హడ్గ్‌సన్ తెలి పారు. కెనడా మంత్రితో చర్చల అనంతరం భారత పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వశాఖ మంత్రి హర్దీప్‌సింగ్ పురి మీడియాతో మాట్లాడారు. ఇరుదేశాల మధ్య పలు వాణిజ్య ఒప్పందాలపై చర్చలు కొనసాగుతున్నట్లు తెలిపారు.

## ఎక్కడినుంచైనా..ఎప్పుడైనా ఆధార్ మొబైల్ అప్‌డేట్




**న్యూఢిల్లీ,జనవరి 27:** ఆధార్ కార్డులో మొబైల్ నంబర్ అప్డేట్‌కు సంబంధించి కేంద్ర విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యుఐడిఎఐ) కీలక ప్రకటన చేసింది. ఆధార్ కార్డుకు మొబైల్ నంబర్ అప్డేట్ చేసే ప్రక్రియను మరింత సులభతరం చేసింది. దీని ద్వారా ఇప్పుడు మొబైల్ నంబర్‌ను ఇప్పుడు ఎక్కడి నుంచైనా ఎప్పుడైనా అప్డేట్ చేసుకునే వీలు కల్పించనుంది. ఈ మేరకు ఆధార్ తన ట్విట్టర్‌లో దీని గురించి పోస్ట్ చేసింది. ఇక్కడ జనవరి 28 నుంచి ఈ సదుపాయం ఆధార్ కొత్త యాప్‌లో అందుబాటులోకి వస్తుందని స్పష్టం చేసింది. దీంతో ఇకపై ఆధార్ కార్డులో మొబైల్ నంబర్ అప్డేట్ కోసం ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ సెంటర్ల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉం డదు. దీంతో ప్రజలపై భారం తగ్గుతుందని భావిస్తోంది.

# అటవీ శాఖలో ఇంటి దొంగలపై ఉక్కు పాదం

## పీలేరు రేంజ్‌లో ఇద్దరు అధికారుల తొలగింపు

పీలేరు, జనవరి 27 ప్రభాతవార్త: అటవీ శాఖలో ఇంటి దొంగల పని పట్టింది కూటం ప్రభుత్వం. శాఖలో ఉంటూ సంఘవిద్రోహ శక్తులతో చేతులు కలిపి ఎర్రచందనం అక్రమ రవాణాకు సహకరిస్తున్న ఇద్దరు అధికారులను ఉద్యోగాల నుండి శాశ్వతంగా తొలగించింది. ఈ సంఘటనకు వివరాలు... పీలేరులో ఇంటి దొంగల పైన కూటమి ప్రభుత్వం ఉక్కు పాదం మోపింది. ఇద్దరు ఫారెస్ట్ అధికారులను విధుల నుంచి తొలగిస్తూ జిల్లా ఫారెస్ట్ అధికారి సాయిబాబా ఉత్తర్వులు జారీ చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పీలేరు అటవీ శాఖలో పనిచేసే నలుగురు అటవీశాఖ అధికారులు తలుపుల సెక్షన్ ఫారెస్ట్ బీట్ అధికారి టి.శ్రీనివాసన్ అలియాస్ స్వామి, ఉస్తికాయల పెంట సెక్షన్ బీట్ అధికారి టి.రెడ్డప్ప, అసిస్టెంట్ బీట్ అధికారి ఎం.విజయ భాస్కర్, నూతన కాల్వ చెక్ పోస్ట్ అధికారి సిఎం జయప్ప 2021లో ఈ ఎర్రచందనం స్మగ్లర్లకు సహకరిస్తూ విలువైన అక్రమంగా ఎర్రచందనం సంపదను కొల్లగొడుతున్న స్మగ్లర్లకు సహకరిస్తూ వచ్చారు. ఈ క్రమంలో స్మగ్లర్ల నుంచి భారీగా ముడుపులు తీసుకుంటూ వారికి రాచబాట పరిచారు. ఈ తరహాలోనే తరలిస్తున్న స్మగ్లర్లకు సహకరించిన కేసులో అరెస్టు చేసి రిమాండుకు తరలించగా వారిని ప్రభుత్వం సస్పెండ్ చేసింది. అనంతరం వీరు 2022లో తిరిగి విధుల్లోకి చేరారు. ఈ కేసుపై ప్రత్యేక అధికారి ద్వారా ఇన్వెస్టిగేషన్ చేసి రిపోర్ట్‌ను అటవీశాఖ ఉన్నతాధికారులకు నివేదిక అందజేశారు. ఇదిలావుండగా ఇటీవల ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఉమ్మడి చిత్తూరు జిల్లా పర్యటన తరువాత అటవీ శాఖలో కీలక పరిణామాలు చోటు చేసుకున్నాయి. అటవీ శాఖలో పనిచేసే ఇంటి దొంగల పైన ఉక్కుపాదం మోపారు. పీలేరు అటవీశాఖలో అక్రమ ఎర్రచందనం రవాణాలో పట్టుబడి అరెస్ట్ అయిన ఫారెస్ట్ బీట్ అధికారులలో జయప్ప మృతి చెందగా, ఫారెస్ట్ బీట్ అధికారి టి.శ్రీనివాసన్ అలియాస్ స్వామి, ఏబిఒ ఎం. విజయ భాస్కర్‌లను సర్వీసు నుంచి తొలగిస్తూ జనవరి 3వ తారీఖున జిల్లా అటవీశాఖ అధికారి సాయిబాబా ఉత్తర్వులు జారీచేశారు. అదే విధంగా రెడ్డప్ప అనే అధికారిపై చర్యలు చేపట్టారు. అయితే దీనిని స్థానిక అధికారులు మీడియాకు తెలియజేయక పోవడం గమనార్హం. ఏది ఏమైనా ఇంటి దొంగల పైన అటవీ శాఖలో కూటమి ప్రభుత్వం ఉక్కు పాదం మోపడంపై పీలేరు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



విద్యుత్ కార్యాలయం ముందు పెట్రోల్ బాటిల్‌తో ఆందోళన చేస్తున్న రైతులు

# ట్రాన్స్‌ఫార్మర్ కోసం రైతుల ఆందోళన

రాయదుర్గం జనవరి 27 ప్రభాతవార్త: రాయదుర్గం పట్టణంలో ఎపి ట్రాన్స్‌కో ఆఫీస్ దగ్గర మంగళవారం రాయదుర్గం మండలం బొమ్మకపల్లి మెచ్చిరి గ్రామాలకు చెందిన రైతులు ట్రాన్స్‌ఫార్మర్ కోసం ఆందోళనకు దిగారు. డిడిలు కడ్డీ రెండు సంవత్సరాలైనా ఇంతవరకు ట్రాన్స్‌ఫార్మర్ ఇవ్వడం లేదంటూ రైతులు సురేష ఎల్లప్ప బొమ్మేషు ఆవేదన వ్యక్తం చేశారు మా కన్నా వెనక డిడిలు కట్టిన రైతులకు ట్రాన్స్‌ఫార్మర్‌లు ఇచ్చారని వారు ఆరోపించారు రాయదుర్గం రూరల్ ప్రాంతంలో రైతులు విద్యుత్ కనెక్షన్ల కోసం చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కొక్క ట్రాన్స్‌ఫార్మర్ కోసం దాదాపు 70 వేల రూపాయలు దాకా వసూలు చేస్తున్నట్లు, అనంతరం మెటీరియల్ అంటూ మరో 50 వేలు వసూలు చేస్తున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. మల్లాపురం గ్రామంలో ఈ మధ్యనే ఇద్దరు రైతులతో రూ.70 వేలు కట్టించుకొని అదనంగా మరో రూ.50 వేలు కట్టించుకొని 1.20 లక్షలకు ట్రాన్స్‌ఫార్మర్ స్తంభాలు మెటీరియల్ కలెక్షన్ ఇచ్చినట్లు రైతుల ఆరోపిస్తున్నారు. ఏదేమైనా రైతుకు ట్రాన్స్‌ఫార్మర్ విద్యుత్ కనెక్షన్ కోసం విషయంలో తీవ్ర అన్యాయం జరుగుతుందని రైతుల ఆరోపిస్తున్నారు.



యాదవ మహాసభ అధ్యక్షుడు చింకా నారాయణ యాదవ్‌తో కార్యవర్గ సభ్యులు

# యాదవ జాతి ఐక్యతకు, అభివృద్ధికి కృషి చేస్తా

## యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చింకా నారాయణ యాదవ్

విజయవాడ, జనవరి 27 ప్రభాతవార్త ప్రతినిధి: సంఘటితంగా ఉద్యమిస్తేనే సమస్యలను పరిష్కంచుకోగలమని భారత యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చింకా నారాయణరావు యాదవ్ ఉద్ఘాటించారు. యాదవ్‌లంతా ఐక్యంగా ఒకే వేదికపైకి రావాలన్నారు. యాదవ జాతి ఐక్యతకు, అభివృద్ధికి కృషి చేస్తానని చింకా నారాయణరావు యాదవ్ అన్నారు. స్థానిక విజయవాడలో నారాయణ రావు అధ్యక్షతన రాష్ట్ర కార్యవర్గాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నారాయణరావు యాదవ్ మాట్లాడుతూ గ్రామ గ్రామాన యాదవ సంఘ నిర్మాణం చేపట్టి యాదవ జాతి ఐక్యతకు, అభివృద్ధికి, సంక్షేమానికి తోడ్పడతానని అన్నారు. పేద మధ్య తరగతి వర్గాల విద్యార్థులకు వృత్తి నైపుణ్యంలో శిక్షణ ఇచ్చి వారి ఉపాధి అవకాశాలను మెరుగు పరుస్తానని అన్నారు. యాదవులకు ఎక్కడ ఏ సమస్య వచ్చినా సంఘ పరంగా కార్వర్గం అండగా ఉంటుందని అన్నారు. యాదవ జాతికి అవసరమైన యాదవ భవన్ నిర్మాణం, యాదవ హాస్టల్ కొరకు ప్రభుత్వంలోని యాదవ పెద్దల ద్వారా ప్రయత్నిస్తామని తెలిపారు. త్వరలోనే అన్ని జిల్లాలలో పర్యటించి అఖిల భారత యాదవ మహాసభను బలోపేతం చేస్తామని తెలిపారు. కార్యక్రమానికి రాష్ట్ర యాదవ మహాసభ మాజీ ఉపాధ్యక్షుడు వెంకటసత్యనారాయణ యాదవ్ పాల్గొన్నారు. యాదవ మహాసభ సమావేశంలో అంతర్భాంగా యూత్ కమిటీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర కమిటీ యూత్ అధ్యక్షుడుగా ఆలా అనంతరామయ్య యాదవ్, పొలిటికల్ ఎఫైర్స్ కమిటీ చైర్మన్‌గా కొలుసు మోహన్ యాదవ్, జనరల్ సెక్రటరీలుగా పెద్దిబోయిన శ్రీనివాస్ యాదవ్, యర్రాకుల శ్రీనివాస్ యాదవ్, బొడ్డు పైడిరాజు యాదవ్, వైస్ ప్రెసిడెంట్‌లుగా జె.వి. కృష్ణయ్య యాదవ్, అల్లు వెంకట రమణారావు యాదవ్, తోకల రామక్రిష్ణ యాదవ్, ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకన్నారు.

# గవర్నరు ప్రసంగం తప్పుల తడక

## - మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు

విజయవాడ, జనవరి 27 ప్రభాతవార్త ప్రతినిధి: గణతంత్ర దినోత్సవాల సందర్భంగా ఏపీ గవర్నరు ప్రసంగం అంతా తప్పుల తడకగా ఉందని, ఆయనతో కూటమి ప్రభుత్వం పచ్చి అబద్ధాలు మాట్లాడించిందని మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు విమర్శించారు. ఎన్నికల ముందు సూపర్ సిక్స్ పేరుతో భారీ హామీలు గుప్పించారని, ప్రతియేటా జనవరి ఒకటిన జాబ్ కేలండర్ అంటూ ప్రకటనలు ఇచ్చారని, రెండేళ్లు గడుస్తున్నా జాబ్ కేలండర్ లేదని పేర్కొన్నారు. ఒక్క నిరుద్యోగికీ మూడువేల భృతి అందడం లేదని, యువతను దారుణంగా మోసగించారని అన్నారు. అమరావతి రైతులకు మొండిచేయి చూపించారన్నారు. తల్లికి వందనం పథకంలోనూ కోతలు విధించారని తెలిపారు. 30 లక్షల మంది విద్యార్థుల తల్లులకు మొండిచేయి చూపించారని, అన్నదాత సుఖీభవ, ఉచిత సిలిండర్ పథకాలు అరకొరగా అమలు చేశారని పేర్కొన్నారు. డైవర్షన్ కోసమే పి4 పేరుతో కొత్త డ్రామా లేవనెత్తారని, ఏ ఒక్క వర్గానికీ మేలు చేయని చంద్రబాబు సర్కారు, ప్రత్యేక విమానాల్లో తిరగడం తప్ప సాధించిందేమీ లేదని విమర్శించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు లోపించాయని, మహిళలకు రక్షణ కరువైందని అన్నారు.

# పట్టణాల అభివృద్ధి ఫోకస్

**• రూ.52 వేల కోట్లతో ప్రణాళికలు • కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త కార్యాచరణ**



విజయవాడ, జనవరి 27 ప్రభాతవార్త ప్రతినిధి: నగర,పట్టణ ప్రాంతాల అభివృద్ధిపై ఏపీ ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఇందుకు అనుగుణంగా మొత్తం రూ. 52 వేల కోట్ల అంచనాలతో అభివృద్ధి పనులకు ప్రణాళికలు రూపొందిస్తుంది. పట్టణ,పురపాలకాభివృద్ధి శాఖ అధికార యంత్రాంగం అందించిన సమాచారాన్ని అనుసరించి మంచినీరు, రోడ్లు, మురుగు కాల్వలు, ప్రజారోగ్యం, వీధిదీపాలు, ఇలా వచ్చే 20 ఏళ్ల అవసరాలు తీర్చేలా కేంద్ర కేంద్ర ప్రభుత్వంతో కలిసి ఏపీ ప్రభుత్వం ఉమ్మడి రోడ్ మ్యాప్ రూపొందిస్తున్నాయి. నగరాలు, పట్టణాల్లో కొత్తగా 23వేల 611 కిలోమీటర్ల మేర వరద నీటి కాలువలు నిర్మించాలని ప్రతిపాదించారు. ఇందుకు రూ. 4 వేల 849 కోట్లు అవసరమని అంచనా వేశారు. ఇక ప్రతిరోజూ 302.01 మిలియన్ లీటర్ల మురుగునీటిని శుద్ధి చేసేలా ప్లాంట్ల ఏర్పాటుకు ప్రతిపాదించారు. ప్రస్తుతం రోజూ వస్తున్న 1,957 మిలియన్ లీటర్ల మురుగు నీటిలో 533.65 మిలియన్ లీటర్లను శుద్ధి చేస్తున్నారు. మరో 711.76 మిలియన్ లీటర్లు శుద్ధి చేసేందుకు చేపట్టిన ఎస్‌టీపీలు నిర్మాణ దశల్లో ఉన్నాయి. కొత్తగా 289 మిలియన్ లీటర్ల మంచినీటి సరఫరాకు కొత్త ప్రాజెక్టులు ప్రతిపాదించారు.

అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద కేంద్రం నుంచి ఏటా రూ. 10 వేల కోట్ల చొప్పున పదేళ్లలో లక్ష కోట్లు సాధించి వాటితో నగరాలు, పట్టణాల రూపురేఖలు మార్చాలని ప్రణాళిక వేశారు. తొలిదశలో రూ. 30 వేల కోట్ల విలువైన ప్రాజెక్టులకు సంబంధించి కేంద్రానికి ప్రతిపాదనలు పంపారు. సాస్కీ పథకంలో కేంద్రం నుంచి రూ. 2 వేల కోట్లు రాబట్టాలనే యోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉంది. పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధి నిధి, ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు రుణాలతోపాటు అమృత్ పథకంలో రూ. 15 వేల 500 కోట్లతో వివిధ దశల్లోని అభివృద్ధి పనులు పూర్తి చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. నగర,పట్టణ వాతావరణంలో పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా రహదారులు, వరద నీటి కాలువలు, తాగునీరు, వీధి దీపాలు, ప్రజారోగ్యం అంశాల్లో సౌకర్యాలు మెరుగు పరిచేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. పట్టణవాసులకు ప్రస్తుతం అందిస్తున్న సేవల్లో లోటు భర్తీ చేయడంతోపాటు వచ్చే 20 ఏళ్ల అవసరాలు తీర్చేలా కార్యచరణ రూపొందిస్తోంది.

కేంద్ర పథకాల సమర్థ వినియోగంతోపాటు పుర, నగరపాలక సంస్థల నిధులతో పట్టణాల్లో మెరుగైన సేవలు అందించవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. 2028 నాటికి రూ. 52 వేల కోట్లతో ప్రతిపాదిత పనులు పూర్తి చేయాలని యోచిస్తోంది. 2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్రంలో పట్టణ జనాభా 29.47 శాతం నుంచి 37 శాతానికి పెరిగిందని అంచనా. విశాఖ, విజయవాడ నగరాలు విస్తరించగా గుంటూరు జనాభా పది లక్షలకు చేరువలో ఉంది. నెల్లూరు, ఒంగోలు, కాకినాడ, కర్నూలు, అనంతపురం, కడప నగరాలూ ఏటేటా విస్తరిస్తున్నాయి.

రాష్ట్రంలోని 123 పుర, నగర పాలికలు, నగర పంచాయతీల పరిధిలో ప్రస్తుతం 20 వేల 513 కిలోమీటర్ల మేర రహదారులుండగా కొత్తగా 1450 కిలోమీటర్ల మేర సిమెంట్, తారు రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం ప్రణాళికలు వేసింది. కొత్తగా వెలుస్తున్న చాలా కాలనీల్లో పుర, నగరపాలక సంస్థల సాధారణ నిధులతో అక్కడ రోడ్లు వేయనున్నారు.



# ఎసిబి వలలో సబ్‌ట్రెజరీ అధికారి

శ్రీకాకుళం, జనవరి 27 ప్రభాతవార్త: ఎసిబి వలలో శ్రీకాకుళం సబ్ ట్రెజరీ అధికారి ఎన్.రవిప్రసాద్, సీనియర్ అకౌంటెంట్ ఎ.శ్రీనివాసులు చిక్కారు. మంగళవారం తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో ఉన్న సబ్‌ట్రెజరీ కార్యాలయంలో ఒక విశ్రాంత ఉద్యోగి నుంచి శాలరీ ఎరియర్స్ కోసం రూ.15వేలు నగదు తీసుకుంటుండగా ఎసిబి అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. బాధితుడు శాలరీ ఏరియర్ బిల్లు రూ.4,34,697 కోసం రూ.20వేలు డిమాండ్ చేశారని, చివరికి రూ.15వేలు ఇవ్వడానికి అంగీకరించినట్టు తెలిపారు. 17 రోజులుగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా డిమాండ్ చేసిన మొత్తం ఇవ్వకుండా బిల్లు పెట్టడానికి నిరాకరించడంతో ఎసిబిని ఆశ్రయించాడు. సీనియర్ అకౌంటెంట్ శ్రీనివాసరావు ద్వారా రూ.15వేలు నగదును సబ్‌ట్రెజరీ అధికారి ఎన్.రవిప్రసాద్ తీసుకుంటుండగా ఎసిబి అధికారులు దాడి చేసి నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. అనంతరం కార్యాలయంలో రికార్డులను పరిశీలించి ఇద్దరినీ విచారించి విశాఖకు తరలించనున్నట్లు అధికారులు తెలిపారు. దాడుల్లో ఎసిబి డిఎస్పీ రమణ, సిఐ భాస్కరరావు, సిబ్బంది పాల్గొన్నారు.




# తిరుపతిలో సూపర్‌మార్కెట్‌లో చోరీ

తిరుపతి, జనవరి 27 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుపతి నగరంలో ఏకంగా దొంగలు సూపర్‌మార్కెట్‌లో చోరీ చేశారు. నగరంలో చిన్నపాటి శివార్లలో ఉన్న ఐఎస్ మహల్ సమీపంలోని ప్రాంతంలో ఉన్న ఎస్‌మార్ట్ సూపర్ మార్కెట్ యాజమాన్యం సోమవారం రాత్రి వ్యాపార లావాదేవీలు ముగిసిన తరువాత షట్టర్‌వేసి తాళాలు బిగించారు. మంగళవారం ఉదయం మార్ట్ తెరిచేందుకు రావడంతో షట్టర్ తాళాలు పగలగొట్టి చోరీచేసినట్లు కనుగొన్నారు. రాత్రి షట్టర్‌తెరిచి కొద్దిగా పైకిలేపి ముగ్గురు ముసుగులు ధరించిన దొంగలు ఈ చోరీకి పాల్పడినట్లు సిసికెమెరాల్లో రికార్డయింది. అయితే వారు ఎవరు, ఎలా ఈ చోరీకి పాల్పడ్డారనేది పోలీసులు తేల్చాల్సి ఉంది. మార్ట్ నిర్వాహకుడు కేరళకు చెందిన జబీర్ దొంగతనంపై తిరుపతి పశ్చిమ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసు జాగిలాలు, క్లూస్‌టీమ్ షట్టర్‌ను, లోపల ఉన్న వేలి ముద్రలను సేకరించారు. తిరుపతి వెస్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సిసికెమెరా పుటేజీల ఆధారంగా విచారణ చేపట్టారు.

# శివరాత్రి తిరునాళ్ళకు శ్రీకాళహస్తి ముస్తాబు

## - ఫిబ్రవరి 10 నుంచి ఉత్సవాలు

శ్రీకాళహస్తి, జనవరి 27 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి మహాశివరాత్రి తిరునాళ్ళకు ముస్తాబౌతుంది. ఫిబ్రవరి 10 నుంచి ప్రారంభమయ్యే ఉత్సవాల పనులు యుద్ధ ప్రాతిపదికపై సాగుతున్నాయి. ఇప్పటికే దేవస్థానం అధికారులు పనుల నిర్వహణలో తలమునకలై ఉన్నారు. ఇప్పటికే పనుల నిర్వహణ, ఇప్పటి వరకు జరిగిన పనులు చేపట్టాల్సిన పనులకు సంబంధించి శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి, ధర్మకర్తల మండలితో కలసి సమావేశం నిర్వహించి సూచించారు. కాగా జిల్లా కలెక్టర్, ఎస్‌పిలు మరోసారి సమీక్షించారు. పలు సూచనలు చేసారు. ఆలయ ఇఒ డి.బాపిరెడ్డి గత ఏడాది చేసిన పనుల అనుభవం ఉండటంతో ఇంజనీ రింగ్ అధికారులను పరుగులు తీయిస్తున్నారు. భక్తుల బస సదుపాయాలకు, సాంస్కృతిక వేదిక రూపకల్పనతో పాటు పార్కింగ్, సిసి కెమెరాల ఏర్పాటు, స్వర్ణముఖి నదిలో భక్తులకు స్నానాలు, గతంతో పోల్చుకుంటే ఈ ఏడాది పనుల్లో వేగం పెరిగింది. ఇప్పటికే దాదాపు పనులు పూర్తి కావచ్చాయి. ఇక ఇంజనీరింగ్ విభాగం పనుల్ని ఇఇ శ్రీనివాసులురెడ్డి సారధ్యంలో రధాలు, నారదపుష్కరిణిలో తెప్పలకు సంబంధించి పరిశీలన జరుపుతున్నారు. బందోబస్తుకు సంబంధించి వచ్చే సుమారు 1000 మంది పోలీసులతో బందోబస్తును ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు.

### భోళాశంకరుని సన్నిధిలో రంగవల్లులు

దక్షిణకైలాసంగా పేరుపొందిన శ్రీకాళహస్తి పట్టణంలో మహాశివరాత్రి ఉత్సవాలకు అంగరంగ వైభవంగా ముస్తాబైంది. ఆలయంలో విద్యుత్ దీపాలు ఆకట్టుకుంటున్నాయి. ముఖ్యంగా ఆలయంలో అడుగుపెట్టిన వెంటనే సంప్రదాయాలకు పెద్దపీట వేసినట్లు రూపుదిద్దుతున్నారు. ఆలయం అంతా రంగుల ముగ్గుల మయం చేస్తున్నారు. ఇక విద్యుత్ దీపాలంకరణలో చూడటానికి వేయి కళ్ళు చాలవన్నట్లు మారింది.



ఇక బిక్షాల గాలిగోపురానికి అమర్చిన 'ఓం నమ:శివాయ' అనే నూయాన్ లైటింగ్ ఇటు తేరువీధి, అటు బజారువీధులను పాల వెలుగుల్లా మార్చేసింది. ఊరంతా పండగ అన్నట్లు మారింది. ఈ ఏర్పాట్లను ఎప్పటికప్పుడు ఇఒ బాపిరెడ్డి సూచనల మేరకు ఇంజనీరింగ్ అధికారులు పర్యవేక్షించుకుంటూ శివరాత్రిని బ్రహ్మాండంగా నిర్వహించుటకు చర్యలు తీసుకుంటున్నారు.

# నేడే మహాత్మాగాంధీ సందేశ యాత్ర

మడకశిర టౌన్, జనవరి 27 ప్రభాతవార్త: మడకశిర మండల పరిధిలోని నీలకంఠాపురం గ్రామంలో మాజీ మంత్రి రఘువీరారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 9 గంటలకు మహాత్మా గాంధీ సందేహ యాత్రను ప్రారంభిస్తారు. నీలకంఠాపురం గ్రామం నుంచి గ్రామాల మీదగా పాదయాత్రగా మధ్యాహ్నం మడకశిర పట్టణంలోని మహాత్మా గాంధీ విగ్రహం వద్దకు చేరుకొని పూలమాలలు వేసి నివాళి అర్పిస్తారు. అనంతరం సిద్ధార్థ పాఠశాలలో సభ నిర్వహిస్తారు. భోజనం అనంతరం పట్టణం మీదగా వడ్రవాళ్యం, చీపులేటి, అయ్యవారిపల్లి గ్రామాల మీదగా పాదయాత్ర సాయంత్రానికి బుళ్ల సముద్రం గ్రామానికి చేరుకుంటారు. అక్కడే రాత్రి బస చేస్తారు. గురువారం బుల్లసముద్రంలో ఉదయం 9 గంటలకు పాదయాత్ర ప్రారంభమై పరిగి మండలం ధనాపురం క్రాస్ మీదగా సేవా మందిరం చేరుకుంటుంది. ఆరోజు రాత్రి అక్కడే బస చేస్తారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు సేవ మందిరం నుంచి హిందూపురం పట్టణానికి చేరుకొని 78వ మహాత్మా గాంధీ వర్ధతి సందర్భంగా విగ్రహం వద్ద నివాళి అర్పించి అక్కడే సభ నిర్వహిస్తారు. ఈ సందర్భంగా మంగళవారం మాజీ మంత్రి రఘువీరారెడ్డి మాట్లాడుతూ మహాత్మా గాంధీ సిద్ధాంతాలైన శాంతి, సత్యం అనే సోదరభావాన్ని చాటిచెప్పడానికి, దేశ సమగ్రత కోసం నేటి కాలంలో గాంధీజీ మార్గం ఎంతో అవసరమని నమ్ముతూ మహాత్మా గాంధీ సందేశ యాత్ర పేరుతో పాదయాత్రను చేపడుతున్నారు. రాజకీయాలకు అతీతంగా కేవలం గాంధీజీ సిద్ధాంతాల వ్యాప్తి కోసం సామాజిక హితం కోసం చేస్తున్న ఈ పాదయాత్రలో మీరందరూ పాల్గొని. దీనిని విజయవంతం చేయవలసిందిగా మనస్ఫూర్తిగా కోరుతున్నామన్నారు.

# కాణిపాకంలో యువగళం మొక్కులు తీర్చుకున్న శాప్ చైర్మన్

కాణిపాకం, జనవరి 27 ప్రభాతవార్త: టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన పాదయాత్రకు నేటికి మూడేళ్ళు పూర్తయిన సందర్భంగా శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు మంగళవారం కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో తన అనుచరులతో కలసి మొక్కులు తీర్చుకున్నారు. ఈమేరకు ఆలయానికి చేరుకున్న వారికి ఆలయ ఛైర్మన్ మణినాయుడు, ఈఓ కె.పెంచల కిషోర్, అర్చకులు ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆయన ఆలయ అఖిలాండం వద్ద 116 కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే స్వామివారి సేవలో పాల్గొన్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మూడేళ్ళ క్రితం రాష్ట్రంలో వున్న విపత్కర పరిస్థితులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని వాటికి శాశ్వత పరిష్కార మార్గాలు చూపాలనే సంకల్పంతో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చారిత్రక యువగళం పాదయాత్రను చేపట్టినట్లు తెలిపారు. ఈపాదయాత్రకు అప్పటి ప్రభుత్వం ఎన్నో అవాంతరాలు సృష్టించిందని తెలిపారు. ఆ క్లిష్ట సమయంలో కాణిపాకం స్వామివారిని ప్రార్థించి పాదయాత్ర విజయవంతంగా పూర్తై ప్రభుత్వ ఏర్పడిన అనంతరం మొక్కులు చెల్లించుకుంటామని మనస్ఫూర్తిగా సంకల్పించినట్లు రవి నాయుడు తెలిపారు. ఈమేరకు స్వామివారి ఆశీస్సులతో యువగళం పాదయాత్ర దిగ్విజయంగా పూర్తికావడం, కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడంతో పాటు లోకేష్ మంత్రిగా బాధ్యతలు చేపట్టడంతో స్వామివారికి కాణిపాకం ఆలయంలో 116 కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నట్లు శాప్ ఛైర్మన్ రవినాయుడు తెలిపారు. సిఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌కు స్వామివారి ఆశీస్సులుండాలని, రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా వుండాలని స్వామివారిని ప్రార్థించినట్లు ఈయన తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో కాణిపాకం ఆలయ ఛైర్మన్ మణినాయుడు, ఐరాల మండల టిడిపి అధ్యక్షుడు హరిబాబునాయుడు, నాయకులు మధుసూదన్ రావు, తిరుపతి గంగమ్మ గుడి ఛైర్మన్ మహేష్ యాదవ్, కాపు కార్పొరేషన్ డైరక్టర్ తోట వాసుదేవ్, తెలుగు యువత అధ్యక్షుడు కృష్ణ యాదవ్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.




# మండపం విషయంలో హైకోర్టు ఉత్తర్వులను అమలు చేయండి


## ప్రత్యామ్నాయం ఏర్పాటు చేయండి

## మాజీ మంత్రి రోజా వినతి



నేషనల్ హైవే పిడికి వినతిపత్రం ఇస్తున్న రోజా

పుత్తూరు (నగరి), జనవరి 27 ప్రభాతవార్త: నగరి మునిసిపాలిటీ పరిధిలో కొండచుట్టు మండపాన్ని తొలగించవద్దని హైకోర్టు ఈనెల 20వ తేదీన ఇచ్చిన ఆదేశాలను అమలు చేయాలని కోరుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ మంత్రి ఆర్.కె.రోజా భారత జాతీయ రహదారుల అధికార సంస్థ ప్రాజెక్ట్ అమలు విభాగం చెన్నై ప్రాజెక్ట్ డైరక్టర్ ఎం.రవీంద్రరావును కోరారు. జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా నగరి మునిసిపాలిటీ పరిధిలోని కొండచుట్టు మండపాన్ని తొలగించవద్దని మాజీ మంత్రి చొరవతో చెంగమనాయనం ట్రస్ట్ ద్వారా హైకోర్టు నుంచి మధ్యంతర ఉత్తర్వులను పొందిన విషయం తెలిసిందే. దీనికి సంబంధించి మంగళవారం చెన్నైలోని పిడిని కలిసి ఆమె ఒక వినతిపత్రం సమర్పించారు. హైకోర్టు ఉత్తర్వుల మేరకు కొండచుట్టు మండపం తొలగించకుండా వెంటనే సంబంధిత అధికారులను ఆదేశించాలని కోరారు. వందల ఏళ్ల వారసత్వ సంపదగా నిలిచిన కొండచుట్టు మండపాన్ని పరిరక్షిస్తూ దానికి ప్రత్యామ్నాయంగా జాతీయ రహదారి మార్గాన్ని మార్చాలని విజ్ఞప్తి చేశారు. 600 ఏళ్ల క్రితం సాళువ రాజుల పాలనతో నిర్మితమైన ఈ మండపంలో చుట్టుపక్కల గ్రామాల ప్రజల నిత్య పూజలతో పాటు, ప్రతి ఏటా జనవరి నెలలో వచ్చే ముక్కనుమ రోజున కొండచుట్టు ఉత్సవం నిర్వహిస్తారని ఆ సందర్భంగా 21 దేవతా మూర్తులను మండపంలో కొలువు చేస్తారని పిడికి వివరించారు. తర్వాత కార్వేటినగరం సంస్థానం, నగరి పాలెగాళ్లు ఈ సంస్కృతిని కొనసాగించారన్నారు. హిందూ సంస్కృతితో పాటు స్థానికుల మనోభావాలతో ముడిపడి వున్న కొండచుట్టు మండపాన్ని పరిరక్షించే దిశగా హైకోర్టు కూడా ఉత్తర్వులు ఇచ్చినందున మండపాన్ని కూల్చకుండా జాతీయ రహదారి మార్గాన్ని మార్చాలని కోరారు. అలాగే పుత్తూరు మునిసిపాలిటీ పరిధిలోని జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన డివైడరు వల్ల కె.ఎం.అగ్రహారం, మహాలక్ష్మిపురం, తిమ్మాపురం వెళ్లేందుకు దగ్గరగా వున్న మార్గం దూరమైందని తెలిపారు. డివైడరు అడ్డంగా వుండడం వల్ల ప్రజలు తమ గ్రామాలకు వెళ్లేందుకు ఒక కిలోమీటరు దూరం ప్రయాణించి యుటర్న్ తీసుకుని రావాల్సి వస్తోందన్నారు. అందువల్ల ఈ మూడు గ్రామాల ప్రజల సౌకర్యార్థం ఈ గ్రామాల వద్ద వున్న డివైడర్ తొలగించి మార్గం ఏర్పాటు చేయాలని కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో నగరి మునిసిపల్ ఛైర్మన్ పి.జి.నీలమేఘం, వైస్ ఎంపిపి కన్నియప్ప, మండప నిర్వాహకులు మణిగండన్, మాజీ ఎజిపి బి.రవీంద్ర, కౌన్సిలర్లు గోపాల్‌రెడ్డి, ఇంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



# మెట్ట ప్రాంత అభివృద్ధికి పరిశ్రమల ఏర్పాటుకు కృషి

## నెల్లూరు కలెక్టర్ హిమాన్స్ శుక్ల

వింజమూరు (నెల్లూరు), జనవరి 27 ప్రభాతవార్త: ఉదయగిరి నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం ఒక ప్రత్యేక కార్యచరణతో ముందుకు వెళ్తుందని వెనుకబడిన ప్రాంతంగా ఉన్న ఈ ప్రాంతంలో నిరుద్యోగతను తగ్గించి ఆర్థిక పరిపుష్టిని సాధించడమే లక్ష్యంగా ప్రణాళికను రూపొందిస్తామని జిల్లా కలెక్టర్ హిమాన్స్ శుక్ల తెలిపారు. మంగళవారం నియోజకవర్గంలోని దుత్తలూరులో అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశాన్ని ముగించుకుని వింజమూరుకు వస్తూ మార్గమధ్యలో నందిగుంట గ్రామంలో గోకుల షెడ్లను పరిశీలించారు. తరువాత వింజమూరులోని చెత్త నుండి సంపద కేంద్రాన్ని పరిశీలించారు. కేంద్ర నిర్వహణ పనితీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. సంపద కేంద్రంలో తయారు చేస్తున్న వర్మీ కంపోస్టు ఎరువును ఇతర ప్రాంతాలకు కూడా పంపడం పట్ల కార్యదర్శి రామారావును, ఎంపీడీవో కె.శ్రీనివాస్‌రెడ్డిని అభినందించారు. అనంతరం బొమ్మరాజు చెరువు ప్రాంతంలో ఉపాధి హామీ పథకం ద్వారా రైతు సాగు చేస్తున్న నిమ్మ తోటను పరిశీలించారు. రైతును పలు విషయాలను అడిగి ప్రభుత్వ పథకాలను గురించి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నియోజకవర్గంలో వనరుల ఉత్పాదకశక్తి ఎక్కువగా ఉందని, సద్వినియోగపరుచుకునే విధంగా రైతులకు బిందు సేద్యం పరికరాలను మంజూరు చేయడం జరుగుతుందన్నారు. దీని వలన ఉద్యాన పంటల సాగు పెరిగే అవకాశం ఉందన్నారు. నీటి ఎద్దడిని దృష్టిలో ఉంచుకొని తక్కువ నీటితో అధిక దిగుబడి సాధించే విధంగా కృషి చేస్తామన్నారు. అంతే కాకుండా గొర్రెలు, మేకలు యూనిట్లను అందజేసి గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి ప్రోత్సాహాన్ని అందిస్తామన్నారు. ఈ ప్రాంతంలో చిన్న తరహా పరిశ్రమలు ప్రోత్సాహానికి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ఏర్పాటు చేసే విధంగా ప్రయత్నిస్తామన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయ అవకాశాలు స్థానికులకు అధికంగా లభించేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఎన్.సుజనా రాయుడు, మండల కన్వీనర్ గూడా నర్సారెడ్డి, తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు గురజాల గోపి, సొసైటీ డైరక్టర్ కోడూరు నాగిరెడ్డి, పాములపాటి మాల్యాద్రి, దుద్దిగుంట శ్రీనివాసులు రెడ్డిలు కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో కావలి ఆర్డీవో సన్నీ వంశీకృష్ణ, డీపీఓ వసుమతి, సీఈఓ శ్రీధర్‌రెడ్డి, ఏపీడీ మృదుల, ఎంపీడీవో కె.శ్రీనివాసరెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో కె.రామారావు, నాయకులు కాటం రమణారెడ్డి, ఎనపల్లి పెంచలరావు, పల్లా మధు, ఎన్.రాయుడు తదితరులు ఉన్నారు.

# బిసిల రక్షణ చట్టం అమలుతోనే బిసిలకు భద్రత, న్యాయం



- ఆదరణ-3 పథకాన్ని సమర్థవంతంగా అమలు
- రాష్ట్రవ్యాప్తంగా బిసి భవనాల నిర్మాణం చేస్తాం
- డిఎస్సీ అభ్యర్థుల కోసం జిల్లాల వారీగా కోచింగ్ సెంటర్లు
- రాష్ట్ర బిసి సంక్షేమం శాఖ మంత్రి ఎస్.సవిత

విజయవాడ, జనవరి 27 ప్రభాతవార్త ప్రతినిధి: బిసిల రక్షణ చట్టంతోనే బిసిలకు భద్రత, ఆత్మరక్షణ సాధ్యమని రాష్ట్ర బిసి సంక్షేమం, చేనేత, జౌళి శాఖ ల మంత్రి ఎస్.సవిత అన్నారు. స్థానిక గొల్లపూడిలోని బిసి సంక్షేమ భవన్‌లో బిసి కార్పొరేషన్ చైర్మన్లతో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర బిసి సంక్షేమం, చేనేత, జౌళి శాఖల మంత్రి ఎస్.సవిత మాట్లాడుతూ బిసిల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని బిసి కార్పొరేషన్ చైర్మన్లతో భేటీలో మంత్రి స్పష్టం చేశారు. బిసిల రక్షణ చట్టం అమలుపై చర్చించడంతోపాటు, మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల ప్రకారం బిసిలకు అండగా నిలవడం, గతంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన ఆదరణ 1, 2 పథకాల తరహాలోనే, ఇప్పుడు ఆదరణ3ను ఏ విధంగా సమర్థవంతంగా అమలు చేయాలనే అంశంపై 39 మంది కార్పొరేషన్ చైర్మన్లతో చర్చించామన్నారు. బిసిలకు 34శాతం రిజర్వేషన్లు, నామినేటెడ్ పోస్టుల్లో రిజర్వేషన్ కల్పనపై సుదీర్ఘంగా చర్చించామన్నారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రవ్యాప్తంగా బిసి భవన్ల నిర్మాణానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. పిఎం సూర్య ఘర్ పథకం కింద బిసిలకు 20,000 రూపాయల అదనపు సబ్సిడీ అందించడం జరుగుతుందన్నారు. ప్రతి బిసి బిడ్డను ఎంట్రప్రెన్యూర్‌గా చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. డిఎస్సీ అభ్యర్థుల కోసం ప్రతి జిల్లాలో కోచింగ్ సెంటర్లు ఏర్పాటు, ఇప్పటికే 300 మంది విద్యార్థులు దీని ద్వారా ఎంపిక కావడం విశేషమన్నారు. లా ఎక్సలెన్స్ ఐఏఎస్ అకాడమీ ద్వారా బిసి విద్యార్థులకు ఉచిత భోజన, వసతి సౌకర్యాలతో అత్యుత్తమ శిక్షణ సివిల్స్ లో అందిస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం అంటేనే బిసిల ప్రభుత్వం అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్ నాయకత్వంలో బిసిల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని మంత్రి సవిత పునరుద్ఘాటించారు. కార్యక్రమంలో బిసి సంక్షేమ శాఖ కార్యదర్శి ఎస్. సత్యనారాయణ, బిసి సంక్షేమ శాఖ డైరెక్టర్ మల్లికార్జున్, బిసి ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ అనంత కుమారి, తదితరులు పాల్గొన్నారు.

**ఐదేళ్ల అసమర్థ పాలనలో చేసిన తప్పులే... నేటి కేసులు**

మంత్రి సవిత విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధికి సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేశ్ రేయింబవళ్లు కృషి చేస్తున్నారన్నారు. తమ ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో పయనింపచేయడానికి పనిచేయడం కష్ట సాధ్యమా..? అని ప్రశ్నించారు. కల్తీ మద్యం కేసులో ఇరుక్కుపోయిన వైసిపి నాయకుడు జోగి రమేష్.. బిసి కార్డు ఉపయోగించడం చూసి జనాలు నవ్వుకుంటున్నారన్నారు. కులం పేరుతో చేసిన తప్పుల నుంచి తప్పించుకోవడం కుదరదన్నారు. మాస్క్ అడిగిన పాపానికి దళిత సామాజిక వర్గానికి చెందిన డాక్టర్ సుధాకర్ ను మానసికంగా వేధించి ప్రాణం కోల్పోయేలా చేశారన్నారు. ఎందరో ఎస్సీలను, ఎస్టీలను, బిసిలను అక్రమంగా వేధించి, జైళ్లో పెట్టారన్నారు. అయిదేళ్ల జగన్ పాలనలో తప్పుల మీద తప్పులు చేశారన్నారు. తప్పిదాలను సరిదిద్దుకోవాలని జగన్ ను ఆనాటి బాధ్యతాయుతమైన ప్రతిపక్షంగా హెచ్చరించామన్నారు. ఆ తప్పులు ఫలితమే నేటి కేసులని, ఇందులో కూటమి ప్రభుత్వ ప్రమేయమేమీ లేదని స్పష్టంచేశారు. జగన్ హయాంలో జరిగిన తప్పిదాలపై దర్యాప్తు కొనసాగుతోందని, త్వరలో మరికొందరి గుట్టుచప్పుడు విషయాలు బయటకు రానున్నాయని వెల్లడించారు. తప్పులు చేయకుంటే జగన్‌కు, ఆయన బ్యాచ్‌కు భయమెందుకని మంత్రి సవిత ప్రశ్నించారు.

# విద్యుత్ చార్జీలు తగ్గించిన ఘనత కూటమి ప్రభుత్వానిదే



- నాణ్యమైన నిరంతర విద్యుత్ సరఫరా చేస్తాం
- చార్జీలు మరింత తగ్గించడానికి యత్నిస్తున్నాం
- విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

బుచ్చి (నెల్లూరు), జనవరి 27 ప్రభాతవార్త: గత ప్రభుత్వం 9 సార్లు విద్యుత్ చార్జీలు పెంచితే, కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు తగ్గించిందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని పంచేడు లో 3.37 కోట్ల వ్యయంతో నిర్మించిన 33/11 కెవి సబ్‌స్టేషన్‌ను ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డితో కలిసి ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడుతు కోవూరు నియోజకవర్గంలో మరో సబ్‌స్టేషన్ మూడు కోట్ల రూపాయలపై చిలుకు వ్యయంతో ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. అలాగే రూ.4 కోట్ల వ్యవయంతో డిఇ కార్యాలయం ఏర్పాటుకు శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో ఆర్‌డిఎస్ఎస్ ద్వారా అనేక పనులు చేపట్టడం జరిగిందని అన్నారు. గత ప్రభుత్వం నిర్వాహం వల్ల విద్యుత్ శాఖలో రూ.30 వేల కోట్ల నష్టం వాటిల్లిందని దానిని దశల వారీగా రూపు మాపేందుకు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. రానున్న రోజులలో 1.19 పైసలు యూనిట్ కాస్టును తగ్గించే విధంగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. రైతులకు, ప్రజలకు నాణ్యమైన విద్యుత్‌ను అందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. రాష్ట్రంలో మూడు డిస్కంలు పనిచేస్తున్నాయని ఒకటి తిరుపతి, రెండువది విజయవాడ, మూడవది విశాఖపట్టణంలో అయితే విశాఖలో డిస్కమ్ మీద అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఆయన విమర్శించారు. అదివాస్తవ విరుద్ధమని ఖండించారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్ నుండి 5 వందల నుండి 6 వందల కోట్ల రూపాయాల మేర విద్యుత్ బకాయిలు ఉన్నాయని అన్నారు. త్వరలో విద్యుత్ శాఖలో సిబ్బంది కొరత తీరుస్తామని తెలిపారు. ఏఇల కొరత చాలా ఉందని అన్నారు. రానున్న రోజులలో నెల్లూరు జిల్లాలో మరో 10 నుండి 12 విద్యుత్ సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేసి నిరంతరం నాణ్యమైన విద్యుత్తును అందచేయనున్నట్లు తెలిపారు. అనంతరం ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతు కోవూరు నియోజకవర్గంలో 33 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్ మంత్రి రవికుమార్ చేతుల మీదుగా ప్రారంభించుకోవడం శుభపరిణామమని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. అనంతరం కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మాట్లాడుతు పది కోట్ల రూపాయాల వ్యయంతో రెండు విద్యుత్ సబ్‌స్టేషన్లకు ప్రారంబోత్స వాలు, డిఇ కార్యాలయానికి శంకుస్థాపన చేసుకోవడం సంతోషంగా ఉందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆక్వా రైతుల సమస్యలను గుర్తించి విద్యుత్ చార్జిలను ఒకటిన్నర రూపాయి తగ్గించడం ఆనందంగా ఉందని అన్నారు. కిసాన్ సెజ్ వద్ద 132 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని ఆమె విద్యుత్ శాఖ మంత్రిని కోరారు. ఈ కార్యక్రమంలో మంత్రి, ఎంపి, ఎమ్మెల్యేలను గజమాలలతో క్రేన్‌తో స్వాగతించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు మేయర్ రూప్‌కుమార్ యాదవ్, ఎస్‌పిడిసిఎల్ ఎస్ఇ రాఘవేంద్రరావు, సీనియర్ నాయకులు కోడూరు కమలాకర్‌రెడ్డి, ఎపి ట్రాన్స్‌కో డిఇ రమేష్ చౌదరి, బుచ్చి రూరల్ బ్యాంకు చైర్మన్ ఏటూరు శివరామకృష్ణారెడ్డి, వవ్వేరు బ్యాంకు చైర్మన్ దొడ్ల విజయలక్ష్మీ, హాస్పటల్ డైరక్టర్ దొడ్ల కోదండరామిరెడ్డి, జొన్నవాడ దేవస్థానం చైర్మన్ అశోక్‌రెడ్డి, జొన్నవాడ దేవస్థానం మాజీ చైర్మన్ పుట్టా సుబ్రమణ్యంనాయుడు పాల్గొన్నారు.

# మత్తు వదలండి



ర్యాలీని ప్రారంభిస్తున్న హోం మంత్రి అనిత

- డ్రగ్స్ తీసుకోవద్దు... సమాచారం తెలిస్తే పోలీసులకు చెప్పండి
- గంజాయి రవాణాపై ఉక్కుపాదం: మంత్రులు అనిత, సత్యకుమార్
- సైకిల్ ర్యాలీ ప్రారంభం... హాజరైన డిజిపి, ఈగల్ ఐజి, కలెక్టర్

విజయవాడ కార్పొరేషన్, జనవరి 12 ప్రభాతవార్త: డ్రగ్స్ సేవించకుండా ఉండటమే కాదు.. మన చుట్టు పక్కల సమాచారం తెలిసినా పోలీసులకు అందించాలని రాష్ట్ర హోంమంత్రి అనిత పేర్కొన్నారు. ఎన్టీఆర్ జిల్లా పోలీసు యంత్రాంగం అధ్వర్యంలో డ్రగ్స్‌పై దండయాత్ర అనే నినాదంతో సైకిల్ ర్యాలీని సిపి రాజశేఖరబాబు, జిల్లా కలెక్టర్ లక్ష్మీశాల అధ్వర్యంలో ఎన్టీఆర్ జిల్లా పరిధిలో 35 రోజుల పాటు డ్రగ్స్ రహిత సమాజం కోసం ముందుగు వేస్తూ డ్రగ్స్‌పై దండయాత్ర అనే నినాదంతో 510 కిలోమీటర్ల సైకిల్ యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియం నుండి సైకిల్ యాత్రను రాష్ట్ర హోం శాఖ మంత్రి వి.అనిత, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మాత్యులు సత్యకుమార్ యాదవ్, డిజిపి హరీష్‌కుమార్ గుప్తా తదితరులు ప్రారంభించారు. ఈ సందర్భంగా హోంమంత్రి అనిత మాట్లాడుతూ సమాజ నిర్మాణానికి ఎన్టీఆర్ జిల్లా పోలీసులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. నేటి కార్యక్రమానికి కర్త,కర్మ,క్రియ అంతా సిపి రాజశేఖర్‌బాబేనన్నారు. ఎంతో మంది డ్రగ్స్‌కు బానిసలుగా మారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. ఈ డ్రగ్స్ వల్ల ఎంతమంది తల్లిదండ్రుల ఆవేదన, ఆక్రందనలు, ఆడబిడ్డల మానప్రాణాలు కాపాడటానికి ఈ మహిళా పోలీసులు ముందుకు వచ్చారని, సెలబ్రిటీ అనే పదానికి కొత్త అర్థం తెచ్చిన ఈ ఐదుగురు మహిళా పోలీసులకు తాను శాల్యూట్ చేస్తున్నానన్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ డ్రగ్స్‌పై దండయాత్ర.. ఒక మంచి కార్యక్రమమన్నారు. అన్యాయం, అరాచకం, నియంతృత్వం సమాజానికి ఎంత నష్టం చేస్తాయో, గంజాయి, డ్రగ్స్ వంటి మత్తుపదార్ధాలు కూడా అంతే నష్టాన్ని చేస్తాయన్నారు. నేడు డ్రగ్స్ అనేవి ప్రపంచానికే మహమ్మారిగా మారాయని, నేడు డ్రగ్స్‌పై దండయాత్ర ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకు రావాలన్నారు. మహిళా పోలీసులు నేడు 510 కిలోమీటర్ల యాత్ర ద్వారా ప్రజల్లో మార్పు తెస్తున్నారన్నారు.

ఎంపి కేశినేని శివనాథ్ మాట్లాడుతూ మహిళా పోలీసులు ఈ చైతన్య కార్యక్రమంలో కీలకంగా వ్యవహరించడం విశేషం.మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి, రవాణాను నియంత్రించండి అని తెలిపారు. సిపి రాజశేఖరబాబు మాట్లాడుతూ డ్రగ్స్‌కు బానిసలుగా మారి నేడు చాలా మంది యువత జీవితాలను నాశనం చేసుకుంటున్నామన్నారు. సిఎం చంద్రబాబు, డిజిపి హరీష్‌కుమార్ గుప్తా నేతృత్వంలో అనేక కార్యక్రమాలు చేపట్టామన్నారు. సమాజంలో మార్పు తెచ్చే డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండేలా ప్రజల్లో మార్పు తెచ్చేలా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఇప్పటికే డ్రగ్స్ రవాణా చేసేవారిని ఎన్‌డిపిఎస్ కింద అనేక మందిని జైలుకు పంపిచామన్నారు. ప్రతి ఒక్కరూ డ్రగ్స్ రవాణాను నిర్మూలించేలా ప్రజలు సహకారం అందించాలన్నారు. మత్తు పదార్థాలు రవాణా చేసినా, సేవించినా, అమ్మినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మంచి సమాజం కోసం పోలీసులు చేస్తున్న ఈ కార్యక్రమంలో ప్రజలు భాగస్వామ్యం కావాలని తెలిపారు.

ఈగల్ డిజి ఆకె రవికృష్ణ మాట్లాడుతూ డ్రగ్స్ సేవించకుండా చైతన్యం తీసుకువచ్చేందుకు ఈ కార్యక్రమం చేపట్టాం అన్నారు. మత్తు పదార్థాల వల్ల అనేక మంది జీవితాలు నాశనం అయ్యాయని, వారు ఆ మత్తులో ఏం చేస్తారో, ఎలా వ్యవహరిస్తారో కూడా తెలియని పరిస్థితి భారతదేశానికి డ్రగ్స్ పంపించి దేశాన్ని నాశనం చేయడానికి కుట్రలు జరుగుతున్నాయన్నారు. ఇలాంటి విషయాలు చాలా మందికి తెలియక డ్రగ్స్‌ను కొనుగోలు చేస్తున్నారన్నారు. దేశానికి, దేహానికి హాని కల్గించే ఈ డ్రగ్స్‌ను అందరూ కలిసికట్టుగా తరిమికొట్టాలన్నారు.

జిల్లా కలెక్టర్ లక్ష్మీశా మాట్లాడుతూ డ్రగ్స్, గంజాయి రవాణాపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపిందని ముఖ్యంగా యువత కోసమే ఇటువంటి అవగాహనా కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఇతర రాష్ట్రాల నుండి కూడ గంజాయి రవాణా అవుతున్నట్లు పోలీసులు గుర్తించారని, వంద శాతం రవాణాను నిరోధించేలా పోలీసులు యజ్ఞంలా పని చేస్తున్నారని తెలిపారు.

కార్యక్రమంలో ఎంఎల్‌ఎ గద్దె రామ్మోహన్, డాక్టర్ జి.సమరం, డిసిపిలు కృష్ణకాంత్ పటేల్, షిరీన్ బేగం, కెజివి సరిత, బి.లక్ష్మీనారాయణ, ఎబిటిఎల్ ఉదయరాణి, ఎస్‌విడి ప్రసాద్, ఎడిసిపిలు, ఎసిపిలు, సిఐలు, సిబ్బంది, సుమారు 10వేల మంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.




# నెల్లూరులో యువగళం జన ప్రభంజనం

## విఆర్‌సి నుండి గాంధీ బొమ్మ వరకు భారీ విజయోత్సవ ర్యాలీ

నెల్లూరు, జనవరి 27 ప్రభాతవార్త -వైద్యం: రాజకీయాల్లో వ్యూహకర్తగా, అభివృద్ధిలో అపర భగీరథుడిగా పేరుగాంచిన మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ సత్తా ఏంటో నెల్లూరు నగరం మరోసారి కళ్లారా చూసింది. యువనేత నారా లోకేష్ చారిత్రాత్మక యువగళం పాదయాత్ర నేటికి మూడేళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా నెల్లూరు సిటీలో నిర్వహించిన విజయోత్సవ ర్యాలీ ఒక మహా ప్రవాహంలా సాగింది. నెల్లూరు వీధులన్నీ పసుపుమయమయ్యాయి. విఆర్‌సి సెంటర్ నుండి గాంధీ బొమ్మ వరకు బారులు తీరారు. ఈ ర్యాలీలో కార్యకర్తలు "సింహపురి సింహం నారాయణ" అంటూ నినదిస్తూ, ఆయన వెంటే తామంతా ఉంటామని ఎలుగెత్తి చాటిచెప్పారు. ఈ సందర్భంగా నెల్లూరు నగర ఇంచార్జి మేయర్ రూప్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ, 2023 జనవరి 27న కుప్పంలో ప్రారంభమైన ఈ పాదయాత్ర రాష్ట్ర రాజకీయాల్లో పెను మార్పులు తీసుకువచ్చిందని, 426 రోజుల పాటు 97 నియోజకవర్గాల్లో లోకేష్ సాగించిన ప్రయాణం ప్రజా సమస్యల పరిష్కారానికి వేదికగా నిలిచిందని కొనియాడారు. మంత్రి పొంగూరు నారాయణ ఆదేశాల మేరకు నెల్లూరులో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని, ముఖ్యంగా రూ.200 కోట్లతో మున్సిపల్ పాఠశాలలను అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దడం, మైనారిటీ విద్యార్థుల కోసం కార్పొరేట్ స్థాయిలో పాఠశాల నిర్మాణం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. లోకేష్ బాబు స్ఫూర్తితో కార్యకర్తల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని, రాబోయే రోజుల్లో నెల్లూరును ఆదర్శ నగరంగా తీర్చిదిద్దుతామని రూప్‌కుమార్ యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నగర పార్టీ అధ్యక్షులు మామిడాల మధు, కార్పొరేటర్లు, స్థానిక టిడిపి ముఖ్య నేతలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమంగా గ్రావెల్ తరలింపు

- అడ్డుకున్న మైనింగ్, రెవెన్యూ అధికారులు
- మూడు టిప్పర్లు సీజ్



దగదర్తి (నెల్లూరు), జనవరి 27 ప్రభాతవార్త: గతంలో పలుమార్లు అక్రమ గ్రావెల్ తరలింపుపై మైనింగ్, రెవెన్యూ అధికారులు హెచ్చరించి కేసులు నమోదు చేసిన గ్రావెల్ దోపిడి ఆగడం లేదు. దగదర్తి మండలంలోని తిరువీధిపాడు గ్రామ రెవెన్యూలో మోపూరు భక్తవత్సలరెడ్డి కి సర్వే నెంబరు 118లో సుమారు 105 ఎకరాల పట్టా భూమి ఉంది. గత రెండు రోజులుగా తన సొంత భూమిలో కొందరు వ్యక్తులు రాత్రులు, పగలు బరితెగించి అక్రమంగా వాహనాలతో గ్రావెల్ తరలిస్తున్నారని రైతు భక్తవత్సలరెడ్డి మంగళవారం రెవెన్యూ, మైనింగ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో మైనింగ్ ఏడీ వాణిశ్రీ, మండల ఆర్‌ఐ ప్రియాంక, వీఆర్వో నరేష్‌లతో కలిసి మైనింగ్ ప్రదేశానికి వెళ్లి గ్రావెల్ అక్రమ తరలింపును అడ్డుకున్నారు. సంఘటన స్థలంలో ఉన్న మూడు టిప్పర్లను సీజ్ చేసి స్థానిక పోలీసు స్టేషన్లో అప్పగిస్తున్నట్లు మైనింగ్ ఏడీ తెలిపారు. అధికార పార్టీ నాయకుల అండతోనే తమ భూమిలో గ్రావెల్ అక్రమంగా తరలిస్తు న్నారని రైతు భక్తవత్సల రెడ్డి చెబుతున్నారు. అధికారులు తగిన విచారణ జరిపి అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న వ్యక్తులపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రైతు కోరుతున్నారు.

# అత్యవసర సమయాల్లో ఎంత చురుగ్గా స్పందిస్తే అంతగా ప్రయోజనం

**ఎపిఎస్‌డిఎంఎ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకట్ దీపక్**

విజయవాడ, జనవరి 27 ప్రభాతవార్త ప్రతినిధి: అత్యవరసర సమయాల్లో ఎంత చురుగ్గా స్పందిస్తే అంతగా ప్రయోజనం ఉంటుందని ఏపీఎస్డీఎంఎ ఎగ్జిగ్యూటివ్ డైరెక్టర్ వెంకట్ దీపక్ తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ కార్యాలయాన్ని మంగళగిరి ఎయిమ్స్ నర్సింగ్ ఫైనల్ ఇయర్ విద్యార్థులు మంగళవారం సందర్శించారు. కేంద్ర ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ డిజాస్టర్ మేనేజ్మెంట్ సెల్ దేశవ్యాప్తంగా "ఆరోగ్య అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రి సంసిద్ధత"పై సామర్థ్య శిక్షణ పెంపుదల్లో భాగంగా విపత్తుల నిర్వహణ సంస్థ ఎమర్జన్సీ ఆపరేషన్ సెంటర్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఏపిఎస్డీఎంఎ ఎగ్జిగ్యూటివ్ డైరెక్టర్ వెంకట్ దీపక్ మాట్లాడుతూ ఎమర్జెన్సీ పరిస్థితుల్లో హాస్పిటల్స్, డాక్టర్లు, నర్సులు విపత్తుల ప్రమాద తగ్గింపునకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ప్రతి నర్సింగ్ విద్యార్థి విపత్తు స్వచ్ఛంద సేవకులుగా నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తద్వారా భారీ ప్రమాదాలు, విపత్తులు, కోవిడ్19 వంటి ఇతర మాస్ క్యాజువాలిటీ సంభవించినపుడు వెంటనే స్పందించి ప్రాణ నష్టాన్ని వీలైనంత తగ్గించగలమన్నారు. ఇందులో విపత్తు నిర్వహణకు సంబంధించి హాస్పిటల్ ప్రణాళిక, హాస్పిటల్స్ ముందస్తు సంరక్షణ చర్యలు, అగ్నిప్రమాదాలు, ఇతర విపత్తుల సంసిద్ధత, ప్రతిస్పందన, ముందస్తు పరికరాల అవసరాలను వివరించారు. అత్యవసర సమయాల్లో అనుసరించాలని విధానాలపై నిరంతరం అధ్యయనం,అవగాహన అవసరమన్నారు. ఆయా ఘటనల అనంతర పరిస్థితులను పరిశీలించడం వలను మరింత సృజనాత్మకంశాలు స్ఫూరిస్తాయన్నారు. స్టేట్ ఎమర్జన్సీ ఆపరేషన్ సెంటర్లో రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ అమలు చేసే ప్రణాళికలు, ఎమర్జన్సీ రెస్పాన్స్ గురించి ప్రాజెక్టు మేనేజర్లు బస్వంత్, సతీష్ తెలిపారు. జిఐఎస్‌లో హాస్పిటల్స్ మ్యాపింగ్, అందుబాటులో ఉన్న అంబులెన్స్ వివరాలు, డెసిషన్ రెస్పాన్స్ వంటి ఇతర సమాచారాన్ని జిఐఎస్ ఎక్స్పర్ట్ హరీష్ వారికి తెలియజేశారు.



# దుర్గమ్మవారి సేవలో కేంద్ర మంత్రి శోభా కరంద్లాజే

ఇంద్రకీలాద్రి, జనవరి 27 ప్రభాతవార్త: దుర్గమ్మవారిని మంగళవారం కేంద్ర మంత్రి శోభా కరంద్లాజే, ఏపి, తెలంగాణ ఇన్‌కంటాక్స్ ఛీఫ్ కమీషనర్ ఎం.అనిల్ కుమార్ దర్శించుకున్నారు. వారికి దుర్గమ్మవారి దర్శనం ఏర్పాటు చేసిన అనంతరం దాతలకు దుర్గమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు. దుర్గమ్మవారి ఆలయంలో జరిగే నిత్యాన్నదాన పథకానికి రు.1లక్ష విరాళాన్ని మంగళగిరి కృష్ణాయపాలెంకు చెందిన ఎన్ రమేష్ చౌదరి, పుష్పకుమారి దంపతులు మంగళ వారం అందించారు. సంగారెడ్డికి చెందిన సంపంగి మాధురి, కుటుంబసభ్యులు రు.1లక్ష విరాళం అందించారు. దాతలకు దుర్గమ్మవారి దర్శనం ఏర్పాటు చేసిన అనంతరం దాతలకు దుర్గమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

# జగజ్జనని ఆశీస్సులు రాష్ట్రాభివృద్ధిపై వుండాలి: ఎంపీ కేశినేని



విజయవాడ, జనవరి 27, ప్రభాతవార్త: కృష్ణ పుష్కరాల నాటికి ఇంద్రకీలాద్రిపై సకల సౌకర్యాలు సమకూర్చేందుకు కృషి రానున్న కేంద్ర బడ్జెట్ సమావేశాలలో రాష్ట్రానికి మేలు జరగాలని, నిధుల కేటాయింపు ఎక్కువగా జరగాలని, రాష్ట్రాభివృద్ధిపై ఆ జగజ్జనని అనుగ్రహం, ఆశీస్సులు వుండాలని ప్రార్ధించినట్లు కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్న ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) తెలిపారు. ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారిని మంగళవారం ఎంపీ కేశినేని శివనాథ్ తన తల్లి ప్రసునాంబ, భార్య జానకి లక్ష్మీతో కలిసి కుటుంబ సమేతంగా దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన ఎంపీ కేశినేని శివనాథ్‌తో పాటు కుటుంబ సభ్యులకు ఆలయమర్యాదలతో వేద పండితులు, ఆలయ అధికారులు, ఆలయ బోర్డ్ సభ్యులు ఘన స్వాగతం పలికారు. దర్శనానంతరం ఎంపి కేశినేని శివనాథ్ కుటుంబ సభ్యులను వేద పండితులు ఆశీర్వదించి అమ్మవారి తీర్థ ప్రసాదాలు, అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. ఆ క్రమంలో ఎంపీ కేశినేని శివనాథ్ మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఇంద్రకీలాద్రిపై అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు వసతుల కల్పనకు తన వంతు కృషి చేస్తానన్నారు. రాబోయే కృష్ణ పుష్కరాల నాటికి ఇంద్రకీలాద్రిపై సకల సౌకర్యాలు సమకూరతాయన్నారు. ఇంద్రకీలాద్రి ఆలయం మరింతగా అభివృద్ధి చెందేలా ప్రభుత్వం కార్యాచరణ రూపొందించిందని తెలిపారు. రాష్ట్రంతో పాటు దేశం సుభిక్షంగా వుండటంతో పాటు అభివృద్ధి చెందాలని అమ్మవారిని మనస్ఫూర్తిగా కోరుకోవటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానం బోర్డు మెంబర్స్ బడేటి ధర్మారావు, సుఖాసి సరిత, మన్నె కళావతి, ఠాగూర్ పద్మావతి, ప్రత్యేక ఆహ్వానితులు వెలగపూడి శంకర్ బాబు, టి.ఎన్.టి.యు.సి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పరుచూరి ప్రసాద్, రాష్ట్ర నగరాల కార్పొరేషన్ డైరెక్టర్ సుఖాసి కిరణ్, టి.ఎన్.ఎస్.ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చరణ్ సాయి యాదవ్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బి.వి.వి వెంకట రెడ్డి, ఆలయ సూపరింటెండెంట్ కె.శ్రీనివాసరావు (చందు) తదితరులు పాల్గొన్నారు.




# బ్యాంకుల్లో ఐదు రోజుల పని దినం

## - అనంత వీధుల్లో బ్యాంకు ఉద్యోగుల ర్యాలీ

అనంతపురం, జనవరి 27 ప్రభాతవార్త బ్యూరో: బ్యాంకుల్లో పని ఒత్తిడి వల్ల తీవ్ర ఇబ్బందికి గురవుతున్నామని, గతంలో చేసుకున్న ఒప్పందం మేరకు తమకు ఐదు రోజుల పని దినాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ యుఎఫ్‌బియు పిలుపుమేరకు అనంతపురంలో మంగళవారం బ్యాంకు ఉద్యోగులు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. వివిధ బ్యాంకు ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో వందలాదిమంది అనంతపురం వీధుల్లో ర్యాలీ నిర్వహించి తమ నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యుటిబియు పిలుపు మేరకు దేశ వ్యాప్తంగా 8 లక్షల మంది బాయంక్ ఉద్యోగస్తులు సమ్మెలో పాల్గొన్నారు. అనంతపురం జిల్లా యుఎఫ్‌బియు ఆధ్వర్యంలో స్థానిక ఇండియన్ బాయంక్ మైన్‌బ్రాంచ్ వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే ఇండియన్ బ్యాంక్ నుంచి క్లాక్ టవర్ వరకు 500 మంది బ్యాంక్ ఉద్యోగస్తులు ర్యాలీగా వెళ్లి క్లర్క్ వద్ద మానవ హారాన్ని ఏర్పాటు చేసి 25 నిమిషాల పాటు తిరిగి 5 రోజుల పనిదినాల కొరకు నినాదాలు చేశారు. తిరిగి ఇండియన్ బ్యాంక్ వద్దకు చేరుకోవడం జరిగింది. ఇండియన్ బ్యాంక్ వద్ద సభను ఉద్దేశించి బ్యాంకు ఎంప్లాయిస్ కోఆర్డినేషన్ ప్రెసిడెంట్ కె.శంకర్ మాట్లాడుతూ.. గత 10 సంవత్సరాలు క్రిందట బ్యాంకు యూనియన్లకు ఐబిఎ మధ్య చర్చలలో 5-డే బ్యాంకింగ్ పట్ల ఒప్పందం కుదిరింది. క్లియరెన్స్ కొరకు కేంద్ర ప్రభుత్వానికి, ఆర్‌బిఐకు నివేదించడం జరిగింది. కాని 10 సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వం బ్యాంక్ ఉద్యోగస్తుల పట్ల వ్యతిరేక దృక్పథంతో నడుస్తోంది అని, తమ వాదనను పట్టించుకోవడం లేదని, రాబోయే రోజుల్లో ఈ ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకెళ్తామని తెలియజేశారు. ఎస్‌బిఐ ఎన్‌సిబిఇ లీడర్ ఖాదర్‌బాషా మాట్లాడుతూ.. ఇప్పుడున్న పరిస్థితుల్లో 5 డే బ్యాంకింగ్ అనివార్యం అని, ఇతర ఫైనాన్షియల్ సెక్టార్ అయిన ఆర్‌బిఐ, ఎస్ఈడిఐ, ఐఆర్‌డిఏ, ఎల్‌ఐసి, జిఐసి, ఎన్‌పిఎస్ ఆర్థిక సంస్థలన్ని 5 రోజులు పని దినాలు కలిగి ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలో బ్యాంకింగ్ రంగాన్ని ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎఐబిఓసి, ఎజిఎస్ చంద్రమోహన్ మాట్లాడుతూ.. బ్యాంకులు రైతులకు సాధారణ ప్రజానికానికి ప్రభుత్వ రంగ బ్యాంకులు అనేక రకాల సేవలు అందిస్తున్నాయని, కాని బ్యాంకు ఉద్యోగస్తులనువారి బాధలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని తెలిపారు. బ్యాంకు ఉద్యోగుల కో-ఆర్డినేషన్ సెక్రెటరీ సంజయ్‌రామ్ మాట్లాడుతూ.. బ్యాంకింగ్ రంగంలో గత పది సంవత్సరాలుగా టెక్నాలజీ చాలా అభివృద్ధి చెందిందని, బ్యాంకుల 5 డేస్ వర్కింగ్ వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఉండదని, ముఖ్యంగా బ్యాంకుల్లో నగదుకు సంబంధించి ఎటిఎం, డిపోసిట్ మిషన్‌లు అందుబాటులో ఉన్నాయని మొబైల్ ద్వారా, పేటిఎం, ఫోన్‌పే, ఇంటర్‌నెట్ బ్యాంకింగ్ మొదలగు సేవలు ద్వారా ప్రజలకు ప్రయోజనాలు కలిగి ఉన్నారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అనంతపురం జిల్లా నుంచి దాదాపు500 మంది బ్యాంకు ఉద్యోగులు పాల్గొన్నారు. ముఖ్యంగా అధిక ఒత్తిడి కలిగిన స్కేల్-4, స్కేల్-3 ఉద్యోగులు పాల్గొనడం జరిగింది. అదే విధంగా వివిధ బ్యాంకు సంఘాల నాయకులు సునిత, రవితేజ, చంద్రశేఖర్, రేణుక, లోహిత్, నాగేంద్ర, సిఐటియు అరవింద్,చంద్రమౌళి, నవీన్, మురళీ, వహీద్, హనుమేష్, సతీష్,మల్లికార్జున, రమణరాజు, శివారెడ్డి, ఖైమన్ని బేగం, ఖైరునా, మధుబాబు, రవీంద్రనాయక్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

ఆట



# ఆస్ట్రేలియన్ ఓపెన్ సెమీఫైనల్‌కు అల్కరాజ్

**న్యూఢిల్లీ:** ఆస్ట్రేలియన్ ఓపెన్-2026లో డి మినార్‌ను ఓడించి కార్లోస్ అల్కరాజ్ తొలిసారిగా విజయం సాధించి సెమీఫైనల్‌కు చేరుకున్నాడు రాడ్ లావర్ అరీనాలో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో స్పానిష్ ప్రపంచ నంబర్ వన్ ఆటగాడు, తన హోమ్ హోప్ అలెక్స్ డి మినార్‌ను 7-5, 6-2, 6-1 తేడాతో ఓడించాడు. 22 ఏళ్ల టాప్ సీడ్ అల్కరాజ్ ఆస్ట్రేలియన్ ఆరో సీడ్ తో పోటీలో దూసుకుపోయాడు. అతను అన్ని గ్రాండ్ స్లామ్ లలో చివరి ఎనిమిది స్థానాలకు చేరుకున్నాడు. తొలి సెట్‌లో ఆరుసార్లు మేజర్ ఛాంపియన్ అయిన అల్కరాజ్ 3-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లాడు. కానీ డి మినార్ వరుసగా మూడు ఆటలను 3-3తో ముగించాడు. అయితే వ్యూహాత్మకంగా ఆడిన అల్కరాజ్ 5-3 ఆధిక్యాన్ని సాధించినా, ఆ తర్వాత సెట్‌ను ముగించే అవకాశాన్ని వృధా చేసుకుని విఫలమయ్యాడు. తరువాతి రెండు గేమ్‌లను గెలిచి సెట్‌ను కైవసం చేసుకోవడానికి అల్కరాజ్ తీవ్రతను పెంచినప్పుడు 5-5తో సమంగా ఉన్నారు. డి మినార్ తన అవకాశాలను సద్వినియోగం చేసుకోలేకపోవడంతో అల్కరాజ్ 44 నిమిషాల్లో రెండవ సెట్‌ను చేజిక్కించుకున్నాడు. అదే ఊపుతో మూడో సెట్‌లో అతను 20 నిమిషాల కంటే తక్కువ సమయంలోనే 3-0 ఆధిక్యాన్ని సాధించి, తన ఐదవ ఏస్‌తో ఆధిక్యాన్ని సాధించాడు. అంతకుముందు జర్మన్ మూడో సీడ్ జ్వెరెవ్ అమెరికాకు చెందిన లెర్నర్ టియెన్‌పై 6-3, 6-7 (5/7), 6-1, 7-6 (7/3) తేడాతో 24 ఏస్‌లు సంధించి తన చివరి నాలుగు స్థానాన్ని బుక్ చేసుకున్నాడు.



## వరల్డ్ టెన్నిస్ జూ. సింగిల్స్‌లో సృష్టికి టైటిల్



**న్యూఢిల్లీ:** వరల్డ్ టెన్నిస్ టూర్ జూనియర్స్ టోర్నమెంట్‌లో కమాండింగ్, అద్భుతమైన ప్రదర్శనతో భారత్ టెన్నిస్ స్టార్ సృష్టి కిరణ్ వరుసగా నాలుగో ఐటిఎఫ్ జూనియర్ సింగిల్స్ టైటిల్‌ను గెలుచుకుంది. మెక్సికోలో జరిగిన ఈ ఫైనల్స్‌లో సృష్టి కెనడాకు చెందిన నటాలీ సత్సలాష్విలిపై 6-4, 6-1 తేడాతో వరుస సెట్లలో గెలిచింది. అంతకు ముందు సెమీఫైనల్లో 21 సింగిల్స్ మ్యాచ్‌ల విజయాలు సాధించిన యుఎస్‌ఎకు చెందిన నటాలియా ఎలెనా మార్టినెజ్‌తో జరిగిన మ్యాచ్‌లో సృష్టి రెండవ సెట్‌ను కోల్పోయిన తర్వాత పుంజుకుని 7-5, 1-6, 7-5 తేడాతో విజయం సాధించింది. అలాగే డబుల్స్‌లో సృష్టి మెక్సికోకు చెందిన తమరా హెర్మన్‌తో కలిసి టాప్ సీడ్ జోడీగా నిలిచి రన్నరప్‌గా నిలిచింది. ఈ జంట అమెరికా జంట క్రిస్టినా లి-నటాలియా ఎలెనా మార్టినెజ్ చేతిలో 2-6, 6-4, 6-10 తేడాతో మ్యాచ్ టైబ్రేక్‌లో ఓడిపోయి ఆల్ రౌండ్ వారాన్ని ముగించింది.

## రంజీ ట్రోఫీ: ఛాంపియన్‌గా బీహార్

### 568 భారీ రన్స్ తేడాతో మణిపూర్

**న్యూఢిల్లీ:** రంజీ ట్రోఫీ ప్లేట్ డివిజన్ 2025-26 ఫైనల్లో బీహార్ జట్టు మణిపూర్‌ను 568 పరుగుల భారీ తేడాతో ఓడించి, టైటిల్‌ను గెలుచుకుని ఛాంపియన్‌గా నిలిచింది. మొదట బ్యాటింగ్ చేసిన బీహార్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 522 పరుగుల భారీ స్కోరు చేసింది. వికెట్ కీపర్ బ్యాటర్ బిపిన్ సౌరభ్ 143 పరుగులు సాధించగా, కెప్టెన్ సకిబుల్ గని 108 పరుగులు చేశాడు. సూరజ్ కశ్యప్ కూడా 83 పరుగులు చేసి బీహార్ భారీ స్కోరు సాధించడంలో సహాయపడ్డాడు. మణిపూర్ బౌలర్లలో రెక్స్ రాజ్ కుమార్ 4 వికెట్లతో రాణించగా, ఫిరోయిజామ్ జోతిన్, బిశ్వోర్జిత్ కొంథౌజామ్ తలా 2 వికెట్లు పడగొట్టారు. తదుపరి 523 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో మణిపూర్ తొలి ఇన్నింగ్స్‌లో 264 పరుగులకు ఆలౌట్ అయింది. రోనాల్డ్ లాంగ్‌జామ్ 79 పరుగులతో అత్యధిక స్కోరు సాధించాడు. కానీ మిగిలిన బ్యాటింగ్ లైనప్ నుండి అతనికి మద్దతు లభించలేదు. సూరజ్ కశ్యప్ 3/34తో ముగించగా, ప్రశాంత్ సింగ్ మరియు హిమాన్షు సింగ్ తలా 2 వికెట్లు పడగొట్టారు. తొలి ఇన్నింగ్స్‌లో 258 పరుగుల ఆధిక్యంతో, బీహార్ రెండో ఇన్నింగ్స్‌లో పోటీపై పట్టు బిగించింది. ఓపెనర్ పియూష్ సింగ్ అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు, 322 బంతుల్లో 216 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు, ఇన్నింగ్స్‌ను ఆకట్టుకున్నాడు. రఘువేంద్ర ప్రతాప్ సింగ్ 90 పరుగులు చేయగా, ఖలీద్ ఆలం 81 పరుగులు జోడించి అతనికి మంచి మద్దతు ఇచ్చాడు. బీహార్ తన రెండో ఇన్నింగ్స్‌ను ఆరు వికెట్లకు 505 పరుగుల వద్ద డిక్లేర్ చేయడంతో మణిపూర్‌కు 764 పరుగుల కష్టతరమైన లక్ష్యాన్ని నిర్దేశించింది. భారీ స్కోరును ఛేదించే క్రమంలో మణిపూర్ రెండో ఇన్నింగ్స్‌లో 195 పరుగులకే ఆలౌట్ అయింది. ఫిరోయిజామ్ జోతిన్ 74 పరుగులతో పోరాట పటిమను ప్రదర్శించగా, ఎల్. కిషన్ సింఘా 30 పరుగులు చేశాడు. అయితే, సూరజ్ కశ్యప్ 32 పరుగులకు మూడు వికెట్లు పడగొట్టడంతో బీహార్ బౌలర్లు మరోసారి మ్యాచ్‌లో ఆధిపత్యం చెలాయించారు. హిమాన్షు సింగ్ కూడా మూడు వికెట్లు తీసి ఆకట్టుకున్నాడు, మణిపూర్ 57 ఓవర్లలోనే కుప్పకూలింది. ఇటీవల విజయ్ హజారే ట్రోఫీలో బీహార్ మంచి ప్రదర్శన చేసింది, ప్లేట్ గ్రూప్ ఫైనల్‌లో మణిపూర్‌ను ఓడించి ఎలైట్ గ్రూప్‌కి పదోన్నతి పొందింది.




## పంజాబ్ విజయం

### ప్రో రెజ్లింగ్ లీగ్‌లో 5-4 తేడాతో మహారాష్ట్ర ఓటమి

**న్యూఢిల్లీ:** ప్రో రెజ్లింగ్ లీగ్-2026లో మహారాష్ట్ర కేసరిపై పంజాబ్ రాయల్స్ కీలక విజయాన్ని నమోదు చేసింది. ప్రో రెజ్లింగ్ లీగ్ 2026 మ్యాచ్ 12లో పంజాబ్ రాయల్స్‌పై 4-5 తేడాతో మహారాష్ట్ర గెలుపొందింది. పంజాబ్ తొలి అర్ధభాగంలో ఆధిపత్యం చెలాయించడంతో 4-1 ఆధిక్యంలోకి వెళ్లిన తర్వాత మహారాష్ట్ర 6, 7 బౌట్స్‌లో బలమైన పోరాట పటిమను ప్రదర్శించి పోటీని సజీవంగా ఉంచింది. ఈ ఫలితంతో మహారాష్ట్ర 4 మ్యాచ్‌ల్లో 3 విజయాలతో, ఆరు పాయింట్లు, 23 బౌట్‌లతో ప్రచారాన్ని ముగించింది. పంజాబ్ 4 మ్యాచ్‌ల్లో ఆరు పాయింట్లు, 18 బౌట్‌ల విజయాలతో మూడవ స్థానానికి చేరుకుంది. పారిస్ ఒలింపిక్ రజత పతక విజేత గుజ్మాన్ లోపెజ్ యుస్నీలిస్‌పై మీనాక్షి ద్వారా పంజాబ్ ప్రారంభ 53 కిలోల మహిళల పోటీలో 6-0 తేడాతో క్లీన్ విజయాన్ని అందించింది. 74 కిలోల పురుషుల పోటీలో ఆసియా రెజ్లింగ్ ఛాంపియన్ చంద్రమోహన్ నిరంతర దాడులతో యష్‌ను ఓడించాడు. మొదటి, రెండు పీరియడ్‌లలో చంద్రమోహన్ పదే పదే టేక్‌డౌన్‌లు, టర్న్‌లతో విజృంభించి 18-0 టెక్నికల్ సుపీరియారిటీ విజయాన్ని నమోదు చేశాడు. 76 కిలోల మహిళల టైలో పంజాబ్‌కు చెందిన ప్రియా ప్రారంభంలోనే గోల్ చేసి పంజాబ్‌ను 3-1తో ఆధిక్యంలోకి నెట్టింది. 86 కిలోల పురుషుల బౌట్‌లో అమిత్, సందీప్ మాన్ ఉత్కంఠభరితమైన పోరాటం జరిగింది. సందీప్ టేక్‌డౌన్, పుష్‌అవుట్‌తో 8-7 తేడాతో స్వల్ప విజయాన్ని సాధించి పంజాబ్ ఆధిక్యాన్ని సంపాదించింది.

# నేడే నాలుగో టి20

### పరువు కోసం న్యూజిలాండ్ పట్టు.. ఇప్పటికే టీమిండియా సిరీస్ కైవసం

**న్యూఢిల్లీ:** న్యూజిలాండ్‌తో ఐదు టీ20ల సిరీస్‌ను మరో 2 మ్యాచ్‌లు మిగిలి ఉండగానే కైవసం చేసుకున్న టీమిండియా మరో పోరుకు సిద్ధమైంది. మ్యాచ్ గెలిచి ఓటమితో పోయిన పరువును నిలబెట్టుకోవాలని న్యూజిలాండ్ పట్టుదలతో ఉంది. ఈ నెల 28, బుధవారం విశాఖపట్నం వేదికగా జరగనున్న నాలుగో టీ20లో న్యూజిలాండ్‌తో భారత్ తలపడనుంది. ఇప్పటికే సిరీస్ దక్కించుకోవడంతో ఆఖరి రెండు మ్యాచ్‌ల్లో బెంచ్ ఆటగాళ్లను పరీక్షి ంచే అవకాశం ఉంది. ఈ క్రమంలోనే తుది జట్టులో ఎవరిపై వేటు పడుతుంది, ఎవరికి అవకాశం దక్కుతుందనేది ఆసక్తికరంగా మారింది. గౌహతి వేదికగా జరిగిన మూడో టీ20లో 3 వికెట్లతో భారత విజయంలో కీలక పాత్ర పోషించిన జస్‌ప్రీత్ బుమ్రాకు విశాఖ మ్యాచ్‌కు విశ్రాంతి ఇచ్చే అవకాశం ఉంది. మెగా టోర్నీకి ముందు వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా బుమ్రాను ఈ మ్యాచ్ నుంచి పక్కనపెట్టనున్నారు. అతని స్థానంలో అర్ష్‌దీప్ సింగ్ బరిలోకి దిగనున్నాడు. బుమ్రాను కొనసాగించాలనుకుంటే హర్షిత్ రాణాపై వేటు పడుతుంది. మూడో టీ20కి దూరంగా ఉంచిన వరుణ్ చక్రవర్తి బరిలోకి దిగితే రవి బిష్ణోయ్ ఉద్వాసనకు గురవుతాడు. అయితే మూడో టీ20లో బిష్ణోయ్ 2 వికెట్లతో సత్తా చాటాడు. వాషింగ్టన్ సుందర్ గాయపడిన నేపథ్యంలో బిష్ణోయ్‌ను అతనికి బ్యాకప్‌గా సిద్ధం చేయాలనుకుంటుంది. ఈ క్రమంలోనే నాలుగో టీ20లోనూ అతన్ని కొనసాగించే అవకాశం ఉంది. అవసరమైతే వరుణ్ చక్రవర్తి, కుల్దీప్ యాదవ్‌లో ఒకరికి విశ్రాంతి ఇచ్చి మరీ బిష్ణోయ్‌ను బరిలోకి దించవచ్చు. ఇక వరుసగా మూడు టీ20ల్లో విఫలమైన సంజూ శాంసన్‌ను ఆఖరి అవకాశంగా నాలుగో టీ20లో ఆడించవచ్చు. అదే జరిగితే శ్రేయస్ అయ్యర్‌కు మరోసారి నిరాశే ఎదురు కానుంది. చివరి రెండు టీ20 మ్యాచ్‌లకు తిలక్ వర్మ దూరమవ్వడంతో అయ్యర్‌ను జట్టులో కొనసాగించారు. తిలక్ వర్మకు బ్యాకప్‌గా అయ్యర్‌ను రెడీ చేయాలనుకుంటే నాలుగో టీ20లో అతను ఆడవచ్చు. అప్పుడు సంజూ శాంసన్ లేదా ఇషాన్ కిషన్‌లో ఒకర్ని తప్పించవచ్చు. అవసరమైతే అభిషేక్ శర్మకు రెస్ట్ ఇవ్వవచ్చు. సిరీస్ గెలిచిన నేపథ్యంలో చివరి రెండు మ్యాచ్‌లను పూర్తిగా ప్రయోగాలకు వాడుకునే ఛాన్స్ ఉంది. ఓపెనర్ అభిషేక్ శర్మ, కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ సూపర్ ఫామ్‌లో ఉన్నారు. రింకూ సింగ్, శివమ్ దూబే, హార్దిక్ పాండ్యాకు వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకున్నారు. బ్యాటింగ్ ప్రాక్టీస్ కోసం ఆర్డర్‌లో మార్పులు చేయవచ్చు.





# రికవరీ అవుతున్న భారత్ రూపాయి




**ముంబయి,జనవరి 27:** ప్రపంచ కరెన్సీ మార్కెట్లలో తీవ్ర ఒడిదొడుకులు కొనసాగుతున్నాయి. ప్రధాన కరెన్సీలతో పోలిస్తే అమెరికా డాలర్ బలహీనపడుతుండగా, భారత రూపాయి మాత్రం స్థిరంగా కొనసాగుతోంది. డాలర్ బలహీనత కారణంగా భారత్‌లోకి విదేశీ సంస్థాగత పెట్టుబడులు (ఎఫ్ఐఐ) పెరిగే అవకాశం ఉందని ఎమ్‌కే వెల్త్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ మంగళవారం విడుదల చేసిన నివేదికలో అంచనా వేసింది. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను మరింత తగ్గించవచ్చన్న అంచనాలు, అంతర్జాతీయ పరిణామాల కారణంగా డాలర్ విలువ పడిపోతోంది. ప్రస్తుతం డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ సుమారు రూ.90 వద్ద నిలకడగా ఉందని, స్వల్పకాలంలో ఇదే స్థాయిలో కన్సాలిడేట్ కావొచ్చని మార్కెట్ వర్గాలు భావిస్తున్నట్లు తెలిపింది. భారత్ నికర దిగుమతిదారుగా ఉండటం రూపాయిపై భారం మోపుతున్నప్పటికీ, విదేశీ పెట్టుబడులకు అవకాశాలు మెరుగుపడటం మద్దతుగా నిలుస్తుందని వివరించింది. గత 18 నెలలుగా భారత ఈక్విటీ మార్కెట్లలో విదేశీ సంస్థలు నికర అమ్మకందారులుగా ఉన్నాయి. దీంతో పలు రంగాల్లో షేర్ల విలువ ఆకర్షణీయంగా మారింది.

అమెరికాలో వడ్డీ రేట్లు తగ్గితే, డాలర్‌పై రాబడి తగ్గి, భారత్ వంటి వర్ధమాన మార్కెట్ల వైపు పెట్టుబడిదారులు మొగ్గు చూపే అవకాశం ఉందని విశ్లేషకులు అంటున్నారు. బలహీనపడిన డాలర్, వర్ధమాన మార్కెట్ల వైపు పెట్టుబడుల మళ్లింపు వంటివి అవకాశాలను, అదే సమయంలో నష్టభయాలను కూడా సృష్టిస్తున్నాయి. భారత్‌లో స్థిరమైన ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో విదేశీ పెట్టుబడులు కొనసాగితే, ప్రపంచ ఒడిదొడుకులు ఉన్నప్పటికీ రూపాయి ప్రస్తుత స్థాయిలోనే కొనసాగవచ్చని ఎమ్‌కే వెల్త్ మేనేజ్‌మెంట్ సేల్స్ హెడ్ పరాగ్ మోరే వివరించారు. 2025 ప్రారంభం నుంచి డాలర్ ఇండెక్స్ దాదాపు 9 శాతం పడిపోయి 98.60 వద్ద ఉంది. సముద్ర రవాణా మార్గాలకు అంతరాయాలు లేదా ముడిచమురు సరఫరాలో సమస్యలు తలెత్తితే స్వల్పకాలంలో డాలర్‌కు మళ్లీ డిమాండ్ పెరిగే ప్రమాదం ఉందని, కాబట్టి హెడ్జింగ్ వ్యూహాలు పాటించడం మంచిదని నివేదిక సూచించింది.




# ఉద్యోగాల్లో భారీ కోతపెడుతున్న అమెజాన్

**వాషింగ్టన్,జనవరి 27:** అమెజాన్ మరోసారి ఉద్యోగాల్లో భారీ కోత పెడుతోంది. 30 వేల మంది కార్పొరేట్ ఉద్యోగులను తొలగించే ప్లాన్‌లో భాగంగా, ఇప్పటికే మొదటి విడతలో సగం మందిని విధుల నుంచి తొలగించింది. మిగతా వారిని కూడా తొలగించేందుకు సిద్ధమవుతోంది. ఇది అమెజాన్ చరిత్రలోనే అతిపెద్ద ఉద్యోగ తగ్గింపు ప్రక్రియ. 2025 అక్టోబర్‌లో మొదటి దశలో సుమారు 14 వేల మంది కార్పొరేట్ ఉద్యోగులను తొలగించగా, రెండో దశలో కూడా అదే స్థాయిలో కోతలు ఉండే అవకాశం ఉంది.

ఈ కోతలు ప్రధానంగా అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఎడబ్ల్యుఎస్), రిటైల్ విభాగం, ప్రైమ్ వీడియో, పీపుల్ ఎక్స్‌పీరియన్స్ అండ్ టెక్నాలజీ (హెచ్‌ఆర్) విభాగాలను తీవ్రంగా ప్రభావితం చేయనున్నాయి. అమెజాన్ మొత్తం 15 లక్షల మంది ఉద్యోగుల్లో ఇది కేవలం 2 శాతం మాత్రమే అయినప్పటికీ, కార్పొరేట్ స్థాయిలో దాదాపు 10 శాతం ఉద్యోగాలు తగ్గుతాయి. గతంలో ఉద్యోగ కోతలకు లాభాలు తగ్గడం, ఖర్చులు పెరగడం, ఎఐవల్ల ఆటోమేషన్ వచ్చినట్లు కంపెనీలు చెప్పేవి. కానీ అమెజాన్ సిఇఒ ఆండీ జాస్సీ ఈసారి కొత్త కారణం చెప్పారు. కల్చర్ అంటే సంస్థలో ఏర్పడిన బ్యూరోక్రసీ, లేయర్లు పెరగడం, నిర్ణయాలు తీసుకోవడంలో ఆలస్యం జరగడం. ఉద్యోగులు పెరిగేకొద్దీ టీమ్‌లు పెరిగాయి, మేనేజర్లు మరో మేనేజర్లను నియమించుకున్నారు. ఒక్క నిర్ణయానికి అనేక అనుమతులు, సమీక్షలు, చర్చలు అవసరమవుతున్నాయి. బాధ్యత ఎవరిది అనేది స్పష్టంగా లేకుండా పోయింది. దీంతో కంపెనీ నెమ్మదిగా ముందుకు సాగుతోందని జాస్సీ భావిస్తున్నారు. అందుకే ఈ తొలగింపులను ఆర్థిక సమస్యగా కాకుండా సంస్థ నిర్మాణాన్ని సరిచేసే చర్యగా చూపిస్తున్నారు. ఎఐ పాత్ర లేదని పూర్తిగా చెప్పలేం.

గతంలోనే జాస్సీ ఎఐ వల్ల భవిష్యత్తులో కార్పొరేట్ ఉద్యోగాలు తగ్గుతాయని చెప్పారు. ఈసారి ప్రత్యక్ష కారణం ఎఐ కాకపోయినా, అది అమెజాన్ సామర్థ్య వ్యూహంలో భాగమే అని నిపుణులు అంటున్నారు. ముఖ్యమైన విషయం ఏమిటంటే ఈ కోతలు గోదాములు, డెలివరీ సిబ్బందిపై పడలేదు. కీలక సిబ్బంది, కార్పొరేట్ ఉద్యోగులపైనే పడుతోంది. అక్టోబర్‌లో తొలగించిన ఉద్యోగులకు 90 రోజుల జీతం సెవరెన్స్ ప్యాకేజీ ఇచ్చారు. ఆ సమయంలో కంపెనీలోనే మరో ఉద్యోగం చూసుకోవచ్చు లేదా బయట అవకాశాలు వెతుక్కోవచ్చని చెప్పారు.

## వాట్సాప్ ప్రైవసీపై అమెరికా కోర్టులో దావా



**శాన్‌ఫ్రాన్సిస్కో, జనవరి 27:** ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది వినియోగించే మెసేజింగ్ యాప్ వాట్సాప్ ప్రైవసీపై ఫిర్యాదులు పెరిగిపోయాయి. తమ సంభాషణలు ఎండ్‌టుఎండ్ ఎన్‌క్రిప్షన్‌తో అత్యంత సురక్షితమని భావిస్తున్న యూజర్లను కలవరపరిచేలా, వారి ప్రైవేట్ మెసేజ్‌లను మాతృ సంస్థ మెటా చదవగలదని ఆరోపిస్తూ అమెరికాలో ఒక దావా దాఖలైంది. ఈ పరిణామంతో ప్రముఖ మెసేజింగ్ యాప్‌ల భద్రతపై మరోసారి పెద్ద ఎత్తున చర్చ మొదలైంది. అమెరికాలోని శాన్ ఫ్రాన్సిస్కో కోర్టులో ఈ నెల 23న ఈ దావా దాఖలైంది. ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, మెక్సికో దేశాలకు చెందిన కొందరు యూజర్లు ఈ పిటిషన్ వేశారు. వారి ఆరోపణల ప్రకారం వాట్సాప్ ఎండ్‌టుఎండ్ ఎన్‌క్రిప్షన్ విధానం బూటకమని, మెటా ఉద్యోగులు అంతర్గత టూల్స్ ఉపయోగించి యూజర్ల చాట్స్‌ను యాక్సెస్ చేయగలరని వారు ఆరోపించారు. యూజర్ ఐడీ ఆధారంగా ఇంజినీర్ల అనుమతితో మెసేజ్‌లను దాదాపు రియల్ టైంలో చూడొచ్చని, చివరకు డిలీట్ చేసిన కంటెంట్‌ను కూడా వీక్షించగలరని ఆరోపణల్లో పేర్కొన్నారు. అయితే, ఈ ఆరోపణలకు మద్దతుగా పిటిషనర్లు ఎలాంటి సాంకేతిక ఆధారాలను కోర్టుకు సమర్పించలేదు. ఈ దావాను మెటా సంస్థ తీవ్రంగా ఖండించింది. ఇవి పూర్తిగా తప్పుడు, అసంబద్ధమైన ఆరోపణలని కొట్టిపారేసింది. వాట్సాప్ ఎండ్‌టు ఎండ్ ఎన్‌క్రిప్షన్ పకడ్బందీగా పనిచేస్తుందని, ఎన్‌క్రిప్షన్ కీలు కేవలం యూజర్ల డివైజ్‌లలోనే ఉంటాయని స్పష్టం చేసింది. అందువల్ల తాము గానీ, తమ ఉద్యోగులు గానీ మెసేజ్‌లను డీక్రిప్ట్ చేయడం లేదా చదవడం సాంకేతికంగా అసాధ్యమని మెటా పునరుద్ఘాటించింది. ఈ వివాదంలోకి టెస్లా అధినేత ఎలాన్ మస్క్ కూడా ప్రవేశించారు. వాట్సాప్ సురక్షితం కాదు అని సోషల్ మీడియాలో వ్యాఖ్యానించిన ఆయన, ఇతర ఎన్‌క్రిప్టెడ్ యాప్‌ల విశ్వసనీయతను కూడా ప్రశ్నించారు. దీనికి బదులుగా తమ ఎక్స్ చాట్ ఫీచర్‌ను ప్రయత్నించాలని యూజర్లకు సూచించారు.

## సెన్సెక్స్, నిఫ్టీలకు ఇండో యూరప్ ట్రేడ్ డీల్ సపోర్ట్

### లాభాల్లో ముగిసిన ఈక్విటీ మార్కెట్లు

**ముంబయి, జనవరి 27:** దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం నాడు లాభాలతో ముగిశాయి. రోజంతా తీవ్ర ఒడిదుడుకులకు లోనైనప్పటికీ, భారత్‌యూరోపియన్ యూనియన్ కూటమి(ఈయూ) మధ్య కీలక వాణిజ్య ఒప్పందం కుదరడంతో ఇన్వెస్టర్ల సెంటిమెంట్ బలపడింది. దీంతో సూచీలు సానుకూలంగా స్థిరపడ్డాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి నిఫ్టీ 126.75 పాయింట్లు లాభపడి 25,175.40 వద్ద నిలిచింది. సెన్సెక్స్ కూడా 319.78 పాయింట్లు పెరిగి 81,857.48 వద్ద ముగిసింది. భారత్, ఈయూ మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందం మార్కెట్లకు కొత్త ఉత్సాహాన్ని ఇచ్చింది. ఈ డీల్ పరిధిలో 2032 నాటికి భారత్‌కు ఈయూ నుంచి వస్తువుల ఎగుమతులు రెట్టింపు అవుతాయని అంచనా. భారత్‌కు వచ్చే దాదాపు 96.6 శాతం యూరోపియన్ వస్తువులపై సుంకాలను తగ్గించడం లేదా పూర్తిగా తొలగించడం జరుగుతుంది. అదే సమయంలో, భారత్ నుంచి దిగుమతి చేసుకునే 99.5 శాతం వస్తువులపై ఈయూ సుంకాలను తగ్గించనుంది. ఇది ఇరుపక్షాల మధ్య వాణిజ్య అవకాశాలను గణనీయంగా పెంచుతుందని భావిస్తున్నారు. మార్కెట్లలో ఇవాళ రోజంతా అస్థిరత కనిపించింది. మహీంద్రా అండ్ మహీంద్రా, ఏషియన్ పెయింట్స్, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఐటిసి, మారుతీ సుజుకీ వంటి హెవీవెయిట్ షేర్లు 4 శాతం వరకు నష్టపోయి మార్కెట్లపై ఒత్తిడి పెంచాయి. మరోవైపు, యాక్సిస్ బ్యాంక్, అదానీ పోర్ట్స్, ఎన్టీపిసి, టెక్ మహీంద్రా, టాటా స్టీల్, ఎస్‌బీఐ వంటి షేర్లలో కొనుగోళ్ల ఆసక్తి కనిపించింది. ఈ షేర్లు 5 శాతం వరకు లాభపడి సూచీలకు మద్దతుగా నిలిచాయి. రంగాల వారీగా చూస్తే నిఫ్టీ మెటల్ ఇండెక్స్ 3 శాతం దూసుకెళ్లింది. అయితే, నిఫ్టీ మీడియా 1.4 శాతం, నిఫ్టీ ఆటో 0.9 శాతం చొప్పున నష్టపోయాయి. మిడ్‌క్యాప్; స్మాల్‌క్యాప్ మార్కెట్లలో నిఫ్టీ మిడ్‌క్యాప్ 100, స్మాల్‌క్యాప్ 100 సూచీలు కూడా లాభాల్లోనే ముగిశాయి.

## క్షీణించిన ఏసియన్ పెయింట్స్ నికరలాభం



**ముంబయి, జనవరి 27:** ఏసియన్ పెయింట్స్ మంగళవారం 4.6శాతం నికరలాభాలు క్షీణించింది. గత ఏడాది 1110.5 కోట్లు లాభం ఆర్జిస్తే ఈసారి 1059.9 కోట్లు మాత్రమే ఆర్జించింది. కంపెనీ లేబర్‌కోడ్స్ అమలు ద్వారా ఒక్కసారిగా 63.74 కోట్లు అదనపు భారం భరించింది. కంపెనీ అనుకోకుండా వచ్చిన ఆకస్మిక ఖర్చులు 157.61 కోట్లు ఉన్నట్లు తెలిపింది. అలాగే గ్రాట్యుటీ భారం కూడా 52.88 కోట్లుగా ఉంది. మరో 10.86 కోట్లు కూడా ఉద్యోగుల సంక్షేమంపైనే ఖర్చుచేసింది. వైట్‌టీక్ కొనుగోలుద్వారా మరో 93.87 కోట్లు అదనపు భారం వల్లనే నికరలాభాల్లో తగ్గినట్లు కంపెనీ చెపుతోంది. ముంబయి కేంద్రంగా ఉన్న ఈ కంపెనీ రాబడుల ద్వారా రూ.8849.72 కోట్లు ఆర్జించింది. గత ఏడాదితోపోలిస్తే 3.85శాతంపెరిగింది. డెకొరేటివ్ వ్యాపారం 7.9శాతం వృద్ధి ఉన్నట్లు తెలిపింది. మొత్తంగా కోటింగ్ బిజినెస్ 4.4శాతంగా ఉంది. పన్నులు,వడ్డీ చెల్లింపులకు ముందు పిబిడిఐటి 8.8శాతం వృద్ధితో 1781 కోట్లు ఆర్జించినట్లు ప్రకటించింది. శ్రీలంక యుఎఇ, ఇథియోపియా బిజినెస్ 869.6 కోట్లుగా ఉంది. బాత్ ఫిట్టింగ్స్‌లో అమ్మకాలు 4.1శాతం క్షీణించింది. కిచెన్ వ్యాపారం 2.6శాతంగా ఉంది. వైట్‌టీక్ నికర అమ్మకాలు 12.4శాతం పెరిగి 29.2కోట్లు చేరింది. ఎపిపిజి నెట్ సేల్స్ 16.5శాతం పెరిగి రూ.334.7 కోట్లుగా ఉంది. పిపిజిఎపి నికర విక్రయాలు కూడా 16.9శాతం పెరిగి 713.3కోట్లుగా ఉన్నట్లు ప్రకటించింది. ఏసియన్‌పెయింట్స్ షేర్లు 2.6శాతం క్షీణించి 2630 చొప్పున బిఎస్ఇలో ట్రేడ్ అయ్యాయి.




## రూ.447 కోట్లు మారికో నికరలాభం!

**ముంబయి, జనవరి 27:** ఎఫ్ఎంసిజి మేజర్ కంపెనీ మారికో తన నికరలాభాల్లో 12.03 శాతం పెరిగినట్లు ప్రకటించింది. మూడో త్రైమాసికంలో కంపెనీ రూ.447 కోట్లు ఆర్జించినట్లు మంగళవారం ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలంలో రూ.399 కోట్లు మాత్రమే సాధించిన లాభాలు ఈసారి పెరిగినట్లు వెల్లడించింది. కంపెనీ రాబడులు కూడా 26.6శాతంపెరిగాయి. రూ.3537 కోట్లకు చేరింది. గత ఏడాది ఇదే కాలంలో 2794 కోట్లు మాత్రమే ఆర్జించింది. రాబడులు కూడా రూ.3458 కోట్లనుంచి 1.58శాతం పెరిగినట్లు కంపెనీ ప్రకటించింది. ప్రధాన కేటగిరీల్లో లాభదాయకత పెరిగింది. ఫుడ్ డిజిటల్‌ఫస్ట్ బిజినెస్ ధోరణుల్లో కొంతమేర మెరుగుపడ్డాయి.

అంతర్జాతీయ వాణిజ్యం కంపెనీకి గ్రోత్ ఇంజిన్‌గా మారినట్లు చెప్పింది మార్కెట్లలో ఈసారి మూడోత్రైమాసికంలో మంచి ఫలితాలు రాబట్టుకోగలిగామని ఎండి సిఇఒ సౌగత గుప్తా చెప్పారు. వార్షికవృద్ధి 11శాతంగా ఉన్నట్లు వెల్లడించింది. ఎబిడిటా మార్జిన్‌కూడా 16.7శాతంగా ఉంది. అయితేకంపెనీపై లేబర్‌కోడ్‌ల అమలు ద్వారా ఆరుకోట్లు అదనపు భారం పడిందని వివరించింది. భారత్‌లో కంపెనీ రాబడులు రూ.2681 కోట్లుగా ఉన్నాయి. మంగళవారం మార్కెట్లలో మారికో షేర్లు రూ.747.20గా కొనసాగాయి.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 5-69, 7Pratipadu, Pentapadu (M), West Godavari Dist., Tadepalligudem-534101. Telefax: 08818-220791, 225046, RNI?No. ARTEL 2004/13724 Editer: "Damerla Saibaba responsible for selection of new under the PRB Act. Read: No H/SD/337/12-14. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

పశ్చిమగోదావరి,ఏలూరు
వార్త

# మామిడి పూత మెండుగా వస్తోంది



## - సస్యరక్షణ చర్యలు చేపట్టండి - ఉద్యానవన శాఖ అధికారిణి హేమ

చాట్రాయి, జనవరి 27, (ప్రభాతవార్త) : చాట్రాయి మండలంలో మామిడి పూత 95 శాతం వచ్చిందని రైతులు పిందికట్టు కోసం సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించిన ఉద్యానవన శాఖ అధికారిణి ఆర్.హేమ చెప్పారు. మండల కేంద్రమైన చాట్రాయిలో మామిడి తోటలను పరిశీలించి పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో 3400 ఎకరాలు మామిడి సాగు ఉ ందని దాదాపుగా పూత అన్ని తోటలలో వచ్చిందని చెప్పారు. మామిడి ఊత దశ నుండి పిందె దశకి చేరుకుంటున్నందున ఐతానే కింద సైజులో కింది రాగానే 15 నుండి 20 20 రోజుల్లో మామిడి చెట్టుకు నీరు అందించాలని చెప్పారు. పిందె కాయగా మారే సమయంలో 10 గ్రాముల పొటాషియం నైట్రేట్ లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలని తెలిపారు. కింది రాలకుండా నివారించేందుకు నాఫ్తలిన్ ఎసిటిక్ యాసిడ్ 20 మిల్లి గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలని ఆమె వివరించారు. మండలంలో చిత్తపూరు తుమ్మ గూడెం గ్రామాలలోని మామిడి తోటలను పరిశీలించి రైతులకు తగు సూచనలు సలహాలు ఇచ్చారు. తేనేమంచు పురుగు ఇమిడాక్లోప్రిడ్ 2000 పి పి యం రెండు లీటర్ల నీటికి కలిపి పిచికారి చేయాలని చెప్పారు. తామర పురుగు నివారణకు నీలిరంగు అట్టలను 40 నుండి 50 చొప్పున ఏర్పాటు చేసుకోవాలని వేప నూనె మూడువేల పిపిఎం రెండు లీటర్లు కలిపి పిచికారి చేయాలని తెలియజేశారు. రైతులకు తెగులు పై ఎటువంటి సందేహాలు ఉన్నా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని ఆమె కోరారు. పిందె నుండి కాయగా మారేవరకు రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టి మామిడి పంట దిగుబడి పెంచుకునేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉ ద్యానవన శాఖ సిబ్బంది, పలువురు రైతులు పాల్గొన్నారు.

## పేలిన ఎన్సిసి క్యాడేట్ తుపాకీ

### - ఇంట్లో ఎవరూ లేకపోవడంతో తప్పిన పెను ప్రమాదం - ఆగ్రహించిన స్థానికులు

ప్రభాతవార్త నరసాపురం : నరసాపురం వై ఎన్ కళాశాల గ్రౌండ్ వెనుక 7జీ ఆంధ్ర నావెల్ యూనిట్ ఎన్సిసి క్యాడెట్ విద్యార్థులు రై ఫీలింగ్ శిక్షణ పొందుతూ ఉంటారు. మంగళవారం కూడా ఆదే విధంగా శిక్షణ తీసుకుంటుండగా ఓ విద్యార్థి చేతిలో తుపాకీ మిస్ఫైర్ అయింది. తుపాకీ గుండు నేరుగా రాము అనే వ్యక్తి ఇంట్లోంచి కిటికీ అద్దాలను చీల్చుకుంటూ వెళ్లడంతో స్థానికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఆ సమయంలో గదిలో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. గతంలో అయితే ఈ ప్రాంతంలో ఇల్లు ఉండేవి కావు .ఇప్పుడు జనావాసం పెరిగింది. అయినా రైఫిల్ ఆపకపోవడం ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడడమేనని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులు దర్యాప్తు చేపట్టారు .తుపాకీ కాల్చడం శిక్షణను



మానకపోతే స్థానికంగా ఆందోళన జరుగుతుందని కాలనీ ప్రజలు హెచ్చరించారు.

## జిల్లా పంచాయతీ అధికారుల గైర్హాజరు ఉపేక్షించం - పారిశుద్ధ్య పనులు వేగవంతం చేయండి

ఏలూరు, జనవరి, 27 : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ కార్యాలయంలో ఈ రోజు జిల్లా పరిషత్ చైర్పర్సన్ ఘంటా పద్మశ్రీ అధ్యక్షతన జిల్లా పరిధిలో పనిచేస్తున్న జిల్లా పంచాయతీ అధికారులు డివిజనల్ పంచాయతీ అధికారులు, శానిటేషన్ విభాగ సిబ్బందితో సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పశ్చిమ గోదావరి తూర్పు గోదావరి జిల్లాలకు చెందిన డిపిఓ లు హాజరు కాకపోవడం పట్ల చైర్పర్సన్ గారు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ప్రజలకు సంబంధించిన అత్యంత కీలకమైన పారిశుధ్య, పరిశుభ్రత అంశాలపై నిర్వహించిన ఈ సమీక్ష సమావేశానికి బాధ్యతాయుతంగా హాజరు కావాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. భవిష్యత్తులో ఇలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని, అధికారులందరూ విధి బాధ్యతల పట్ల మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని స్పష్టంగా హెచ్చరించారు. ఈ సందర్భంగా ఏలూరు డిపిఓ జిల్లాలో



చేపట్టబోయే శానిటేషన్ మరియు చెత్త ప్రాసెసింగ్ కార్యక్రమాలకు సంబంధించి పూర్తి ప్రణాళికను ఇప్పటికే సిద్ధం చేశామని సమావేశంలో తెలియజేశారు. ఈ ప్రణాళిక ఆధారంగా పనులను వేగవంతంగా ప్రారంభించి, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని చైర్పర్సన్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలోని మూడు జిల్లాలకు చెందిన వివిధ గ్రామాలలో శానిటేషన్ రంగంలో ఉన్న లోపాలు, చెత్త డంపింగ్, అక్రమ వ్యర్థాల నిల్వలు, పారిశుధ్య లోపాలు తదితర అంశాలను స్పష్టంగా చూపించే వీడియోలను ప్రదర్శించారు. ఈ వీడియోలను వీక్షించిన అనంతరం సంబంధిత అధికారులు పరిస్థితి తీవ్రతను గుర్తించి, వెంటనే తగిన చర్యలు చేపట్టి సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని చైర్పర్సన్ కి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా చైర్పర్సన్ మాట్లాడుతూ ? గ్రామాలలో పరిశుభ్రత కాపాడడం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాకుండా ప్రజల భాగస్వామ్యంతో సాధ్యమయ్యే అత్యంత కీలక కార్యక్రమమని పేర్కొన్నారు. చెత్తను సేకరణ సమయంలోనే తడి- పొడి చెత్తగా వేరుచేయాలన్నారు. తడి,ఎండు చెత్తను వేర్వేరుగా ప్రాసెస్ చేయడం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజారోగ్యాన్ని కాపాడవచ్చని తెలిపారు.

## ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన పనులు వేగవంతం చేయాలి.

### --జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



భీమవరం జనవరి 27 ప్రభాతవార్త : ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన పథకం కింద జరుగుతున్న పనుల పురోగతిని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత అధికారులతో మంగళవారం గూగుల్ మీట్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 10 మండలాలలో 144 పనులు మంజూరు కాగా ఇంతవరకు 27 పనులు మాత్రమే పూర్తయ్యాయని, 63 పనులు పురోగతిలో ఉ న్నాయని, ఇంకను 54 పనులు ప్రారంభించవలసి ఉందన్నారు. ఎస్సీ వర్గాల అభివృద్ధి, సమగ్ర గ్రామీణ వికాసమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన పథకం కింద జిల్లాలోని ఎంపిక చేసిన గ్రామాలలో అభివృద్ధి పనులు వేగవంతంగా వేగవంతం చేయాలన్నారు. ముఖ్యంగా ఎస్సీ జనాభా అధికంగా ఉన్న గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దడం ఈ పథక ప్రధాన ఉద్దేశమన్నారు. గ్రామాభివృద్ధికి ప్రజల భాగస్వామ్యం అత్యంత అవసరం అన్నారు. ఇంకను ప్రారంభించని పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆర్డబ్ల్యూఎస్, సాంఘిక సంక్షేమ శాఖ అధికారులను ఎంపీడీవోలను ఆదేశించారు. ఈ గూగుల్ మీట్ లో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారిని ఎన్ వి అరుణ కుమారి, ఆర్డబ్ల్యూఎస్ అధికారులు, ఎంపీడీవోలు, తదితరలు పాల్గొన్నారు.

## వైయస్ పాలెం లో ఆయుష్ ఆసుపత్రికి భూమి పూజ



నరసాపురం రూరల్ జనవరి 27 ప్రభాతవార్త : నరసాపురం మండలం లో మంగళవారం ఎర్రం శెట్టి వారి పాలెంలో గ్రామంలో ప్రభుత్వ విప్ మరియు నరసాపురం శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్ పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు ఆయుష్ హాస్పిటల్ 22 లక్షల రూపాయలు స్మశాన వాటిక 20 లక్షల రూపాయలు ఆయన ఈ రోజున కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేయడం జరిగినది. ఎమ్మెల్యే నాయకర్ గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఆయనకు టిడిపి ఇన్చార్జ్ రామరాజు సర్పంచ్ నాగముచ్చమాంబ బాబులు వారిని ఘనంగా సత్కరించడం జరిగినది. గ్రామస్తులు ఎమ్మెల్యే నాయకర్ కు పలు సమస్యలు వివరించారు. అధికారులను పిలిచి వెంటనే పరిష్కరించాలని ఆదేశించడం జరిగినది . శంకుస్థాపన చేసిన పనులు వెంటనే ప్రారంభించాలని నాణ్యతతో పని చేయించాలని ఆయన ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ ఎర్రం శెట్టి బాబులు ఎంపీటీసీ ఆకన శ్రీదేవి చంద్రశేఖర వైస్ సర్పంచ్ తలగం శెట్టి శ్రీదేవి వాసు కోటిపల్లి వెంకటేశ్వరరావు ఇంజనీరింగ్ అధికారులు జనసేన టిడిపి బిజెపి నాయకులు జనసైనికులు వీర మహిళలు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## గవర్నర్, డిజిపి, మంత్రులను కలిసిన కంతేటి

భీమవరం జనవరి 27 ప్రభాతవార్త : ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్, డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డిజిపి) హరీష్ కుమార్ గుప్తా, మంత్రి నారా లోకేష్ తదితర మంత్రులను భీమవరం శ్రీపద్మావతి వెంకటేశ్వర స్వామి మందిర చైర్మన్ కంతేటి వెంకటరాజు విజయవాడలో కలిశారు. గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ప్రత్యేక ఆహ్వానితులుగా వెళ్లడం జరిగిందని, అనంతరం జరిగిన కార్యక్రమంలో గవర్నర్, డిజిపి, మంత్రులను కలిశామని వెంకటరాజు తెలిపారు. మంత్రి నారా లోకేష్ తో దావోస్ పర్యటనపై మాట్లాడుతూ దావోస్ పర్యటనతో స్లిమ్ అయ్యారు అక్కడ ఏమి తిన్నారో అంటూ చమత్కరించారు. మీరు గత 20 ఏళ్లుగా స్లిమ్ గానే ఉన్నారు మీరు ఏం తింటున్నారని అంటూ వారు కూడా చమత్కరించారు. అదే విధంగా మంత్రి నారాయణ, డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామ కృష్ణంరాజులతోపాటు పలువురు మంత్రులను కలిశారు.



## జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి వారోత్సవాలు ప్రారంభం

భీమవరం జనవరి 27 ప్రభాతవార్త అహింస ఆయుధంగా గాంధీజీ పోరాటం చేసి స్వతంత్రం సాధించారని, ఆ స్వాతంత్రాన్ని మనందరం సమపాళ్లలో అభివృద్ధి చేసుకోవాలని భాష్యం స్కూల్ ప్రిన్సిపాల్ జగన్మోహన్ అన్నారు. జిల్లా సర్వోదయ మండలి, శ్రీవిజ్ఞానవేదిక అధ్వర్యంలో జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి వారోత్సవాలను మంగళవారం బైపాస్ రోడ్డులోని భాష్యం స్కూల్లో ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాల వల్ల భావితరాల వారందరికీ తెలుస్తుందన్నారు.జిల్లా సర్వోదయ మండలి కన్వీనర్ చెరుకువాడ రంగసాయి, అరసవల్లి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు అరసవల్లి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ జాతి సమగ్రతను ఐక్యతను నిలబెట్టేందుకు గాంధీజీ అనుసరించిన మార్గం అందరికి ఆదర్శమని అన్నారు. గాంధీజీ జీవితం మానవాళికి మార్గదర్శకమని అన్నారు. ఈనెల 30వ తేదీ వరకు ఈ వారోత్సవాలను నిర్వహిస్తామని అన్నారు. అనంతరం విద్యార్థులకు గాంధీజీ ఆశయాలు - అంటరాని తనం నిర్మూలన అనే అంశంపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఏసుబాబు, ఆరేటి సత్యనారాయణమ్మ, కేతా కీర్తి, ఎస్ నాగేంద్ర, చెన్నంశెట్టి రవిశంకర్, సాయి కీర్త తదితరులు పాల్గొన్నారు.



## రైస్ మిల్లర్లు నిర్దేశించిన నిబంధనలను పాటించాలి

### - జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి.

ఉండి జనవరి 27ప్రభాతవార్త: ఉండి మండలం చెరుకువాడ గ్రామంలో ఉన్న రామాంజనేయ రైస్ మిల్లును మంగళవారం జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మిల్లులో ఉన్న ధాన్యం నిల్వలనుూా ఉ దీ రిజిస్టర్ల నిల్వలతో సరి చూడగా తేడాలు లేనట్లుగా గుర్తించారు. అదేవిధంగా మిల్లు తనిఖీలు చేయుటకు ప్రత్యేకంగా తయారుచేసిన మొబైల్ అప్లికేషన్ ని కుడా పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, రైస్ మిల్లుల పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తామన్నారు. అక్రమ నిల్వలు, తక్కువ తూకం వంటి చర్యలకు పాల్పడితే సహించేది లేదన్నారు. ఈ తనిఖీలో జిల్లా పౌరసరఫరాల అధికారి ఎన్.సరోజ, సరఫరాల జిల్లా మేనేజర్ ఎం.డి ఇబ్రహీం, ఏఎస్ఓ ఎం.రవిశంకర్, తహసిల్దార్ నాగార్జున. సి.ఎస్.డి.టి, తదితరులు ఉన్నారు.



## అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే నాయకర్

### వంతెన మరమ్మతులు చేయాలని గ్రామస్తులు ఆందోళన

మొగల్తూరు జనవరి 27 (ప్రభాతవార్త) మొగల్తూరు మండలం వారతిప్ప గ్రామ పంచాయతీ లో మంగళవారం ఉదయం ప్రభుత్వ విప్ మరియు శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్ చొరవతో అభివృద్ధి పనులలో భాగంగా, అమరజీవి జలధార జలజీవన్ (జే జే యం) నిధులతో 40 వేల లీటర్ల వాటర్ ట్యాంక్ నిర్మాణానికి 26, 20 లక్షల రూపాయల తోమెగా ఇంజనీరింగ్ సంస్థ కాంట్రాక్ట్ తో మరియు వారతిప్ప వంతెన దిగువలో ఉన్న రేవు నిర్మాణానికి మండల ప్రజా పరిషత్ నిధులు క్రింద 5 లక్షల రూపాయలతో చేపడుతున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమిప్రభుత్వం ప్రజల అవసరాలను ప్రధానంగా దృష్టిలో ఉంచుకొని ప్రతి అభివృద్ధి కార్యక్రమాన్ని పారదర్శకతతో నాణ్యత ప్రమాణాలను ఖచ్చితంగా పాటిస్తూ అమలు చేయడమే ప్రభుత్వం లక్ష్యంగా పనిచేస్తుందని గ్రామాల అభివృద్ధి రాష్ట్ర అభివృద్ధికి పునాది అని, గ్రామాల అభివృద్ధికి ప్రజా సమస్యలను పరిష్కరించడంలో శక్తి వంచన లేకుండా పనిచేస్తానని ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి పథకాలను ప్రజలందరూ సద్వినియోగపరచుకోవాలని నేను ఎప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంటానని ఆయన తెలియజేశారు, ఈ కార్యక్రమంలో పల్లవసేన రాష్ట్ర అధ్యక్షులు కొల్లాటి బాబురావు గ్రామ సర్పంచ్ శాంతకుమారి ఏడుకొండలు మాజీ సర్పంచులు తిరుమాని నాగేశ్వరరావు, తిరుమాని పెంటయ్య బర్రి నాగరాజు తిరుమాని వెంకటేశ్వర్లు బొక్క నరసింహస్వామి బస్వాని నరసింహస్వామి దొంగ నరసింహస్వామి దొంగ సత్యనారాయణ (పెద్దబ్బులు) తిరుమాని వెంకటస్వామి దొంగ శ్రీను కడలి నాగేశ్వరరావు పెద సింగుశ్రీను



ఒడుగు శ్రీను తిరుమాని శివ నాగరాజుపోతా బత్తులఏసుబాబు కర్రీ వీరస్వామి కొల్లాటి బాలకృష్ణ కొల్లాటి మూలస్వామి అడ్డాల ఏడుకొండలు తదితరులు కూటమి నాయకులు ప్రజాప్రతినిధులు గ్రామస్తులు స్థానికులు వీర మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

## రీ సర్వే పనులను వేగవంతం చేయాలి

### -జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి

ఉండి జనవరి 27ప్రభాతవార్త : జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మంగళవారం ఉండి మండలం ఆరేడు గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ రీ సర్వే నోటీసులు అందాయా, లేదా ఎన్ని రోజులు ముందుగా నోటీసులు ఇచ్చారు, తదితర వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు సంతృప్తికరమైన సమాధానాలు ఇచ్చారు. గ్రౌండ్ ట్రూతింగ్ ఇంకా మెరుగు చేయడానికి రైతులు వ్యక్తిగత డేటాను గ్రౌండ్ ట్రూతింగ్ తో పాటు సేకరించాలని గ్రామ రెవెన్యూ అధికారిని ఆదేశించారు. ప్రభుత్వ భూములు, ప్రైవేటు భూముల మధ్య సరిహద్దులను జాయింట్ కలెక్టర్ పరిశీలించారు. ప్రభుత్వ భూములు ఒక సెంటు కూడా తగ్గడానికి వీలు లేదన్నారు.



ఈ సందర్భంలో జిల్లా సర్వే అధికారి కె.జాషువా, ఉండి తహసిల్దార్ నాగార్జున, మండల గ్రామ సర్వేయర్లు, తదితరులు ఉన్నారు.


సాయి బాలాజీ భారత్ గ్యాస్ ఏజెన్సీ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

## వంతెన మరమ్మతులు చేయాలని గ్రామస్తులు ఆందోళన

మొగల్తూరు జనవరి 27 (ప్రభాతవార్త) మొగల్తూరు మండలం ముత్యాలపల్లి మరియు వార తిప్ప గ్రామాలను కలుపుతున్న వంతెన 20-2-2004 నాబార్డ్ Ridf-"Vii తి నిధులతో నిర్మించిన వంతెన కుండీల మధ్యలోకాళీ రావడంతో వంతెనపై ప్రయాణిస్తున్న వాహనాలు ప్రమాదాలు జరుగుతున్నాయని, పశు వులు వంతెన పై నడవడంతో ఖాళీలో కాళ్లు పడి విరిగిపోతున్నాయని, మంగళవారం మధ్యాహ్నం స్థానికులు ఆందోళన చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దీనిని వెంటనే ప్రభుత్వం స్పందించి ఉన్న దీనికి సంబంధించిన అధికారులతో మాట్లాడి మరమ్మతు పనులు చేయించవలసిందిగా కోరుతున్నారు, ఈ కార్యక్రమంలో బొక్క నరసింహస్వామి పోత బత్తుల ఏసుబాబు తిరుమానిశివ నాగరాజు తిరుమాని శ్రీను(బొట్టు శ్రీను) పెదసింగ్ శ్రీను పెద సింగు నారాయణస్వామి కొల్లాటి బాబురావు బర్రి నాగరాజు ఒడుగు శ్రీను తిరుమానివెంకటేశ్వర్లు దొంగ శ్రీను దొంగ నరసింహస్వామి తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.




## మత్స్యకారుల సమస్యపై మంత్రి సవితకు పెద్దిరాజు వినతి



నరసాపురం జనవరి 27 ప్రభాత వార్త :విజయవాడ గొల్లపూడి బీసీ వెల్ఫేర్ భవనంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బి.సి మంత్రివర్యులు ఎస్ సవిత ని కలిసి రాష్ట్రంలో మత్స్యకారుల సమస్యలను తీర్చి మత్స్యకారులు ఆర్థికంగా స్థిరపడే విధంగా చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మత్స్యకార అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ కొల్లు పెద్దిరాజు కోరారు మత్స్యకారుల జీవన ప్రమాణాలు మెరుగుపరచడానికి ప్రభుత్వం ఇచ్చే రుణ సబ్సిడీని 40% నుండి 75% కి పెంచాలని కోరారు మత్స్యకార గ్రామాల్లో జెట్టీలు, ప్లాట్ఫారమ్లు, నెట్ ల్యాండింగ్ సెంటర్లు మరియు సముద్ర కోతను అరికట్టడానికి రిటైనింగ్ వాల్స్ నిర్మించాలని విన్నవించారు. ?మత్స్యకారుల పిల్లల కోసం నాణ్యమైన విద్యను అందించేలా 1వ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు మత్స్యకార ఇంగ్లీష్ మీడియం గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేయాలని కోరారు. ?మత్స్యకారుల ఆధీనంలో ఉన్న భూములకు పట్టాలు మంజూరు చేయాలని, అలాగే మహిళా మత్స్యకారుల వ్యాపార అభివృద్ధికి ప్రత్యేక రుణాలు అందించాలని విన్నవించారు. ?కూనవరం డ్రైన్ మెగా డ్రెడ్జింగ్ పనులు చేపట్టాలని మరియు మత్స్యకారులకు అవసరమైన వేట వలలు, బోటు ఇంజన్లు మరియు రిలయన్స్ నుండి వచ్చే ఆర్థిక సహాయం అందేలా చూడాలని కోరారు. ప్రకాశం జిల్లా, కొత్త పట్టణం గ్రామానికి చెందిన మత్స్యకారులు వారికి 20 హెచ్.పి. బోటు ఇంజన్లు ఇప్పించాలని కోరుతున్నాము మత్స్యకార సొసైటీలను బలోపేతం చేసి, అర్హులైన ప్రతి మత్స్యకారునికి ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తామని మంత్రి గారు స్పష్టం చేశారు. పైన తెలిపిన విషయముపై చర్చించి తదితర అధికారులకి సూచించి, మా మత్స్యకార సోదరులకు న్యాయం చేస్తారని ఆశిస్తూ మా రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ కొల్లు పెద్దిరాజు , ఎస్ సవితాకి తెలిపారు.

## ఘనంగా బాలికోన్నత

### పాఠశాల వార్షిక దినోత్సవం



కైకలూరు జనవరి 27 (ప్రభాతవార్త) : మండలంలోని ఆటపాక జాన్ పేట వద్ద ఉన్న జిల్లా పరిషత్ బాలుకోన్నత పాఠశాల వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంఈఓలు డి రామారావు, వెలమల శ్రీనివాసరావు, లయన్స్ క్లబ్ మగువ ప్రెసిడెంట్ గుర్రం లక్ష్మీ మానస ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ముందుగా విద్యార్థినీలు సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు చేశారు. పదవ తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించిన వారికి పలువురు ఉపాధ్యాయులు ప్రోత్సాహకాలు ప్రకటించారు. పాఠశాల గ్రౌండ్ కు మెరక చేసేందుకు మానస ముందుకు వచ్చారు. పాఠశాల పూర్వం విద్యార్థిని బ్యూటీ పార్లర్ శ్రీదేవి రెండు ఐరన్ రాకులు బహుకరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని కే శైలజ మరియు ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## జనవాణిలో ప్రతి సమస్యకు పరిష్కారం చూపిస్తాం -ఎమ్మెల్యే చిర్రి,


జీలుగుమిల్లి, జనవరి 27, ప్రభాత వార్త: జనవాణిలో వచ్చిన ప్రతి సమస్యకు పరిష్కారం చూపిస్తామని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు తెలిపారు. మంగళవారం మంగళగిరి జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన జనవాణి కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆటన మాట్లాడుతూ, "ప్రజల సమస్యలను నేరుగా వినడమే జనసేన పార్టీ లక్ష్యం అని అన్నారు. జనవాణి వంటి కార్యక్రమాలు ప్రజలతో పాలనకు వారధిగా నిలుస్తాయన్నారు. ప్రతి అర్జీని బాధ్యతగా పరిశీలించి, న్యాయబద్ధమైన పరిష్కారం అందించేలా కృషి చేస్తాం" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు



బోడపాటి శివదత్, తిరుపతి అనూష, లీగల్ సెల్ ప్రతినిధి కొప్పెర నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## లోకేష్ సారథ్యంలో యువతకు ఉపాధి అవకాశాలు

తణుకు, జనవరి 27, ప్రభాత వార్త: రాష్ట్ర మంత్రి నారా లోకేష్ సారథ్యంలో రాష్ట్రంలో యువతకు ఉ ద్యోగ, ఉపాధి అవకాశాలు సుగమం అయ్యాయని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర ప్రారంభించి నేటికీ మూడేళ్లు పూర్తయ్యాయని అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అధికారంలోకి రాకముందు నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర 226 రోజుల పాటు 3,132 కిలోమీటర్ల మేర చేసి రాష్ట్రంలోనే అన్ని వర్గాల ప్రజలు ఎదుర్కొన్న సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు అని చెప్పారు. ముఖ్యంగా రైతులు, మహిళలు, యువత, కార్మికులు సహా అన్ని వర్గాల సమస్యలను తెలుసుకున్నారని చెప్పారు.



అధికారంలోకి వచ్చిన తర్వాత యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ధ్యేయంతో ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు తీసుకువచ్చి పరిశ్రమలు నెలకొల్పేందుకు తన వంతు కృషి చేస్తున్నారని చెప్పారు. గూగుల్ వంటి అంతర్జాతీయ బహుళ జాతి సంస్థలను రాష్ట్రంలో నెలకొల్పి ఎంతో మంది ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేలా లోకేష్ చేస్తున్న చర్యలు రాష్ట్రానికి ఎంతో మేలు చేస్తున్నాయని చెప్పారు. రాబోయే రోజుల్లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉ పముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ సారథ్యంలో దేశ ప్రధాని నరేంద్ర మోడీ సహకారంతో రాష్ట్రానికి మరిన్ని పెట్టుబడులు తీసుకువచ్చి అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఫైర్ కానిస్టేబుల్ మురళీకృష్ణ కు ఉత్తమ సేవా పురస్కారం

కైకలూరు జనవరి 27 (ప్రభాతవార్త):ఉత్తమ సేవలకు గాను గణతంత్ర దినోత్సవ రోజున ఫైర్ కానిస్టేబుల్ రాచాకుల మురళీకృష్ణకి గౌరవం దక్కింది. కైకలూరు అగ్నిమాపక కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఆర్ మురళీకృష్ణ ఉత్తమ సేవా పురస్కారానికి ఎంపికయ్యారు. 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రమైన ఏలూరులో జరిగిన వేడుకల్లో కలెక్టర్ వెట్రి సెల్వి చేతుల మీదుగా మురళీకృష్ణకి ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కైకలూరు అగ్నిమాపక ఎస్సై మరియు సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.



# అబద్దాలకు కేరాఫ్ అడ్రస్స్ పేర్ని నాని



చాట్రాయి, జనవరి 27,ప్రభాతవార్త అబద్దాలకు కేరాఫ్ అడ్రస్ పేర్ని నాని అని సి. కె. పాడు ఛానల్ అధ్యక్షులు మంచిన పూర్ణచంద్రరావు, టీడీపీ యువ నాయకులు మోరంపూడి జయరాం అన్నారు. చాట్రాయి మండలం,చిన్నంపేటలో వైస్సార్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పేర్ని నాని కూటమి ప్రభుత్వం నారా చంద్రబాబు నాయుడు పై, అదే విధంగా మంత్రి వర్యులు కొలుసు పార్ధసారధి పై చేసిన అనుచిత, అవాస్తవ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా ఇరువురు విలేకరుల తో మాట్లాడుతూ అభివృద్ధి చేయలేని చేతకానితనంతో నోటికి వచ్చినట్లు మాట్లాడరని మండిపడ్డారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో ముంచిన వైఫల్యాలను దాచిపెట్టేందుకే ఈరోజు కూటమి ప్రభుత్వంపై నిందలు మోపుతున్నారన్నారు. బాధ్యతాయుతతో పాలన సాగిస్తున్న మంత్రి కొలుసు పార్ధసారధి పై విమర్శలు చేయటం అమానుషమన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఇక మనుగడ లేదని అందువల్లే నాయకులు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని వారు ఆరోపించారు.

# నూజివీడులో బ్యాంకు ఉద్యోగులు ఆందోళన




చాట్రాయి/నూజివీడు, జనవరి 27,ప్రభాతవార్త : యునైటెడ్ ఫోరం ఆఫ్ యూనియన్స్ ఆధ్వర్యంలో వివిధ బ్యాంకుల ఉద్యోగులు ఆందోళన మంగళవారం చేపట్టారు. అన్ని బ్యాంక్స్ ఉద్యోగులు విధులకు స్వస్థి చెప్పి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నూజివీడు మెయిన్ బ్రాంచ్ ముందు బైఠాయించి ధర్నా చేశారు. ఐదు రోజుల బ్యాంకింగ్ విధానంపై ఆలస్యం చేస్తున్న కేంద్ర ప్రభుత్వ మొండి వైఖరి విడనాడాలని నినాదాలు చేశారు. తక్షణమే 5 రోజుల బ్యాంకింగ్ విధానాన్ని అమలు చేయాలని బ్యాంకుల యూనియన్ల నాయకులు డిమాండ్ చేశారు.

# ఉత్తమ సేవా అవార్డు అందుకున్న షార్ట్ ఫిలిమ్స్ దర్శకుడు



భీమవరం టౌన్, జనవరి 26 ప్రభాతవార్త :భీమవరం పట్టణానికి చెందిన నటుడు, దర్శక రచయిత, అమ్మ ఫౌండేషన్ చైర్మన్ కోయ రాజాకు ఉత్తమ సేవా అవార్డు లభించింది. 25 సంవత్సరాలుగా, సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తూ, వృద్ధులకు ఉచిత కంటి ఆపరేషన్లు, ఆశ్రమాలకు అవసరమయ్యే ఫర్నిచర్స్ అందించటం, అంధులు, అనాధలు, యాచకులు, నిరాశ్రయులకు నిత్యావసర సరుకులు అందిస్తూ, వృద్ధ కళాకారులకు అవార్డులు బిరుదులు నగదు ఇచ్చి ఘనంగా సన్మానించటం, చిన్న పిల్లలలో ఉండే ప్రతిభను వెలికితీసేందుకు ప్రతి సంవత్సరం ఆటలు, పాటలు, డాన్స్, మిమిక్రీ ఇలా పోటీలు నిర్వహించి విజేతలైన చిన్నారులకు అవార్డులు నగదు సర్టిఫికెట్లు ఇవ్వటం, సందేశాత్మక షార్ట్ ఫిల్మ్ తీసి ప్రజలకు అవగాహన కలిగిస్తున్నందుకు గాను ప్రభుత్వం గుర్తించి 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలలో పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డిల చేతుల మీదుగా షీల్డ్, సర్టిఫికెట్ అందజేశారు. సేవా అవార్డు పట్ల రాజా మాట్లాడుతూ అవార్డ్ తనకు చాలా ప్రత్యేకమని, కలెక్టర్ చేతుల మీదుగా అవార్డ్ అందుకోవటం చాలా సంతోషంగా ఉందని, ఈ ప్రోత్సాహంతో మరిన్ని సేవా కార్యక్రమాలు, మరెన్నో సందేశాత్మక చిత్రాలు తీస్తానని అన్నారు. అవార్డ్ అందుకున్న కోయరాజాను సినిమా, రాజకీయ రంగాలకు చెందిన పలువురు అభిమానులు అభినందించారు.

# పేర్ని నాని నోరు అదుపులో పెట్టుకోవాలి

## - ఖండించిన బిఎస్సార్



కైకలూరు,జనవరి,27 (ప్రభాతవార్త) : వైసిపి నేత, మాజీ మంత్రి పేర్ని నాని పై జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బూరుబోయిన శ్రీనివాసరావు (బిఎస్సార్) మంగళవారం ఓ ప్రకటనలో ఖండించారు. ఇటీవల చాట్రాయి మండలంలో జరిగిన ఓ సభలో రాష్ట్ర గృహ నిర్మాణ మరియు సమాచార శాఖ మంత్రి కొలుసు పార్ధసారథి జనాలకు కనపడకుండా మెరుపు పర్యటన చేస్తున్నారని పేర్ని నాని విమర్శలు చేయడం హేయమైన చర్య అన్నారు. ప్రజా క్షేత్రంలో మంత్రి పార్ధసారథి కి మంచి స్థానం ఉందని గుర్తు చేశారు. ఇప్పటికీ నాలుగు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలుపొంది ఎటువంటి అవినీతి మచ్చలు లేకుండా ప్రజా క్షేత్రంలో కొనసాగుతున్నారని బిఎస్సార్ ధీమా వ్యక్తం చేశారు. అటువంటి వ్యక్తిపై అవాకులు చవాకులు పేలితే సహించేది లేదన్నారు. అదే విధంగా బీసీ నాయకులైనటువంటి మంత్రులు కొల్లు రవీంద్ర, అనగాని సత్యప్రసాద్ లపై నోటికిష్టం వచ్చినట్లు పేర్ని నాని ఆరోపణలు చేయడం సరికాదన్నారు. పట్టాదార్ పాస్ పుస్తకాల జారీపై మాజీ మంత్రి పేర్ని నాని కూటమి ప్రభుత్వంపై చేసిన విమర్శలను కూడా ఖండించారు. రాజకీయంగా ప్రజలు తిరస్కరించడంతో మతిస్థిమితం కోల్పోయిన నాని కమెడియన్ లా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. బీసీల జోలికి వస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇప్పటికైనా పేర్ని నాని నోరు అదుపులో పెట్టుకోవాలని లేకుంటే బీసీ సంఘాలు బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నాయని బిఎస్సార్ సవాల్ విసిరారు.

# ప్రతి వాహనదారుడు హెల్మెట్ ధరించాలి



కైకలూరు జనవరి 27 (ప్రభాతవార్త): ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్?ను ధరించాలని ట్రైనీ ఐపీఎస్ జయ శర్మ అన్నారు. మంగళవారం కైకలూరు టౌన్ స్టేషన్ పరిధిలో హెల్మెట్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. వాహన తనిఖీల్లో హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడుపుతున్న వాహనదారులపై జరిమానాలు విధించకుండా, వారికి తక్షణమే హెల్మెట్ కొనుగోలు చేయించి రహదారి భద్రత పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ట్రైనీ ఎస్పి మాట్లాడుతూ చాలా ప్రమాదాల్లో హెల్మెట్? లేకపోవడం వల్లే మరణాలు సంభవిస్తున్నాయని, ప్రాణాలకు రక్షణ కోసం హెల్మెట్? వాడకం తప్పనిసరి అని అన్నారు. విధిగా ప్రతి వాహనదారుడు డ్రైవింగ్? లైసెన్స్? కలిగి ఉండాలని స్పష్టం చేశారు. ట్రిపుల్? రైడ్? లేకుండా చూడాలన్నారు. యువత ఇటువంటి ప్రయాణాలు చేయడంపై తల్లిదండ్రులకు సమాచారం అందజేస్తామన్నారు. వారు స్పందించి ప్రమాదాల నివారణలో భాగంగా సహకరించాలన్నారు. ఈ డ్రైవ్ లో కైకలూరు టౌన్ సిఐ ఏవీఎస్ రామకృష్ణ,రూరల్ సీఐ వి రవికుమార్, ఎస్సై వెంకట్ కుమార్ మరియు పోలీస్ సిబ్బంది ఉన్నారు.

# సంఘ సేవకులు రంగసాయి కి ఎన్ వోడి అవార్డు



భీమవరం జనవరి 27 ప్రభాతవార్త : ప్రభుత్వ స్వచ్ఛంద కార్యక్రమాలతో చురుగ్గా పాల్గొనే సంఘ సేవకులు రంగసాయి సమాజ సేవకు స్ఫూర్తి అని డీఆర్వో శివ నారాయణ రెడ్డి అన్నారు. 16వ జాతీయ ఓటర్ల దినోత్సవ పక్షోత్సవాలలో రెవెన్యూ శాఖతో విశేష కృషి చేసిన రంగసాయికి మంగళవారం ఎన్ వో డి అవార్డును డిఆర్వో శివ నారాయణ రెడ్డి అందించారు. జాతీయ ఓటర్ దినోత్సవాన్ని 15 రోజులుగా వాడవాడలా నిర్వహించిన రంగసాయి సమాజానికి ఆదర్శామని అన్నారు. నిరంతరం సమాజ సేవలో ఉండే వ్యక్తి అస్వస్థతకు గురి కావడం దురదృష్టకరమని, ఆయన సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ప్రజా సేవలోకి రావాలని కోరుకుంటున్నామని అన్నారు. అవార్డు అందుకున్న రంగసాయి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ నాగరాణి, జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి లకు ధన్యవాదములు తెలిపారు. కార్యక్రమంలో కంతేటి వెంకటరాజు, పి అమూల్య రావు, పి రాజబాబు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# చిన్న శేష వాహనంపై గ్రామోత్సవము



ఆగిరిపల్లి : జనవరి 27 ప్రభాత వార్త :మాఘమాస రథసప్తమి ఉత్సవాల్లో భాగంగా ఏడవ రోజు మంగళవారం ఆగిరిపల్లి గ్రామంలోని స్వయంభూ శ్రీ శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నరసింహ స్వామి వారు చిన్న శేష వాహనం గ్రామోత్సవం నిర్వహించారు. వేకువ ఝామున స్వామివారికి సుప్రభాత సేవ, అభిషేక స్నానం, విశేష అలంకరణతో నిత్య పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం 10 గంటలకు నాగిరెడ్డి పాపా అప్పారావు -- వెంకటరమణ దంపతుల ఆధ్వర్యంలో శాంతి కళ్యాణం ఘనంగా నిర్వహించారు, సాయంత్రం 5 గంటలకు చిన్న శేష వాహన ఉత్సవం, రాత్రి 9 గంటలకు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శాంతి కళ్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కళ్యాణోత్సవంలో సుమారు 25 జంటలు ఉభయ దాతలుగా వ్యవహరించగా, ఆర్యవైశ్య సంఘం వారు ఏర్పాటు చేసిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆలయ కార్య నిర్వహణ అధికారి సిహెచ్ సాయిపరివేక్షణలో ఆలయ ప్రధాన అర్చకులు వేదాంతం శేషబాబు గుడి గుడి రామన్న కృష్ణులు కల్యాణోత్సవం నిర్వహించగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

## వరాల వెంకటేశ్వర స్వామి వారి వార్షికోత్సవం.



అత్తిలి,జనవరి 27 (ప్రభాతవార్త ):అత్తిలి మండలం ఈడూరు గ్రామంలో గల వరాల వెంకటేశ్వర స్వామి వారి విగ్రహ ప్రతిష్ట జరిపి 21 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఏకవీంశతి వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు వాడపల్లి శాఖరాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక అర్చనలు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



నరసాపురం న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన వివిధ క్రీడా పోటీల్లో బహుమతులు అందుకున్న వారికి న్యాయమూర్తులు బహుమతి ప్రధానం చేశారు.
జిల్లా జడ్జి ఏ వాసంతి సీనియర్ సివిల్ జడ్జ్ జి గంగరాజు బహుమతి ప్రధానం చేశారు.
ప్రభాతవార్త నరసాపురం

## బల్లెపాడు పాఠశాల వార్షికోత్సవం.




అత్తిలి, జనవరి 27 (ప్రభాత వార్త ):బల్లిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో ప్రధానోపాధ్యాయుడు కుమార్ అధ్యక్షతన వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఎస్ఎంసి చైర్మన్ ప్రగడ శ్రీనివాసరావు, ఎక్స్ అఫీషియో ఆచంట సుబ్బారావు, ఏఎంసీ డైరెక్టర్ రాచపోతు సత్యవతి, టిడిపి సీనియర్ నాయకులు గారపాటి ధర్మయ్య, జనసేన గ్రామ అధ్యక్షుడు ఆకుల రామచంద్రరావు, బిజెపి నాయకులు దాసం ఆదినారాయణ తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు

## జాతీయ ఎలక్ట్రికల్ దినోత్సవం.


అత్తిలి, జనవరి 27 (ప్రభాత వార్త ): విద్యుత్ బల్బును థామస్ ఆల్వా ఎడిసన్ కనిపెట్టిన రోజు సందర్భంగా అత్తిలి ప్రైవేట్ విద్యుత్తు వర్కర్ల సంఘం ఆధ్వర్యంలో జాతీయ ఎలక్ట్రికల్ దినోత్సవాన్ని నిర్వహించారు. థామస్ ఆల్వా ఎడిషన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యుత్ బల్బును కనుగొనడం ద్వారా ఎందరికో వెలుగును ప్రసాదించారని కొనియాడారు. సంఘం అధ్యక్షుడు బడేటి సర్వేశ్వరరావు, కొరిపల్లి హరి, వానపల్లి సుబ్బరాజు, కర్రి శ్రీధర్ రెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## తమలపాకులు అలంకరణలో అభయాంజనేయ స్వామి దర్శనం



పెనుమంట్ర, జనవరి-27, ప్రభాతవార్త: మండలంలోని మార్టేరు జెడ్ వంతెన దగ్గర కొలువైయున్న శ్రీ అభయాంజనేయ స్వామి వారికి ఎంతో ప్రీతి ప్రా తకమైన మంగళవారం తమలపాకులు అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. అలాగే విజయ గోపాలచార్యులు ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద ఎత్తున భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రసాదాలు స్వీ కరించారు. కమిటీ సభ్యుల్లో ఒకరైన కర్రి అచ్యుతామారెడ్డి మాట్లాడుతూ ప్రతి మంగళవారం స్వామివారిని ప్రత్యేక అలంకరణ చేస్తున్నామని భక్తులు పెద్ద ఎత్తున దర్శనం చేసుకోవాలని కోరారు. అలాగే ఈ అలంకరణకు సహకరిస్తున్న భక్తులకు కమిటీ సభ్యులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## మార్చి 14న జాతీయ లోక్ అదాలత్



భీమవరం జనవరి 27 ప్రభాతవార్త :రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో భీమవరం కోర్టుల్లో పెండింగులో వున్న కేసుల పరిష్కారం నిమిత్తం ఈ సంవత్సరపు మొదటి జాతీయ లోక్ అదాలత్ ను భీమవరంలో వున్న అన్ని కోర్టుల ప్రాంగణంలో మార్చి నెల 14వ తేది (రెండవ శనివారం) నిర్వహిస్తున్నట్లు సంస్థ చైర్మన్, మూడవ అదనపు జిల్లాజడ్జి పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి డా.బి. లక్ష్మీనారాయణ అన్నారు. ఈ జాతీయ లోక్ అదాలత్ లో అన్ని సివిల్ కేసులు, రాజీ కాదగ్గ క్రిమినల్ కేసులు, మోటార్ యాక్సిడెంటు ఇన్సూరెన్స్ కేసులు, ప్రాంశరీ నోటు, చెక్కు బాకీ కేసులు, మనోవర్తి, గృహహింస కేసులు, బ్యాంకు, బి ఎస్ ఎన్ ఎల్ మొండి బాకీ కేసులు తదితర కేసులు రాజీ చేసుకోవచ్చన్నారు. సివిల్ కేసుల్లో రాజీపడితే అప్పటికే కట్టిన కోర్టు ఫీజు వాపసు వస్తుందన్నారు.

## నేడు బడ్జెట్ మరియు కౌన్సిల్ సమావేశం


ప్రభాతవార్త నరసాపురం : నరసాపురం మున్సిపల్ బడ్జెట్ సమావేశం బుధవారం ఉదయం 11 గంటలకు జరుగుతుందని చైర్ పర్సన్ బర్రె శ్రీ వెంకటరమణ తెలిపారు. అనంతరం కౌన్సిల్ సాధారణ సమావేశం కూడా జరుగుతుంది .మున్సిపాలిటీకి కొత్తగా వచ్చిన కమిషనర్ పాల్గొంటున్నా మొదటి సమావేశం ఇదే కావటం విశేషం. పుట్టెడు సమస్యలు తల నెత్తుకున్న కొత్త కమిషనర్ సాధారణ సమావేశాన్ని ఏ విధంగా ఎదుర్కొంటారో చూడాల్సిందే.

## ఉద్యోగ భద్రత కల్పించాలి : విద్యుత్ మీటర్ రీడర్ల యూనియన్ డిమాండ్



భీమవరం టౌన్, జనవరి 27 ప్రభాతవార్త విద్యుత్ మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించి, నెలవారీ వేతనాలు చెల్లించాలని విద్యుత్ మీటర్ రీడర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు కోనాల భీమారావు డిమాండ్ చేశారు. మంగళవారం విద్యుత్ మీటర్ రీడర్స్ తమ సమస్యలు పరిష్కారం కోరుతూ భీమవరం కలెక్టరేట్ నందు జిల్లా రెవెన్యూ అధికారి బి.శివన్నారాయణ, విద్యుత్ శాఖ భీమవరం డివిజన్ సూపరింటెండెంట్ ఇంజనీర్ పి.ఉషారాణి లకు వినతి పత్రాలు సమర్పించారు. ఈసందర్భంగా భీమారావు, మీటర్ రీడర్స్ యూనియన్ భీమవరం డివిజన్ అధ్యక్షుడు పెనుమాక జాకబ్ మాట్లాడుతూ గత 20 సంవత్సరాలకు పైగా విద్యుత్ రీడర్స్ గా పనిచేస్తున్న కార్మికుల ఉపాధి భద్రతకు విద్యుత్ శాఖ అడిషనల్ సెక్రెటరీ,సీఎండీ లు ఇచ్చిన మినిట్స్ ఆదేశాలు అమలు చేయాలన్నారు. రాష్టంలో నాలుగు వేల మంది విద్యుత్ రీడర్స్ న్యాయమైన సమస్యలు పరిష్కారం కోరుతూ ఈనెల 29,30,31 తేదీలలో విజయవాడ ధర్నా చౌక్ నందు ధర్నానిర్వహిస్తున్నామన్నారు. అప్పటికీ తమ సమస్యలకు పరిష్కారం చూపకపోతే ఫిబ్రవరి 2 నుంచి రాష్ట్ర వ్యాపిత సమ్మెకు సమాయత్త మవుతామన్నారు. విద్యుత్ మీటర్ రీడర్స్ యూనియన్ నాయకులు కె. సత్యసాం బశివరావు, కె. బాలాజీ,కె. రమణ, జి. చింతయ్య,బి.బి నాగేశ్వరావు, కె. వీరాస్వామి, కె. రాజు,బి. సువర్ణరా జు,సిహెచ్ శ్రీనివాసరావు, కె. వెంకటరమణ, కె. చంద్రశేఖర్, ఏఐటీయూసీ నాయకులు ఎం. సీతారాం ప్రసాద్, సికిలే పుష్పకుమారి తదితరులు పాల్గొన్నారు.

# వరిలో జింకు లోపాన్ని గుర్తించాలి- ఏడిఆర్ టి శ్రీనివాస్,



పెనుమంట్ర, జనవరి 26, ప్రభాతవార్త :వరి పంటలో జింకు లోపము నివారణకు లీటర్ నీటికీ 2 గ్రా చొప్పున ఎకరానికి 400గ్రా జింక్ సల్ఫేట్ ను 200 లీటర్ల నీటిలో కలపి 5 రోజుల వ్యవదిలో 2 సార్లు పిచికారీచేసుకోవాలని మండలంలోని మార్టేరు వరి పరిశోధన కేంద్రం ఏ డి ఆర్ డా.టి శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం ఆయన వరిలో ఆశించే జింకులోపంపై మాట్లాడుతూ ప్రసుత రబీ వరి పంటలో చలి తీవ్రత వలన జింక్ దాతువు మొక్కలకు అందుబాటులో ఉండకపోవుట వలన పెరుగుదల పిలకలు చేయుట తక్కువగా ఉన్నాయన్నారు. ఎరువులు వేసినప్పటికి మొక్కలు ఎదగకుండా ఆకులపై తుప్పు మచ్చలు గమనించినట్లయితే జింకు లోపంగా గుర్తించి నివారణ చర్యలు సకాలంలో చెప్పటాలన్నారు. సార్వా మొదులు సరిగా కుళ్ళక పోవుట వలన జింక్ లోపము వస్తుందన్నారు. కావున జంకు లోపము సకాలంలో సవరించు కోవాలన్నారు. పిలకల దశలో చేను ఒకసారి ఆరబేడితే వేరు వ్యవస్థకు గాలి సోకి మొక్కకు పోషకాలు అందుతాయన్నారు.

## ప్రజాసేవే లక్ష్యంగా... రెవెన్యూ సిబ్బంది సేవలకు గణతంత్ర దినోత్సవ గుర్తింపు



పోడూరు, జనవరి 27,ప్రభాత వార్త: ప్రజల సమస్యలకు పరిష్కారమే లక్ష్యంగా అహర్నిశలు పనిచేస్తున్న పోడూరు మండలం రెవెన్యూ సిబ్బంది సేవలకు గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఘనమైన గుర్తింపు లభించింది. విధి నిర్వహణలో నిబద్ధత, ప్రజాసేవలో చిత్తశుద్ధి, కార్యనిర్వహణలో వేగం, ఖచ్చితత్వాన్ని ప్రదర్శించిన ప్రభుత్వ ఉద్యోగులకు ఉత్తమ సేవా అవార్డులు ప్రదానం చేశారు. పోడూరు తహసీల్దార్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్?గా పనిచేస్తున్న ఎం. సునీల్ కుమార్ కార్యాలయ పనులను వేగంగా, నిర్దిష్టంగా నిర్వహిస్తూ ప్రజలకు అవసరమైన ధ్రువపత్రాలు, సేవలు ఆలస్యం లేకుండా అందించడంలో కీలక పాత్ర పోషించారు. ఈ సేవలకు గాను ఆయన జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ సేవా అవార్డు అందుకోవడం కార్యాలయ సిబ్బందికి గర్వకారణంగా నిలిచింది. అలాగే పోడూరు తహసీల్దార్ కార్యాలయానికి చెందిన రెవెన్యూ సిబ్బంది వారి విధుల్లో చూపిన ఉత్తమ పనితీరుకు నరసాపురం రెవెన్యూ డివిజనల్ అధికారి దాసిరాజు చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. రెవెన్యూ ఇన్?స్పెక్టర్ కందుల రాంబాబు, సీనియర్ అసిస్టెంట్ జి. కృష్ణారాజు, పి. పోలవరం గ్రామ సర్వేయర్ ఎల్లారమ్మ, వద్దిపర్రు గ్రామ వీఆర్వో శ్రీనివాస్, పెనుమదం గ్రామ వీఆర్వో ఇందిరా, జగన్నాధపురం గ్రామ వీఆర్ఏ కాశి అన్నపూర్ణలు అవార్డులు పొందినవారిలో ఉన్నారు. ఈ సందర్భంగా మండల తహసీల్దార్ సయ్యద్ మౌలానా ఫజిల్ మాట్లాడుతూ, రెవెన్యూ సిబ్బంది ప్రజల సమస్యలను తమ సమస్యలుగా భావిస్తూ వర్షం, ఎండ, సమయ పరిమితులను లెక్కచేయకుండా క్షేత్రస్థాయిలో పనిచేస్తూ ప్రభుత్వ ప్రతిష్ఠను పెంచుతున్నారని అన్నారు. భూమి సమస్యల పరిష్కారం, ధ్రువపత్రాల జారీ, సర్వే పనులు, గ్రామస్థాయి సమాచారం సేకరణ వంటి బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తున్న వారి సేవలు అభినందనీయమని తెలిపారు. రెవెన్యూ సిబ్బంది చేసిన సేవలకు ఈ అవార్డులు మరింత ప్రోత్సాహకరంగా నిలుస్తాయని, ప్రజాసేవలో మరింత ఉత్సాహంతో ముందుకు సాగేందుకు దోహదపడతాయని పలువురు అభిప్రాయపడ్డారు. అవార్డు గ్రహీతలను అధికారులు, కార్యాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు అభినందనలు తెలిపారు.

# మృతుని కుటుంబానికి పది వేలు అందచేత



చాట్రాయి, జనవరి 27, ప్రభాతవార్త : చాట్రాయి సహకార సంఘంలో అప్పుదారుడు అయిన ఓరుగంటి బుచ్చియ్య ఇటీవల మృతి చెందగా మట్టి ఖర్చుల నిమిత్తం 10వేలు చాట్రాయి సంఘ ఛైర్పర్సన్ తుమ్మల రామ్మోహనరావు చేతుల మీదుగా కుటుంబ సభ్యులకు అందచేశారు. సహకార సంఘంలో రుణాలు తీసుకున్న రైతులకు అండగా ఉండాలని ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని తుమ్మల అన్నారు. ఈ కార్యక్రమంలో డిటిపి జిల్లా అధికార ప్రతినిధి మందపాటి బసవారెడ్డి, సంఘ డైరెక్టర్లు కాలసాని సత్యనారాయణ, దివ్వెల జయరాజు, మరియు తుమ్మల కరుణాకర్, తుమ్మల జగన్ తదితరులు పాల్గొన్నారు.

# కార్యకర్తే అధినేత కార్యక్రమం



చింతలపూడి.. ప్రభాత వార్త : చింతలపూడి మండలం ప్రగడవరం పంచాయతీ ఫాతిమాపురంలో కార్యకర్త అధినేత కార్యక్రమంలో భాగంగా రేషన్ దుకాణని ప్రారంబించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చింతలపూడి నియోజకవర్గం అభివృద్ధి తో పాటు కార్యకర్తలకు ప్రాధాన్యత ఇస్తామని, అన్నారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమ రెండు కళ్లుగా భావిస్తూ, ముందుకు వెళ్తుందని అన్నారు. తెలుగుదేశం పార్టీకి క్రమశిక్షణ, కష్టపడి పనిచేసే కార్యకర్తలే బలంమని, పార్టీ బలోపేతం కోసం గ్రామీణ స్థాయి నుంచే పటిష్టమైన వ్యవస్థను నిర్మించాలని అన్నారు. కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ, ప్రజల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ ముందుకు వెళ్లాలి అని సూచించారు. సీఎం చంద్రబాబు నాయకత్వం రాష్టానికి అవసరం, అనుభవజ్ఞుడైన నాయకుడిగా పాలనలో స్పష్టమైన దృష్టితో ముందుకు సాగుతున్నారని ప్రశంసించారు. ఆర్థిక సంక్షోభంలో ఉన్న రాష్ట్రాన్ని గాడిలో పెట్టే శక్తి చంద్రబాబుకే ఉందని, అభివృద్ధి, సంక్షేమం రెండింటినీ సమతుల్యం చేస్తూ పాలన సాగిస్తున్నారు. రాష్ట్రానికి బాబు నాయకత్వం ఎంత అవసరమో ప్రజలే గుర్తిస్తున్నారు అని అన్నారు.

# వివాదాస్పదంగా పంచాయతీ కార్యదర్శుల తీరు,

## నెగ్గిపూడి పంచాయతీ పాలకవర్గ సమావేశం వాయిదా

## రికార్డుల అప్పగింతపై వార్డు సభ్యుల నిరసన




పెనుమంట్ర, జనవరి 27, ప్రభాతవార్త: మండలంలోని నెగ్గిపూడి గ్రామపంచాయతీలో కార్యదర్శుల పనితీరు వివాదాస్పదంగా మారింది. వివరాల్లోకి వెళితే, నెగ్గిపూడి గ్రామపంచాయతీ గ్రేడ్--1 కార్యదర్శి గుత్తికొండ వెంకటేశ్వర్లు గత అక్టోబర్ నెలాఖరున పదవీ విరమణ చేశారు. రిటైర్మెంట్?కు ముందు రోజు పాలకవర్గ సమావేశాన్ని నిర్వహించిన ఆయన, ఆ సమావేశ సమాచారం వార్డు సభ్యులకు పూర్తిగా తెలియజేయకుండా హడావుడిగా పదవీ విరమణ చేశారనే ఆరోపణలు ఉన్నాయి. రిటైర్మెంట్ అనంతరం ఇప్పటివరకు గ్రామపంచాయతీకి సంబంధించిన పూర్తి రికార్డులను సంబంధిత కార్యాలయానికి అప్పగించలేదని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఇటీవల నియమితులైన గ్రేడ్--1 కార్యదర్శి రాజరాజేశ్వరి మూడు నెలల గడువు పూర్తవుతుందన్న కారణంతో పాలకవర్గ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అయితే, గత రెండేళ్లుగా పదవీ విరమణ చేసిన పంచాయతీ కార్యదర్శి వ్యవహార శైలిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పాలకవర్గ సమావేశాల వివరాలను కొంతమంది వార్డు సభ్యులకు తెలియజేయకపోవడం, రికార్డులు కోరినప్పుడు 'అదిగో--ఇదిగో' అంటూ కాలయాపన చేయడం వల్ల మరింత సందేహాలు నెలకొన్నాయి. మంగళవారం జరిగిన సమావేశంలో వార్డు సభ్యులు రికార్డులను పరిశీలన నిమిత్తం అందజేయాలని కోరగా, తన వద్ద గానీ, కార్యాలయంలో గానీ ఎలాంటి రికార్డులు లేవని, రిటైర్ అయిన కార్యదర్శి గుత్తికొండ వెంకటేశ్వర్లు పూర్తిస్థాయిలో రికార్డులు అప్పగించలేదని ప్రస్తుత కార్యదర్శి రాజరాజేశ్వరి తెలిపారు. మూడు నెలలుగా రికార్డులు అప్పగించని విషయాన్ని పై అధికారులకు తెలియజేశారా అని ప్రశ్నించగా, ఆమె స్పష్టమైన సమాధానం ఇవ్వలేదని సభ్యులు తెలిపారు. ఈ పరిస్థితుల్లో రిటైర్డ్ కార్యదర్శి గుత్తికొండ వెంకటేశ్వర్లు పూర్తి రికార్డులు అప్పగించిన తర్వాతనే తదుపరి గ్రామపంచాయతీ పాలకవర్గ సమావేశం నిర్వహించాలని సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. దీంతో పాలకవర్గ సమావేశాన్ని వాయిదా వేయాల్సి వచ్చింది. ఇదిలా ఉండగా, రిటైర్డ్ పంచాయతీ కార్యదర్శి గుత్తికొండ వెంకటేశ్వర్లు వ్యవహార శైలిపై పీజీఆర్ఎస్?లో ఇప్పటికే ఫిర్యాదులు ఉన్నప్పటికీ, వాటిపై ఇప్పటివరకు పూర్తిస్థాయి విచారణ జరగకపోవడం గమనార్హం.